1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 12
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఫిబ్రవరి 2019



అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం:ఫిబ్రవరి 21

అంతర్జాతీయ దేశీయ భాషల సంవత్సరం 2019



దేశీయ భాషలను
మూల వాసుల
రాబోయే తరాలకు అందిద్దాం

భాషతో
మూడు ముక్కలాట–
తెలుగా! ఇంగ్లిషా! తెలుగిషా!
– ఆచార్య వెల్చేరు నారాయణరావు

మాతృభాషపట్ల నిర్లక్ష్యం కొంప ముంచుతుంది
–ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు

భాషగానే బోధిస్తే...మరుగుజ్జుగా బతికి, నిస్సంతుగా నశిస్తుంది
మాధ్యమంగా వినియోగిస్తే...జీవితాన్నిచ్చి, జాతిని నిర్మిస్తుంది



'అమ్మనుడి' పత్రికకు చందాదారులుగా చేరండి ప్రతినెలా పత్రికను పోస్టులో మీ ఇంటికే అందుకోండి.

చందా వివరాలు

శాశ్వత చందా: రూ.5000

5 సం॥ : రూ.1000

3 సం॥ : రూ. 700

1 సం॥ : రూ. 240

కొత్తగా చందాదారులుగా చేరి బహుమతులుగా ఈ పుస్తకాలను పొందండి

✦ శాశ్వత చందా రు. 5000/- చెల్లించి **'తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం'**, **'ద్రావిడ మంగోలు భాషల జన్యుసంబంధం'** రెండు పుస్తకాలనూ ఉచితంగా పొందండి.

✦✦ 5 స॥లకు చందా రు.1000/-లు చెల్లించి **'ఎల్లలులేని తెలుగు'** పుస్తకాన్ని ఉచితంగా పొందండి.

✦✦✦ 3 సం॥ చందా రు. 700/- చెల్లించి, **'తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం'** పుస్తకాన్ని ఉచితంగా పొందండి.


భాషాభిమానులు, రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల ప్రజలు అందరూ చదువదగ్గ ఈ క్రింది పుస్తకాలు మా వద్ద విడిగా కూడా లభిస్తాయి.

స.వెం.రమేశ్ రచన




ఎల్లలు లేని తెలుగు
వెల : రు.200/-లు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు




తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం
వెల :రు. 100/-



ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం
వెల : రు.350/-

బంగారయ్య రచన



నుడి - నానుడి
వెల : రు.200/-

పుస్తకాల ధరను ఎం.ఒ.గా ఈ క్రింది చిరునామాకు పంపిస్తే పుస్తకాలను కొరియర్‌లోగాని, స్పీడ్ పోస్టులో గాని పంపిస్తాము.

'అమ్మనుడి' పత్రిక, 8-386, జీవక భవనం
అంగల కుదురు (పోస్టు) తెనాలి, గుంటూరు -522210
డా॥ సామల లక్ష్మణబాబు (9440448244) ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఫిబ్రవరి 2019

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో www.ammanudi.org చూడండి.

లోపలి పుటలలో....

	అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం	రహ్మానుద్దీన్‌షేక్	5
సంపాదక హృదయం :	భాషగానే బోధిస్తే...		7
ప్రపంచ మాతృభాషా దినోత్సవం :	మాతృభాషలు – మూలాలు	వెన్నెలకంటి రామారావు	9
హెచ్చరిక :	మాతృభాషల పట్ల..	డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు	11
తొవ్వ :	భాషతో మూడు ముక్కలాట...	రహ్మానుద్దీన్	13
కంప్యూటర్లు – తెలుగు :	తెలుగు భాషకు ఆధునిక హోదా – 13	వీవెన్	16
శ్రద్ధాంజలి :	బహు కళల కాణాచి...	జయధీర్ తిరుమలరావు	18
సైన్సు దినోత్సవం :	అందరికీ సైన్స్ అందిద్దాం	నాగసూరి వేణుగోపాల్	20
భాషా– సంస్కృతి :	దక్షిణ తెలంగాణలో కోయలు...	డా॥ శివరామకృష్ణ 'శక్తి'	24
సాహిత్యరంగం :	వ్యంగ్య రచనా విశారదుడికి...	మధురాంతకం నరేంద్ర	29
పొరుగు తెలుగు :	కన్నడ తోటలో విరిసిన తెలుగు...	రంగనాథ రామచంద్రరావు	32
పిట్ట చూపు :	మహిళా సాధికారత మాటలకే...	చలసాని నరేంద్ర	36
వేమన :	శబ్దగాండీవి వేమన– 7	కీ.శే. దుర్గానంద్	39
తెలుగు వైద్యగ్రంథం :	తొలి తెలుగు వైద్య గ్రంథం...	డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి	44
పెద్దోరి తీపి గురుతులు:	ఆదర్శ జీవనంతో....	సన్నిధానం నరసింహశర్మ	46
చరిత్ర పరిశోధకులు :	కొనకళ్ల కృష్ణమూర్తి	జి. వెంకటేశ్వరరావు	48
పుస్తక సమీక్ష :	అంతర్వాహిని (నా కథ)	ఎం.వి.శాస్త్రి	49
గ్రంథాలయం :			50

భాషోద్యమ కథానిక :

మనవూరు – మన భాష	దాసరి శివకుమారి	26

కవితలు :

1. ఆవిష్కరణ	డా॥ ఎన్.గోపి	10
2. యుద్ధం	కెంగర మోహన్	35
3. నేలపై నడయాడే శివుడా	డా॥ సిరి	38

రేఖాచిత్రాలు: పావులూరి చిదంబరేశ్వరరావు

వ్యంగ్యచిత్రాలు: సరసి

కంప్యూటరీకరణ : లంకె జనార్దన్

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

– సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136 e-mail : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో – చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు – 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ – 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**–1. ఫోన్:7386223538.

హెచ్చరిక

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు – మొత్తంగా తెలుగు జాతికి – కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం
యునెస్కో సంస్థ ప్రకటన



భాషలు – మనుషులకు అస్తిత్వాన్ని, భావప్రకటనను, సామాజిక నడవడికను, విద్యను –అభివృద్ధిని ఊహకందని విధంగా అందించే సంక్లిష్టమైన సాధనాలు. ఇవి మనిషి మనుగడకు, ఈ భూమి అస్తిత్వానికి ఎంతో అవసరం. కానీ ప్రపంచీకరణ నేపధ్యంలో భాషలు కనుమరుగయ్యే దిశగా తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. భాషలు అంతరించిపోవడంతో ఆ భాషలు మాత్రమే కాకుండా, ఆయా భాషలతో పెనవేసుకుని ఉన్న సంస్కృతులూ కనుమరుగవు తున్నాయి. అవకాశాలు, సాంప్రదాయాలు, జ్ఞప్తి, భావ ప్రకటన–ఆలోచించే విధానాలలోని అనల్ప విధానాలు – ఇవన్నీ భవ్యమైన భవితవ్యానికి అవసరమైన ముఖ్యమైన వనరులు – ఇవి కూడా భాష అంతరించిపోతే, ఆ భాష మాట్లాడే భూభాగంలో కనుమరుగు అవుతాయి.

ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం – ప్రపంచ జనులు ప్రస్తుతం మాట్లాడుతున్న 6000 భాషల్లో 43% అంటే కనీసం సగం భాషలు కొన ఊపిరితో ఉన్నాయి. కొన్ని వందల భాషలు మాత్రమే విద్యావ్యవస్థలో, రాజకీయ భాషలుగా, ప్రజాబాహుళ్యానికి అందుబాటులో చెలామణి అవుతున్నాయి. డిజిటల్ ప్రపంచంలో అస్తిత్వం కలిగిన భాషల సంఖ్య వంద కన్నా తక్కువే.

బహుభాషత్వాన్ని, భాష–సంస్కృతులలోని వైవిధ్యాన్ని ప్రోత్స హించేందుకే ఫిబ్రవరి 2000 నుండి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని యునెస్కోలో జరుపుకుంటున్నాము.

మనతోటి అదృశ్య సంస్కృతులను కాపాడి, భద్రపరిచి, అభివృద్ధి పరచడంలో ప్రధాన భూమిక భాషలకు ఉంది. అమ్మనుడిలో ప్రసార–ప్రచారాలు జరిపే అన్ని ప్రయత్నాలు భాషా వైవిధ్యాన్ని, బహుభాషా విద్యను ప్రోత్సహించడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భాషాపరమైన, సాంస్కృతిక పరమైన సంప్రదాయాలను పూర్తి స్థాయిలో అర్థం చేసుకునేందుకు సహాయపడి, ఒకరినొకరం అర్థం చేసుకొని, సుహృద్భావంతో, కలిసిమెలిసి ఉండేలా దోహదపడుతుంది.

ప్రతి రెండు వారాలకు ఒక భాష తనతో పాటు–ఒక పూర్తి సాంస్కృతిక–మేధాసంపత్తి భూయిష్ట సాంప్రదాయాన్ని తుడిచిపెట్టి కనుమరుగవుతున్నది.

భాషావైవిధ్యం రోజు రోజుకూ ప్రమాదంలో పడుతుంది, ఎన్నెన్నో భాషలు కనుమరుగవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం జనాభాకు వారు మాట్లాడి, వారికి అర్థమయ్యే భాషలో (వారి మాతృభాషలో) విద్య అందుబాటులో లేదు. అయితే మాతృభాషలో విద్యకు సంబంధించిన ప్రాముఖ్యతని, ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో మాతృభాష విద్య అవసరాన్ని, అలాగే సాధారణ ప్రజల జీవితాల్లో మాతృభాష ప్రభావాన్ని గమనించిన తరువాత మాతృభాష విద్యలో, మాతృభాషకు తోడుగా ఉద్యోగానికి పనికొచ్చే భాషను నేర్పే విద్యా విధానాల్లో అభివృద్ధి జరిగింది.

దీర్ఘ స్థాయిలో సమాజం అన్ని సంస్కృతులనూ, ఆ సంస్కృతులు ఇచ్చే అపార సంప్రదాయ జ్ఞానాన్నీ భద్రపరిచి, అందరికీ అందించాలంటే ఆ సంస్కృతుల భాషలు మనుగడలో ఉండాలి, ఆ భాషలు మనుగడలో ఉండాలంటే బహుభాషా, బహు సంస్కృతులను సమాజాలు నిలదొక్కుకోవాలి.

– రహ్మనుద్దీన్ షేక్

దేశీయ భాషల అంతర్జాతీయ సంవత్సరం-2019



7,000 భాషలు – ప్రపంచ వ్యాప్తంగా నేడు మాట్లాడుతున్నారని 'యునెస్కో' అంచనా

అందులో 37 కోట్లమంది మూల వాసులు ఉన్నారని, వీరి నివాస స్థానాలు 90 దేశాలలో వ్యాపించి ఉన్నాయని,

వివిధ దేశీయ సంస్కృతులు 5000 ఉన్నాయని అంచనా

మొత్తం మీద 2600 భాషలు ప్రమాదంలో ఉన్నాయంటున్న వివిధ పరిశోధనలు..

భాషలు మానవుల రోజువారీ మనుగడకు అత్యంత ఆవశ్యకం. సంభాషణలు, విద్య, సామాజిక కలుపుగోలుతనం మరియు అభివృద్ధికే కాకుండా ప్రతి వ్యక్తి అస్తిత్వానికి, సాంస్కృతిక చరిత్రకు, సంప్రదాయాలకు, జ్ఞాపకాలకు పెన్నిధి.

అంతటి విలువున్న భాషలు ప్రపంచవ్యాప్తంగా కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్నాయి.

ఈ సందర్భంలో ఐక్యరాజ్య సమితి 2019 సంవత్సరాన్ని అంతర్జాతీయ దేశీయ భాషల సంవత్సరంగా ప్రకటించింది.

ప్రజల్లో భాషల పట్ల అవగాహన పెంచేందుకు, ఆ భాషలు మాట్లాడే ప్రజల సంస్కృతి – సాంప్రదాయాలను ప్రపంచ జనాభాకు పరిచయం చేసేందుకు, ఇది దోహద పడుతుంది.

యునెస్కో 28 జనవరి 2019న అధికారికంగా దేశీయభాషల అంతర్జాతీయ సంవత్సరాన్ని అమలు పరుస్తూ, యునెస్కో హౌస్, పారిస్‌లో అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జరుపుతుంది. ఫిబ్రవరి 1న ఐక్యరాజ్య సమితి ముఖ్య సభలో 2019 సంవత్సరాన్ని సభ్య దేశాల మధ్య సంబరంగా ప్రారంభిస్తారు.

దేశీయ భాషల ప్రాముఖ్యత

విజ్ఞానం : – ప్రపంచాన్ని ఒక కొత్త దృక్కోణంలో చూపుతాయి.

శాంతి : – శాశ్వతాభివృద్ధి, పెట్టుబడి, శాంతి స్థాపనకు క్షేత్రస్థాయి ఊతమిస్తాయి.

హక్కులు : – మూలవాసులకు మౌలిక మానవ హక్కులను, మౌలిక స్వాతంత్ర్యాలను అవగాహన పరుస్తాయి.

కలుపుగోలుతనం : – సామాజిక ఐక్యతకు, సాహిత్య ఔన్నత్యానికి, పేదరికం రూపు మాపేందుకు, అంతర్జాతీయ సహకారానికి దేశీయ భాషలు దోహద పడతాయి.

వైవిధ్యం : – సాంస్కృతిక విలువలు, వైవిధ్యం, సంప్రదాయాలకు పునాది దేశీయ భాషలు.

దేశీయ భాషల అంతర్జాతీయ సంవత్సరం

2019, దేశీయ భాషలను 5 ముఖ్యమైన అంశాల అమలు ద్వారా ప్రోత్సహిస్తుంది.

1. అంతర్జాతీయ స్థాయిలో అవగాహన, చర్చ, అంతర్జాతీయ సహకారం పరిధుల్లో భాషలకు ఉన్న అవసరాన్ని చాటడం.
2. విజ్ఞాన సృజనకు, విజ్ఞాన వ్యాప్తికి, అందులోని మెలకువలు ఒక దేశీయ భాష నుండి మిగతా వాటితో పంచుకునే వీలుండే సందర్భాలను సృష్టించడం.
3. సాధారణ భాషా స్థాయికి దేశీయ భాషలను తీసుకురావడం.
4. భాషను మాట్లాడే ప్రజల అవగాహన స్థాయిని పెంచడం. తద్వారా వారిని బలోపేతం చేయడం.
5. కొత్త విజ్ఞానాన్ని దేశీయ భాషల్లోకి చొప్పించి, ఆ భాషల పెరుగుదల మరియు అభివృద్ధికి దోహద పడటం.

సంపుటి : 4 సంచిక : 12
అమ్మనుడి
ఫిబ్రవరి 2019

సంపాదకీయం

భాషగానే బోధిస్తే...మరుగుజ్జుగా బతికి, నిస్సంతుగా నశిస్తుంది
మాధ్యమంగా వినియోగిస్తే జీవితాన్నిచ్చి...జాతిని నిర్మిస్తుంది

2014లో రెండు రాష్ట్రాలుగా తెలుగునాడు చీలిపోయిన తర్వాత – భాష విషయంలో తెలంగాణం స్వాభిమానంతో ఎంతో ముందుకు సాగుతుందని అనేక మంది ఆశించారు. ఈ అభిప్రాయాన్ని బలపర్చుతూ 'నడుస్తున్న చరిత్ర' సంపాదకీయాలు వ్రాసింది. ఈ ఆశతోనే తెలుగు భాషోద్యమ సమాఖ్య కొన్ని సందర్భాలలో తెలంగాణ ఉద్యమాన్ని మౌలికంగా బలపరచింది. 2012లో ప్రభుత్వం తిరుపతిలో తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభలను కొన్నాళ్ళపాటు వాయిదా వేయాలని, తెలంగాణను కూడ కలుపుకు రావాలని ప్రభుత్వాన్ని కోరింది కూడా. తర్వాత రెండేళ్లకు ప్రత్యేకరాష్ట్రం ఏర్పడి, తెలంగాణ రాష్ట్ర సమితి చంద్రశేఖర రావుగారి నేతృత్వంలో ప్రభుత్వాన్నేర్పరచిన తర్వాత నాలుగున్నరేళ్లకు మళ్లీ ఎన్నికలు జరిగి అదే నాయకత్వంలో రెండవ ప్రభుత్వం కూడా ఏర్పడింది. దాదాపుగా ఈ ఐదేళ్ల లోపు ఈ ప్రభుత్వం తెలుగుకోసం చేసిందేమిటి?

తెలంగాణ తొలి రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగు మాధ్యమానికి ఒకటో తరగతి నుండే స్వస్తి చెప్పి, పూర్తిగా పాఠశాల విద్యను ఆంగ్ల మాధ్యమంలోకి తెస్తూ విధాన నిర్ణయం తీసుకొంది. దీని ప్రకారం – ఒక్కొక్క ఏడాదికి ఒక్కో తరగతి చొప్పున 'మాధ్యమంగా' తెలుగు అదృశ్యమవుతుంది. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమానికి కొత్త ప్రవేశాలను మూసి వేశారు. అందువల్ల తెలుగుకు నష్టం జరిగిపోతున్నదని వచ్చే ఆందోళనకు పరిష్కారంగా – ఒక పాఠ్యాంశంగా (ఒక సబ్జెక్టుగా) తెలుగు బోధనను తప్పనిసరి చేయనున్నామని విస్తృతంగా ప్రచారం మొదలుపెట్టి, పాలనా పరమైన ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఇందుకోసం 2003లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే జి.ఒ.నెం. 63 వచ్చి వుందని ఇక కొత్తగా తెలంగాణ ప్రభుత్వం ఏం చేయనున్నదనే ప్రశ్న వచ్చింది. దానిపై స్పందిస్తూ – జి.ఒ బదులుగా ఒక సమగ్ర చట్టాన్ని తెస్తామని, దానిలో ఇంటర్మీడియెట్‌ను కూడా చేర్చుతామని, ఇందువల్ల ఒక భాషగా తెలుగుకు ఢోకా లేకుండా వుంటుందని ప్రభుత్వమూ, వివిధ అధికారులూ ప్రకటనలు చేశారు. 2017 డిసెంబరులో ప్రపంచ తెలుగు మహాసభలను భారీగా నిర్వహించి ఈ అంశాన్ని ప్రచారం చేశారు. ఇంకా చాలా చాలా తెలుగు కోసం చేస్తామని, వాటి అన్నిటినీ సభల ముగింపు సభలో ముఖ్యమంత్రి ప్రకటిస్తారని చెప్పారు. ఆ రోజున ఏమీ చెప్పలేక, కొన్ని అంశాలపై ఇంకా ఆలోచించవలసి వుందని చెప్పి, ప్రకటనను నిరవధికంగా వాయిదా వేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో జి.ఒ. స్థానంలో చట్టాన్ని తెచ్చారు. దాని ప్రకారం తెలుగు భాష – తెలంగాణలో ఒక భాషగా మాత్రమే 1 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే బోధించబడుతుంది. తెలుగును మాధ్యమంగా అమలు పరచడమనే ప్రసక్తే లేదు. ఇంటర్మీడియట్‌లో తెలుగును ఒక భాషగా బోధించడంగాని, 'ఉత్తుత్తి సంస్కృతం' పెత్తనాన్ని తొలగించడం అనే ఆలోచనగాని ఎక్కడా లేదు. అంటే – సమగ్రంగా తెస్తామన్న చట్టం బదులుగా పాత జి.ఒ.నే చట్టరూపంలో కొచ్చిందన్నమాట!

ఇక – తెలుగులో పరిపాలన సాగించాలన్న ఉత్తర్వు 1966లో చట్టంగా వచ్చినప్పటి నుండి, అప్పుడప్పుడూ జి.ఒ.ల రూపంలో ప్రకటించిన ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ ఆనవాయితీనే ఈ ప్రభుత్వమూ కొనసాగిస్తోంది. ఏతావాతా తెలంగాణ కొత్త ప్రభుత్వం తెలుగుకోసం చేసిన సేవల సారాంశం ఇది. మళ్ళీ ప్రపంచ సభలు జరుపుతారని వినవస్తోంది. ఈ విషయంలోనూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శాన్ని మరో విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నదన్నమాట! ఏ లక్ష్యాల సాధనకోసమో?!

ఇప్పుడు పలు విధాలుగా ఆంధ్ర – తెలంగాణ ప్రభుత్వ నేతలు పరస్పర నిందారోపణలతోపాటు పోటాపోటీ పాలనా రాజకీయం, ప్రజలకు తాయిలాల ప్రకటనలూ చేస్తున్నారు. కాని తెలుగులోపాలన గురించిగానీ, బోధన గురించిగానీ మాట్లాడుతున్న వారు ఒక్కరైనా ఉన్నారేమో చూడండి! ఇదంతా మనం ఎప్పుడూ చెప్పుకొంటున్న కథే. ఏదైనా పండుగ సందర్భాల్లో మాత్రం తాము సాంస్కృతిక రంగానికి చేస్తున్నదాన్ని ప్రస్తావించి, అదంతా భాషా సేవేనని ప్రకటించు కొంటారు. 'తానా తందానా' అనేవారు సానుకూలంగా స్పందిస్తారు. తక్కినవారు పెదవి విప్పరు. అధికారం బయటవున్న పార్టీల నేతలూ నోరు విప్పరు – వారికీ ఇది ఓట్లు రాబట్టే అంశం కాదు గనుక!

కెసిఆర్ తన శిష్యుడే అని భావించే ఆంధ్రరాష్ట్ర నేత చంద్రబాబు నాయుడుగారు – తెలుగు సంగతికొచ్చేసరికి పాపం విచిత్రమైన పరిస్థితిలో ఉన్నారు. దీనికి కారణం – తన పార్టీ పేరు. ఆ పేరులో 'తెలుగు' లేకపోతే ఆయనకు ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడా పేరును తొలగించలేరు. కొనసాగిస్తూ తనకు తాను సమర్థించుకోలేరు. తెలుగుపట్ల ఆయన అనుసరిస్తున్న విధాన ఫలితం అది! ఇప్పుడు చంద్రబాబుగారి హయాంలో ఆయన ఆత్మీయ మంత్రి నారాయణగారు పనిగట్టుకొని పాఠశాలలో తెలుగు మీడియంలో ప్రవేశాలు లేకుండా దీక్షతో పనిచేస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమ పాఠశాలలు లేవు. ఈ విషయంలో కెసీఆర్‌గారి వలె ధైర్యంగా ప్రవర్తించలేక నిశ్శబ్దంగా దానిని సాధించింది చంద్రబాబుగారి ప్రభుత్వం. ఉద్యమకారుల పోరు పడలేక తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ స్థాపనకు జి.ఒ. ఇచ్చి చేతులు కడుక్కుంది. నిజానికి దానిని ఒక చట్టంగా ఇస్తామని ఆయన ప్రకటించి మాట తప్పారు.

రెండు రాష్ట్రాల అధినేతలూ తెలివిగలవారే. అందుకనే ఒకరు తెలుగుజాతి, తెలుగువారి ఘనతను అడ్డుపెట్టుకుంటుంటే, మరొకరు తెలంగాణ పోరుగడ్డనూ, తెలంగాణకు తెలుగుతో వున్న బొడ్డు బంధాన్నీ, ప్రత్యేకతలనూ అడ్డుపెట్టుకుంటున్నారు. కాని, ఇద్దరూ తెలుసుకోవలసిన సంగతి ఒకటుంది. తెలుగుభాష, తెలంగాణ గొప్పదనమూ నిలిచేదీ అభివృద్ధి చెందేదీ – ఆ భాషను మాట్లాడే ప్రజలున్నంత వరకే. తెలుగును నిత్య జీవితంలో, బతుకు దెరువులో మర్చిపోయి, ఆధునిక జీవితంలో, అన్వేషణలో, శాస్త్ర సాంకేతిక రంగాలతో సహా అన్ని అవసరాలకూ వినియోగిస్తూ శక్తి సామర్థ్యాలతో వికసిస్తూ వుంటేనే – ఆ పేరు నిలుస్తుంది. ఇందుకోసం తెలుగును ఒక మాధ్యమంగా అన్ని రంగాల్లో వినియోగించుకోవాలి. వినియోగిస్తూ వుంటేనే ఏ భాషైనా వికసిస్తుంది. మనకన్నా ఎంతో చిన్న భాష, అతి తక్కువ వయసున్న ఆంగ్లం వినియోగంలో పెంచుకొంటూ పోతేనే ఈనాటి స్థితికి చేరుకోగలిగింది. వినియోగించుకొంటే అన్ని భాషలకూ ఆ శక్తి వుంటుంది. మన భాషకూ ఆ శక్తి వుంది. సాహిత్యంలో ఎంతో ఉన్నత స్థాయికి చేరిన తెలుగు, 'లిపి'గా కూడా ప్రపంచంలోనే రెండోస్థాయికి చెందిన మన తెలుగును మనం ఎందుకు అణచివేసుకుంటున్నాం? పరిశీలించి చూస్తే – దీనికి మూలకారణం తొలినుండీ మన పాలకులే. మన పాలకులు తలచుకుంటే ఇప్పటికైనా తెలుగును ఉన్నతస్థాయికి చేర్చగలం. ఇప్పుడొచ్చిన సాంకేతిక ప్రగతి వెలుగులో అత్యుత్తమమైన, సర్వోత్తమమైన భాషగా తెలుగు ఎదగ గలదు. మన భాషను మనమే కాదనుకుంటే, మన పాలకులే అణచివేతకు పూనుకొంటే – ఇక దిక్కేది?

ఇటు ఆంధ్ర చంద్రుడూ, అటు తెలంగాణ చంద్రుడూ కలిసి పూనుకొంటే తెలుగు అన్ని విధాలా ముందడుగు వేస్తుంది.

కీలకమైన సంగతేమిటంటే –

తెలుగును కేవలం ఒక భాషగా బోధిస్తే...మరుగుజ్జుగా బతికి, నిస్సంతుగా నశిస్తుంది. ఒక భాషగా మాత్రమే తెలుగును నేర్చుకొనే విద్యార్థులు – భాషకు సంబంధించి బి.టి.విత్తనాలుగా మిగిలిపోతారు.

ఒక మాధ్యమంగా తెలుగును బోధనా రంగంలో అన్ని స్థాయిల్లో వినియోగిస్తే అది మన జాతికి జీవితాన్నిస్తుంది. తెలుగు భాషా జాతీయులు ప్రయోజకులుగా, మేధావులుగా విలసిల్లుతారు.

తెలుగు భాషను కాపాడి, పెంపొందించే విషయంలో మన ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి ఆలోచన సాగిస్తే, రెండు రాష్ట్రాలూ బాగుపడతాయి...

తేదీ : 31-1-2019

సామల రమేష్‌బాబు

వెన్నెలకంటి రామారావు
9550367536

మాతృభాషలు - మూలవాసులు

'దేశీయ భాషలతోనే - అభివృద్ధి, శాంతిస్థాపన, సయోధ్య వంటివి సుసాధ్యం' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది మాతృభాషా దినోత్సవ సంబరాలు జరుగనున్నాయి. అంతర్జాతీయ సమాజం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న జరుపుకునే మాతృభాషా దినోత్సవాన్ని ఈసారి అంతర్జాతీయ దేశీయ భాషల దినంగా జరపడంలో విశేషం ఉంది. అంతర్జాతీయ సమాజం 'యుగ సంక్షోభం' (సామాజిక-ఆర్థికబీ పర్యావరణ సంక్షోభాలు)లో కూరుకుపోయిన తరుణంలో పర్యావరణ పరిరక్షణలో దేశీయ భాషల అవసరాన్ని గుర్తించక తప్ప లేదు. ప్రకృతి-సమాజాల మధ్య ఆదాన ప్రదాన క్రమానికి గండి పడి, అకస్మిక, పునరుద్ధరణకు వీలుకాని స్థితికి వాతావరణ మార్పులు చేరుకుంటున్న రూపంలో ముంచుకొస్తున్న పర్యావరణ సంక్షోభం నుంచి బయటపడాలంటే దేశీయ భాషలు మాధ్యమం (మీడియం) గా, సాధనంగా ఉపకరిస్తాయన్న విషయం అనుభూతమవుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి మాతృభాషా దినోత్సవాన్ని భాష-పర్యావరణం మధ్యగల పరస్పర ఆధారితను, పరస్పర పూరకత్వాన్ని సాధించే లక్ష్యంతో జరుపతలపెట్టారు.

నిర్దిష్ట భౌగోళిక పర్యావరణం అనుగుణంగా మానవ సహకార, సమిష్టి కార్యకలాపమైన 'శ్రమ' క్రమంలోనే భాష, చైతన్యం ఉద్భవించాయి. భూగోళంపై నెలకొన్న పర్యావరణ వైవిధ్యతల ప్రతిఫలనంగానే వైవిధ్యభరితమైన భాషలు అవతరించాయి. ప్రపంచంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న 7వేలు పై చిలుకు భాషల్లో 60 శాతం జీవైవిధ్యం మెండుగా ఉన్న ఉష్ణమండల ప్రాంతమైన దక్షిణార్ధగోళ దేశాలలో ఆవిర్భవించాయి. పపువా న్యూగినియా, ఇండోనేషియా దేశాలు ప్రపంచంలోని 'మహా జీ వ వైవిధ్య' (మెగా బయోడైవర్సిటీ) ప్రాంతాలు. పర్యవసానంగా ప్రపంచభాషల్లో 25 శాతం భాషలు ఈ ప్రాంతాల్లో ఉనికిలో ఉన్నాయి. భారత్‌లోనూ కూడా 'మహా జీవవైవిధ్య' ప్రాంతాలు ఉన్నందువల్ల దాదాపు 380 బాషలు వాడుకలోకి వచ్చాయి. మానవ సమాజ అభివృద్ధి క్రమంలో ఆయా సమాజాల భాషా సంపద అభివృద్ధి అయింది. ప్రతిభాషా తానున్న పర్యావరణాన్ని, ఆ పర్యావరణంతో పెనవేసుకున్న సమాజపు సమిష్టి అనుభూతుల్ని, అనుభవాలను, భిన్న సంబంధాల్ని, వాటి అంతస్సా రాన్ని ప్రతిబింబిస్తుంది. సమాజ భౌతిక జీవిత వికాసానికి అనుమేయం గా ఆయా భాషలు అభివృద్ధి చెందుతాయి.

అభివృద్ధి పేరుతో జరిగే మితిమీరిన పారిశ్రామికీకరణ, మితిమీరిన సంపద కేంద్రీకరణ, మితిమీరిన జనాభా కేంద్రీకరణ కారణంగా సమాజానికీ, ప్రకృతికి మధ్య వైషమ్యం తీవ్రతరమై సామాజిక-పర్యావరణ సంక్షోభం తీవ్రతరమవుతుంది. ఈ పరిణామం ప్రకృతి-సమాజాల సమ తుల్యంలో బతుకుతూ, భౌతిక జీవితం చారిత్రకంగా గిడసబారిపోయి, (హిస్టారికల్ మార్కింగ్ టైం) శతాబ్దాలుగా మూలవాసుల సమాజాలు ప్రపంచవ్యాప్తంగా కొనసాగు తున్నాయి. ప్రపంచీకరణ క్రమంలో కార్పొరేట్ పేరాశకు పర్యావరణం విధ్వంసమవుతున్న కారణంగా మూలవాసుల జీవితాలు, భాషలు, సంస్కృతి తీవ్ర ప్రమాదంలో పడ్డాయి. పర్యవసానంగా స్థానిక జీవ వైవిధ్యపు జ్ఞానాన్ని తవ్వితీస్తున్న, నిక్షిప్తం చేస్తున్న స్థానిక భాషలు అంతరించి పోతున్నాయి. జ్ఞానం ఎప్పుడూ స్థానికం నుంచి ప్రారం భమై విశ్వజనీనమౌతుంది. ఆ ప్రయాణానికి అతి ముఖ్యమైనది భాష. కచ్చితంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసంతో, దాంతో ముడిపడిన భాషలు అంతరించిపోవడానికి దారితీస్తుంది. భాషలు అంతరిస్తే, దానికి కారణంగా స్థానిక విజ్ఞానం అందకుండా పోతుంది. పర్యవసానంగా సంబంధిత పర్యావరణంతో వ్యవహరించే తీరులో అహేతుకత చోటు చేసుకుంది. దాంతో పర్యావరణ విధ్వంసం తీవ్రంగా జరుగుతోంది. 'యుగ సంక్షోభం' నేడు కీలక దశకు చేరుకున్న తరుణంలో పక్షం రోజులకు ఒక స్థానిక భాష లెక్కన భూగోళంపై తుడిచి పెట్టుకు పోతున్నది. పర్యవసానంగా పర్యావరణ విధ్వంసాన్ని నిలువరించడం అసాధ్యంగా మారే ప్రమాదం ముంచుకొస్తోంది. ప్రపంచ కార్పొరే ట్ వర్గాల లాభాపేక్ష, అత్యాశలకు ముసురుకొస్తున్న తీవ్ర వాతావరణ మార్పులు, వారి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభు త్వాలు అనుమతిస్తున్న సాగు నీటి ప్రాజెక్టులు, ప్లాంటేషన్లు, మైనింగ్ కార్యకలాపాలు, చమురు తదితర నిక్షేపాల వెలికితీత, రోడ్లు వగైరా మౌలిక సదుపాయాల కల్పన వంటి అభివృద్ధి కార్యకలాపాలు మూల వాసీ ప్రజల జీవనాన్ని, భాషసంస్కృతుల విధ్వంసానికి పెద్ద ఎత్తున దారితీస్తోంది. పర్యవసానంగా స్థానిక పర్యావరణ విధ్వంసాన్ని నిలు వరించి, దాన్ని పరిరక్షణకు పునాది తుడిచిపెట్టుకుపోతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మూలవాసులకు చెందిన దేశీయ భాషల పరి రక్షణ కార్యక్రమాన్ని భాషాదినోత్సవం సందర్భంగా ప్రచారం చేసేం దుకు ఐక్యరాజ్య సమితి కంకణం కట్టుకుంది.

అయితే దేశీయ భాషలు, పర్యావరణ పరిరక్షణ మధ్య పర స్పర ఆశ్రిత అంశాలు అనే విషయం వాస్తవమే గానీ, ఆ రెండింటి విధ్వంసానికి కారణమైన అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలు, బహుళజాతి సంస్థలు వాటికి ప్రాతినిథ్యం వహిస్తూ పబ్బం గడుపు కుంటున్న దేశీయ కార్పొరేట్ శక్తులు, స్థానిక ప్రభుత్వాలు, పాలకుల మౌలిక స్వభావాన్ని విశ్లేషించడంలో అటు పర్యావరణ వేత్తలు, ఇటు మాతృభాషా పరిరక్షణవేత్తలు దృక్పథరాహిత్యం కలిగి ఉండటం దురదృష్టకరం.

ప్రపంచ జనాభాలో మూలవాసీలు 5శాతంగా ఉన్నప్పటికీ, వారు 22 శాతం భౌగోళిక ప్రాంతంలో, 80 శాతం జీవవైవిధ్య

ప్రాంతాల్లో విస్తరించి, ప్రపంచ భాషల్లో అత్యధిక భాషల వ్యవహర్తలుగా జీవిస్తున్నారు. వాతావరణ మార్పు పునాదిగా సంభవిస్తున్న పర్యావరణ సంక్షోభం మూలవాసులపైన అత్యధికంగా ప్రతికూల ప్రభావాన్ని వేస్తోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో అడవులు, జీవ వైవిధ్య విధ్వంసం కారణంగా వారు నిర్వాసితులు కావడమే కాకుండా, వారి భాషా సంస్కృతుల స్థానిక మానవ అనుభవాత్మక విజ్ఞానం అంతరిస్తోంది. పర్యావరణ సంక్షోభానికి పరిష్కారం స్థానిక విజ్ఞాన పరిరక్షణలో ఉందన్న విషయాన్ని ఐక్యరాజ్య సమితి గుర్తించి, అందుకోసం మూలవాసుల, దేశీయ భాషల పరిరక్షణ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యం లో ప్రపంచవ్యాప్తంగా మూలవాసుల్లో అస్తిత్వ ఎరుక పెరిగింది. ఆ క్రమంలో నికారుగువాలోని మోసవాస్ వర్షారణ్యాల్లో జీవిస్తున్న మయాంగ్నా తెగ వారు తమ జాతికి చెందిన విజ్ఞానసర్వస్వాన్ని (ఎన్ సైక్లోపిడియా)

రూపొందించుకునేందుకు సహకరించాలని యునెస్కో సంస్థను 2000 మధ్యలో అభ్యర్థించారు. ఆ ప్రజలు నివసిస్తున్న మెసోఅమెరికన్ బయోలాజికల్ కారిడార్ 1997లో యునెస్కో ప్రకటించిన 'వరల్డ్ నెట్‌వర్క్ ఆఫ్ బయోస్ఫియర్ రిజర్వ్' లో అంతర్భాగమైంది. 2002లో 'లోకల్ అండ్ ఇండిజీనస్ నాలెడ్జ్ సిస్టమ్స్' (ఎల్ఐఎన్కేఎస్) అనే ప్రాజెక్టును ఆ నెట్వర్క్ సంస్థ ఏర్పాటు చేసి మూలవాసీల స్థానిక విజ్ఞానం, భాష, సంస్కృతులను నిక్షిప్తం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2010లో మయాంగ్నా, స్పానిష్ భాషల్లో 450 పేజీల్లో, రెండు సంపుటాల్లో మయాంగ్నా ప్రజలు స్థానిక పర్యావరణంతో అనుబంధంలో నుంచి చారిత్రకంగా సాధించిన విజ్ఞానాన్ని మొదటిదశగా నిక్షిప్తం చేసిన ప్రయత్నం ఆహ్వానించదగినది. పర్యావరణ సంక్షోభం ప్రపంచ మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న నేటి తరుణంలో, భాషాజాతులన్నిటి అనుభవాలను నిక్షిప్తం చేసి, పరిరక్షించేందుకు అలాంటి ప్రాజెక్టులను ఒక ఉద్యమంగా చేపట్టవలసిన అవసరం ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నూ అభివృద్ధి పేరుతో సాగుతున్న పర్యావరణ, మూలవాసీ భాష-నాగరి కత, ప్రజారోగ్య విధ్వంసక సాగునీటి ప్రాజెక్టులు, ఫార్మా, పెట్రో రసాయనాల కంపెనీల ఏర్పాటు, మైనింగ్ కార్యకలాపాలను పాలకులు ఉపసంహరించుకోవాలి. అలాంటి పారిశ్రామిక, వ్యవసాయక విధానాలు విడనాడాలి. భాషా వైవిధ్యతలను పరిరక్షించే విధానాలను చేపట్టాలి. సవర భాష పునరుద్ధరణకు కృషి చేసిన గిడుగు రామ్మూర్తి స్ఫూర్తిని కొనసా గించాలి. ప్రస్తుత సమయంలో మూలవాసుల అనుభవాలను, పర్యావరణ విజ్ఞానాన్ని నిక్షిప్తం చేసేందుకు స్థానిక భాషల పరిరక్షణ ఆవశ్యకతను గుర్తించడమే కాక, వాటి విధ్వంసానికి మూలకారణమైన ప్రపంచ కా ర్పొరేట్ శక్తుల కేంద్రిత ఆర్థిక, రాజకీయ విధానాలను, వ్యవస్థలను సమూలంగా మార్చుకోవలసిన అగత్యాన్ని నువ్వు నీళ్ళు తాగుతున్న సమయంలో, దాని మూలాన్ని గురించి తప్పక ఆలోచించు...' అనే చైనా సామెత గుర్తు చేస్తోంది.

కవిత

ఆవిష్కరణ

స్టేషనరీ దుకాణమంటే
నాకెంతో ఇష్టం!
బోలెడన్ని తెల్లకాగితాలుంటాయి
వీటిని నింపాల్నంటే
ఎన్ని అక్షరాలు కావాల్నో
అక్షరాలు పదాలై
పదాలు వాక్యాలుగా మారే వేళ
లోకం కాస్తకాస్త తెలిసొచ్చేది.

పాతనోటు బుక్కుల్లో
రాయగా మిగిలిన కాగితాల్తో
రఫ్ కాపీలు కుట్టుకునే వాళ్లం.
కార్బన్ పేపరు మీద రాస్తే
అవతల తేలిన ప్రతిబింబాలు
ఇప్పటికీ థ్రిల్లే.

రబ్బరుతో తుడిస్తే
దురదృష్టరేఖలు చెరిగి పోవుగాని
రబ్బరు మాత్రం,
కొంచెం కొంచెం అరిగిపొయ్యేది.

స్టేషనరీ దుకాణమంటే
నాకెంతో ఆకర్షణ
బోలెడన్ని
పుస్తకాలు దొరుకుతాయి
బొమ్మలు
డ్రాయింగ్ పెన్సిల్‌కు పూస్తాయో
వేళ్ళలోంచి రాలిపడ్తాయో
ఇప్పటికీ అర్థం కాదు.

పెద్దబాలశిక్ష కొనడానికి
చిన్నప్పుడు పైసల్లేవు,
ఇప్పుడది జీవితంకన్న
పెద్దగా కనిపిస్తుంది.

కొత్త ఆవిష్కరణలు
వచ్చి చేరలేదని కాదు
కాని వీటికి జన్మనిచ్చింది
ఆనాటి పరికరాలే,
స్టేషనరీ దుకాణమంటే
నాకెంతో గౌరవం
కాలిక పరిణామాన్ని
తేలిగ్గా బోధపరిచినందుకు.

–డా॥ ఎన్.గోపి

గారపాటి ఉమామహేశ్వర రావు
9866128846

మాతృభాషలపట్ల నిర్లక్ష్యం కొంపముంచుతుంది

భారతీయ భాషల స్థానంలో ఇంగ్లీషును బోధనా మాధ్యమంగా మార్చడం సరైన ఎంపిక కాదు. ఇది కేవలం స్థానిక భాషలను నిర్లక్ష్యం చేసే చర్య మాత్రమేగాక, దూర దృష్టిలేని చర్యగా కూడా అవుతోంది. ప్రజల భాషలను వాడవలసిన చోట్ల, పదిమందికీ రాని భాషను వాడటం మన నిర్ణయంలోని నైతికతను ప్రశ్నిస్తోంది. ఈ విషయానికి సంబంధించిన సమస్యల గురించి కొన్ని వాస్తవాలను మీ ముందుకు తెస్తాను. భాషా విధానం గురించిన అవగాహన మనకు అందరికీ ఉండాలి.

భాష మన వారసత్వ సంపద. ఇది మానవ పరిణామంలో భాగం. భాషలు స్థానిక సంస్కృతి, నాగరికత, చుట్టూ ఉన్న ప్రకృతి గురించిన వేలాది సంవత్సరాల జ్ఞాన నిక్షేపాలు. భాష, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకొనే పరికరం మాత్రమే కాదు. అది ఒక జీవన విధానం. స్థానిక భాష ద్వారా జ్ఞానాన్ని పొందడం సులువైన మార్గం. మాతృభాషలను మనం నేర్చుకుంటాం. ఎవరూ ఏళ్లతరబడి నేర్పనవసరం లేదు. కానీ మనది కాని భాషలను ఇతరులు నేర్పాలి. ఎళ్ళతరబడి నేర్చుకోవాలి. అట్లా నేర్చుకునేందుకు సమయ నష్టం, ధన వ్యయం జరుగుతుంది.

మనం పనిచేస్తున్న స్థానిక భాష ద్వారా మన జీవనశైలి రూపుదిద్దుకొంటుంది. సమాజంలో మన పైన ఇతరుల పెత్తనం మొదటగా భాష ద్వారానే గమనించబడుతుంది. అంటే మన భాషా వాడకం తగ్గిందంటే మనపై ఇతరుల పెత్తనం మొదలైంది అనే చెప్పాలి. సాధారణంగా ఏ భాషా సమూహమైనా వారి వారి భాషలను అన్ని రంగాలలోనూ వాడుతుండాలి. అట్లా వాడటం ఆ భాష బలంగానూ ఆరోగ్యంగానూ ఉన్నదనేందుకు సూచన. మన మాతృభాషలను వాడవలసిన రంగాలలో ఉపయోగించకుంటే, మనం మన స్థానాన్ని ఇతరులకు కోల్పోతున్నామని ఖచ్చితంగా భావించాలి.

మన సమాజంలో మాతృభాషా వాడకంలో లేని రంగాలు ఉన్నాయంటే ఆయా రంగాలవలన మనం ఆదాయాన్ని కోల్పోతున్నామన్నమాటే. అంటే ఖర్చులు పెరుగుతూ ఆదాయం తగ్గుతోందని భావించాలి.

భాషా రంగాలు కుంచించుకు పోవడం అంటే నేరుగా ఆదాయ నష్టం ఒక్కటే కాదు. ఆ భాషలో ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం అని అర్థం. ఆపైన ఆ భాషలో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం జరుగుతుంది. దాంతో అనేక రకాల రంగాలలో ఎన్నో చిన్నాపెద్దా ఆదాయ వనరులు కోల్పోవడం జరుగుతుంది.ఇదంతా చూస్తే మనకేం అర్థమవుతోంది. వివిధ రంగాలలో మన మాతృభాషల వాడకంలో జరుగుతున్న నష్టం మన సమాజపు ఆర్థిక స్వాతంత్ర్యానికి హాని జరుగుతోందని తెలుస్తోంది.

ఇట్లా ఇది మాతృభాషలను నిర్లక్ష్యం చేయడం వరకే పరిమితం గాక, మన స్వంత వనరులద్వారా చేకూరే ఉపాధి అవకాశాలు పోగొట్టుకోవడమేగాక, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోవడం జరుగుతుంది. మాతృ భాషను వాడే వివిధ రంగాలు కుంచించుకుపోవడం మరణానికి మాతృ భాష చేరువవుతున్నదనేది స్పష్టం. ఇది దిగజారుతున్న మన సమాజ స్వాతంత్ర్యాన్ని ప్రతిబింబిస్తోంది.

ఇప్పటికే ఎన్నో డజన్లకొద్దీ రంగాలలో తెలుగుదనం తరిగిపోతోంది. ఉదాహరణకు:

తెలుగులో బోధన చేయగలిగిన లక్షలాది ఉపాధ్యాయులు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడుతున్నారు. వచ్చిన భాషలో చెప్పే పనిపోయి రానిభాషలో చెప్పబూనడం రేపటి సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఆరోగ్యం కానేకాదు.

తెలుగుభాషపై మాత్రమే ఆధారపడి వివిధ మాధ్యమాలలో పనిచేసే వేలాదిమంది ఉద్యోగులు ముమ్ముందు తమ భవిష్యత్తు ఏం కానుందో అర్థంకాక తల్లడిల్లిపోతున్నారు.

ఆధునిక మార్కెట్ రంగంలో తలమానికమైన ప్రకటనా రంగంలో తెలుగుతో వేలాదిమందికి ఉపాధి దొరుకుతోంది. తెలుగులో ప్రకటనలు రాసేవాళ్లు, వాటిని కావలసిన రీతిలో బుల్లితెరలపై అందంగా తీర్చిదిద్దేవాళ్లూ, ప్రకటనల రాతలను టీవీ రేడియో తదితర ఎలక్ట్రానికమాధ్యమాలలో సంభాషణల రూపంలో వల్లించేవాళ్లూ, వాటికి అనుగుణంగా నటించేవాళ్లూ ఎందరో తెలుగుతో ఉపాధి పొందుతున్నవారే.

ఆంగ్ల మాధ్యమ విద్యాబోధనతో రెండు దశాబ్దాలలో స్థానిక భాషల ఆధారంగా నడిచే దేశీయ పరిశ్రమలు అంతరించిపోతాయి. వీటిలో ప్రప్రథమంగా భారతీయ భాషల ముద్రణా పరిశ్రమ దెబ్బ తింటుంది. ఇది ప్రపంచంలోనే పెద్దది. మాతృభాషలలో పుస్తక ప్రచురణ, ముద్రణా యంత్రాంగం, రచయితలూ-రచనలూ, కవులూ - కవితలూ, కథకులూ - కథలూ, గ్రంథకర్తలూ - గ్రంథాలూ సృజనరచనాశీలురూ - సృజనాత్మక రచనలద్వారా 7లక్షల మందికి నేరుగానూ 4.5 లక్షల మందికి పరోక్షంగానూ పని దొరుకుతోంది. 70 వేల పత్రికలలో 90% భారతీయ భాషలలో లక్షలాదిమంది పనిచేస్తూ లక్షలకోట్లలో వ్యాపారం చేస్తున్న పత్రికారంగం నీరుకారిపోతోంది. ఉన్నవారికి జీతాలు పెంచే అవకాశం సన్నగిల్లడం కొత్తవారికి ఇవ్వగలిగే ఉద్యోగాలు లేక కొత్తతరం లేక బెంబేలెత్తిపోతోంది. భారతీయ ముద్రణా పరిశ్రమ ఆదే సంవత్సరానికిగాను 21,48,285.15 కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోంది. దీనిలో ఎక్కువ భాగం భారతీయ భాషలదే.


2016 వ సంవత్సరానికి పత్రికా రంగంలో పెరుగుదల సూచిలో హిందీ (8.76%) తర్వాత తెలుగు (8.28%), ఆపైనే కన్నడ (6.40%), తమిళం (5.51%), మలయాళం (4.11%), ఇంగ్లీషు (2.87%), పంజాబి (1.53%), మరాఠీ (1.50%),

బెంగాలీ (1.49%) మొదలైనవి. అంటే తెలుగు పత్రికారంగంలో పనిచేస్తున్నవారే ఎక్కువగా దెబ్బతినే అవకాశం ఉంది.

ఎలక్ట్రానిక్ రంగంలో టీవి మాధ్యమ రంగం, ఏడాదికి (2016) 41,71,076.42 కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోంది. ఇందులో అత్యధికంగా భారతీయ భాషల కార్యక్రమాలే. షుమారు 25 లక్షలమంది ఉపాధి పొందుతున్నారు. ఆంగ్లమాధ్యమంతో రెండు దశాబ్దాలకాలంలో ఇది నిర్వీర్యమై ఇంగ్లీషు కార్యక్రమాలను అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండు లాంటి దేశాలనుంచి దిగుమతి చేసుకొని చూసుకోవలసివస్తుంది. మన భారతీయ టీవీమాధ్యమ పరిశ్రమ కుప్పకూలిపోతుంది. ఈ రంగంలో పని చేసే మన పనివారల అవసరంలేకుండా ఇంగ్లీషు కార్యక్రమాలను దిగుమతిచేసుకొని చూసుకొనే స్థాయికి అలవాటుపడిపోతాం.

ఇక భారతీయ భాషా సినిమారంగం ప్రపంచంలోనే అత్యధిక సినిమాల నిర్మాణంతో ఉంటూ వినోద మాధ్యమ పరిశ్రమలో అధిక శాతం దేశీయ భాషలలో చిత్ర నిర్మాణంతో భారతీయ చిత్రపరిశ్రమ ఏడాదికి 2,17,000 కోట్ల వ్యాపారం చేస్తూ 23.6 లక్షల మందికి ఉపాధి సౌకర్యం కల్పిస్తూ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది (చలనచిత్ర పంపిణీ సంఘం, ఇండియా ప్రైవేట్ లిమిటేడ్, 2017). చిత్రపరిశ్రమలో చిన్నాపెద్దా నటీనటులూ, కథా, గేయ రచయితలూ, సాంకేతిక నిపుణులూ దర్శక నిర్మాతలూ మొదలైన వారు ఉన్నారు. దీనిలో ప్రతి ఏడాదికీ సగటున 23 వేల ఉద్యోగాలచొప్పున పెరుగుదల ఉంటోందని తెలుస్తోంది. ఇలాంటి పరిశ్రమ ఆంగ్ల మాధ్యమ ప్రవేశంతో రెండు దశాబ్దాలలో ఎలా ఉండబోతోందో ఊహించుకోవచ్చు. తెలుగులో కథలూ గేయాలూ, సంభాషణలూ రాయగలిగేవారూ గణనీయంగా తగ్గిపోతారు. ఆంగ్ల మాధ్యమంతో ఆంగ్ల భాషా చిత్రాలకు అలవాటు పడిపోయిన మన యువతరం తెలుగూ తదితర భారతీయ సినిమాలకు గిరాకీ తప్పిస్తారు. లక్షలమందికి ఉపాధికలిగించే పరిశ్రమ మూలబడిపోతుంది. అమెరికా, ఇంగ్లండు, ఆస్ట్రేలియా తదితర దేశాలలో తయారైన ఇంగ్లీషు సినిమాలను దిగుమతి చేసుకొనేస్థాయికి దిగజారిపోతాం.

ఇక ఇదంతా ఒక ఎత్తైతే విద్యా రంగంది మరొక ఎత్తు. విద్యా రంగంలో మన భాషలు అడుగంటటం ఊహించరానిది. ఇప్పుడు మన దేశంలో ప్రభుత్వ ప్రభుత్వేతర రంగాలలో వేయికి పైగా విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వాటికింద అనేక వందలాది కళాశాలలు ఉన్నాయి. వీటికి గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయాలలో లక్షలాది పుస్తకాలు ఉంటాయి. ఇప్పటికే వాటిలో ఎక్కువ శాతం ఇంగ్లీషులోనే. వీటిలో విశ్వవిద్యాలయాల స్థాయి పుస్తకాలలో 95% పైన అమెరికా, ఇంగ్లండు, ఆస్ట్రేలియా మొదలైన దేశాలనుండి దిగుమతి చేసుకొన్నవే. ప్రతి ఏడాదీ వందలాది కోర్సులలో వేలాది పుస్తకాలను లక్షలాది కాపీలుగా దిగుమతి చేసుకుంటాం. ఇవన్నీ డాలర్లూ, పౌండ్లూ లాంటి విదేశీమారకంతో కొనవలసివస్తోంది. ఇవన్నీ ప్రతి సంవత్సరం తప్పనిసరే. మన దేశ విద్యా బడ్జట్లోని విరాళాల నుండి విద్యాసంస్థలు ఖర్చుపెట్టేదే. కొన్ని లక్షలకోట్ల రూపాయలు. దీన్ని చాలావరకు తగ్గించవచ్చు. కొత్తగా వెలువడే ఆంగ్ల లేక ఇతర భాషలలో వచ్చిన గ్రంథాలను మన విద్యావిషయక నిపుణులు అనువదించి మన భాషలలో అందించ గలిగితే లక్షలాదికాపీలను మనమే ముద్రించి మన విద్యార్థులందరికీ తక్కువధరలో అందించవచ్చు. మాతృభాషలలో ఉండటంతో విద్యార్థులకూ ఉపాధ్యాయులకూ విషయావగాహన తేలికవుతుంది. ఆత్మ హత్యలు తగ్గుతాయి. మన డబ్బు మనదగ్గిరే ఉంటుంది. పైపెచ్చు అందరికీ ఆదాయం, ఉపాధి రంగం ఇతోధికంగా మెరుగవుతుంది. ప్రతి ఏడాదీ లక్షలకోట్ల రూపాయల విదేశీమారకం ఆదా అవుతుంది. ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుచుకున్న ఏ దేశమూ దేశభాషలను విస్మరించలేదు అనేది వాస్తవం.



కొవ్వ

భాషతో మూడు ముక్కలాట!

'తెలుగా! ఇంగ్లీషా! తెలుగిషా!'

– డాక్టర్ వెల్చేరు నారాయణరావు, యు.ఎస్.ఎ.



సభలో ప్రసంగిస్తున్న డా॥ వెల్చేరు నారాయణరావు
వేదికపై డా॥ వకుళాభరణం రామకృష్ణ

ఫోటో : రాజేంద్రప్రసాద్ గుంటూరు

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారు జనవరి 27న సాయంత్రం 6 గం. లకు గుంటూరులోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి వైశ్య బాలుర వసతిగృహం ప్రాంగణంలో డాక్టర్ వెల్చేరు నారాయణ రావు గారి ప్రసంగాన్ని ఏర్పాటు చేసారు. డాక్టర్ వెల్చేరు నారాయణ రావుగారు బహుగ్రంథరచయిత, తెలుగు సాహితీవేత్త, దక్షిణ భారత చరిత్రకారులు, అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో తెలుగును బోధించిన విశ్రాంత ఆచార్యులు. వీరు తెలుగు లోని కన్యాశుల్కం, శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం, బసవ పురాణం, క్షేత్రయ్య పదాలు, అన్నమయ్య కీర్తనలు, క్రీడాభిరామం, కళాపూర్ణోదయం, మనుచరిత్రము మొ॥ గ్రంథాలను ఆంగ్లీకరించారు.

ఈ సభలో డాక్టర్ వకుళాభరణం రామకృష్ణ గారు పాల్గొని వెల్చేరు నారాయణరావు గారి గురించి పరిచయం అందించారు.

“నాకు పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్పే అలవాటు లేదు, కబుర్లు చెప్పడం వచ్చు నాకు!” అని తమ ప్రసంగాన్ని ప్రారంభించిన వెల్చేరు నారాయణరావు గారు సభను ఆద్యంతం గంభీరంగా నడిపారు.

తెలుగుదేశానికి దూరంగా తెలుగు మాట్లాడని ప్రాంతంలో తెలుగు నేర్పించానని తనని తాను పరిచయం చేసుకుంటూ ముందుగా దాసుశ్రీరాములు తమ రచన తెలుగునాడులో చెప్పిన పద్యం :

> “ముదికరణాలు రాముగుడి మోసలరచ్చులుదీర్చి భారతాల్
> చదువుచులోకవార్తల బ్రశంసలనంద్రు తెలుంగుభాష మం
> చిది మనపిల్లకాయలు వంచించెడి యింగిలిపీసువుస్వుసన్
> బెదవులుదాట దెంతటియెఫేయు బియే యెమియే వచించినన్ ”
> –(తెలుఁగునాడు)

వినిపించి, అటు వెంటనే చెళ్ళపిళ్ళ గారి పద్యం

> “అచ్చాఫీసులటంచు హూణుల కుపాధ్యాయత్వమంచున్ మతిన్
> వెచ్చంబిచ్చెడి బచ్చుటిండులకడన్ వేదాంతమంచున్ మహో
> దృచ్చారిత్రులు పండితుల్ మెలఁగఁగా నయ్యెంగదా! పొట్టకై
> చచ్చున్ గాలమువచ్చె గౌరవము నాశంబయ్యెఁ గామేశ్వరీ
> – (కా. శ. 10–22)”

వినిపించి, ఈ రెండు పద్యాలలో చెప్పిన విధంగా తెలుగు సమాజం మారిపోయిందని, ఈ రెండు పరిస్థితులకు మధ్య ఏం జరిగింది అన్న విషయాన్ని చెబుతున్నానంటూ తమ ప్రసంగంలోకి దిగారు.

“తెలుగు చాలా అందమైన భాష, తెలుగు చాలా చక్కని భాష, తెలుగంత గొప్ప భాష మరొకటి లేదు!” తెలుగువారికి రుచి స్తాయి. ఒక స్త్రీకి ఆమె కూతురు ఎంత అందంగా ఉన్నా, ఆ విష యాన్ని ఆవిడ గురించి గానీ, ఆమె కూతురి గురించి గానీ తెలీని మూడో వ్యక్తికి ఆమె వెళ్ళి “నా కూతురు ఇంత అందంగా ఉంది, అంత బాగా ఉంది” అని చెబితే ఏ విధంగా అనిపిస్తుందో, తెలుగేతరు లకు తెలుగు భాష గురించి మనం పొగిడితే సరిగ్గా అలానే అనిపిస్తుం దని ఆయన అన్నారు.

ఒక తెలుగు కవి గొప్ప కవి అని మనమంతా అనుకుంటాం, కానీ ఆ కవి ఎందుకు అంత గొప్ప కవి అని అడిగితే మన దగ్గర సమాధానం ఉండదు. వెంటనే ఆ కవి అంత గొప్ప కవి కాబట్టి, ఆ కవి గొప్ప కవి అని సమర్థించుకుంటాం కూడా. నన్నయగానీ, శ్రీనాథుడు గానీ, పెద్దన గానీ ఎందుకు అంత గొప్ప కవులు అంటే, వారు గొప్ప కవులు కాబట్టే అనే సమాధానమే వస్తుంది.

గత 30 ఏళ్ళలో వచ్చిన పీహెచ్‌డీలు ఎవరికీ విస్తృతంగా

అందుబాటులోకి రాకుండా ఉన్నాయని, ఆయనకు దొరికిన వాటిలో పీహెచ్‌డీలన్నిటిలోనూ ఇలాంటి ధోరణే కనిపిస్తోందని ఆయన అన్నారు.

తెలుగు మాత్రమే తెలిసిన తెలుగు పండితులకు ఉద్యోగాలుం డటం లేదు గానీ పైన చెప్పిన విధంగా రాసే పరిశోధనా పత్రాలకు పీహెచ్‌డీలొస్తున్నాయని, తెలుగు పండితులు కనపడటం లేదుగానీ తెలుగు పీహెచ్‌డీలు కోకొల్లలు అనీ ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ పరిస్థితిని మనం మానేయాలని ఆయన అన్నారు.

తెలుగు ఇలా ఎందుకు తయారయింది? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. "ఏదైనా ఒక పద్యాన్నో. ఒక సందర్భాన్నో, ఒక పరిస్థితినో ఆలోచించి, దాని గురించి సమాచారం పోగుచేసి, ఇంతవరకూ దాని గురించి ఎవరు ఏమి అనుకుంటున్నారో చెప్పి, ఇందులో నేను ఏమైనా చెప్పదలుచుకున్నానో అది చూసి, ఇది నేను చెప్పవలసిందని గమ నించి, అప్పుడు రాస్తే పీహెచ్‌డీ అవుతుందది." అని పీహెచ్‌డీకి ఉండాల్సిన కనీస అర్హత గురించి వివరించారు.

తెలుగు పదాల్లోని విస్తృతి, తెలుగు పదాల వైవిధ్యం, అర్థం, వివరణ ఇవ్వగలిగే సామర్థ్యం ఈరోజు విద్యార్థులలో కొరవడిందని ఆయన చెప్పారు. విద్యార్థి తమ ఆసక్తి గల విషయంలో ఏదో ఒక ప్రశ్న వేసుకుని, ఆ ప్రశ్నకి సమాధానం దొరక్కపోతే, ఆ ప్రశ్నకి సమాధానం వెతుక్కుంటూంటే, అప్పుడు పీహెచ్‌డీ చేసేందుకు అర్హత వస్తుందని అభిప్రాయ పడ్డారు.

తెలుగువారు తెలుగును వేరేవారికి నేర్పగలరా? అంటే కాదు అనే సమాధానం వస్తుందని ఆయని అన్నారు. తెలుగు వచ్చినవారికి మనం తెలుగు నేర్పగలం, అదీ తెలుగును లిపిబద్ధం చేసే పద్ధతిని నేర్పగలం, తప్పితే, తెలుగు రాని వారికి తెలుగు ఎలా నేర్పాలో తెలుగువాళ్ళెవరికీ తెలీదు, ఎందుకంటే తెలుగును తెలుగువారందరం ఎలా నేర్చుకుంటున్నామో తెలీకుండానే నేర్చేసుకున్నామే కానీ, తెలుగును స్పృహతో నేర్చుకుని తెలుగువాళ్ళమవలేదు. తెలుగు రాని వారికి తెలుగు చెప్పడం మనకు రాదు.

"నేను ఇంటి వద్దకు వెళుతున్నాను" అనగలము, "నేను మా అమ్మ వద్దకు వెళుతున్నాను" అని అనగలము, "నేను ఇంటికి వెళుతున్నాను" అనగలము కానీ "నేను మా అమ్మకి వెళుతున్నాను" అని చెప్పలేం. "మీ అమ్మగారు బాగున్నారా?" అని అంటాం గానీ "నీ అమ్మగారు బాగున్నారా?" అని అనలేం, ఆ వ్యత్యాసం మనకి అవగాహనతో తెలీదు. తెలుగులో ఏ ఏ విశేషాలున్నాయో మనం తెలీకుండానే తెలు గును మాట్లాడేస్తున్నాం. తర తరాలుగా తెలుగు అలానే ఉంది.

బ్రిటిష్ వారు మన దేశానికి వర్తకానికి వచ్చే కాలానికి ఇంగ్లిష్ కేవలం బజారు భాష. అప్పట్లో వారు విశ్వవిద్యాలయాల్లో గ్రీకు, లాటిన్ భాషలను గురువుల వద్ద నేర్చుకునే వారు, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అదే స్థితి. వారు తెలుగుప్రాంతాలకు పాలకులుగా వచ్చాక, గ్రీకు, లాటిన్ నేర్చుకున్న వారు అదే ధోరణిలో తెలుగు నేర్చుకునేందుకు తెలుగు పండితుల వద్దకు వచ్చారు. (అప్పట్లో ఇంగ్లిష్ ప్రొఫెసర్లు ఇంగ్లండులో లేరు. ఇందియాలో మొదటిసారి ఇంగ్లిష్ రాజభాష అయింది, ఇంగ్లిష్ లో మొదటి ప్రొఫెసర్ కూడా ఇండియాలోనే తయారయ్యాడు.)

తెలుగు పండితులు పరిపాలనకు కావలసిన భాషను నేర్పలేక పోయారు.

పరిపాలన భాష అంటే – దస్తావేజుల్లో రాయబడే భాష, కోర్టుల్లో మాట్లాడే భాష, కరణాలు మాట్లాడే–రాసే భాష.

కానీ తెలుగు పండితులు తెలుగు నేర్చుకునేందుకు వచ్చిన బ్రిటిష్ వారికి ఆంధ్రశబ్ద చింతామణి సూత్రాలు చెప్పారు.

ఆ పండిత భాషలో మాట్లాడితే బ్రిటిష్ అధికారులకు చుక్కెదురైంది. విన్నవారంతా వారిపై నవ్విపోయారు.

తెలుగు నేలలో తెలుగు నేర్పే వారు లేరని నిర్ధారించుకొని బ్రిటిష్ వారు వాళ్ళకు కావాల్సిన తెలుగు వ్యాకరణాలు వాళ్ళే వాళ్ళ భాషలో రాసుకున్నారు, వాళ్ళకు కావాల్సిన తెలుగు నిఘంటువులు వాళ్ళే రాసుకున్నారు కూడా!

ఇప్పటికీ తెలుగును తెలుగేతరులకు మనము చెప్పలేం.

ఇలాంతి పరిస్థితులను ప్రత్యక్షంగా చవిచూసిన ఆచార్య వెల్చేరు గారు కళాశాలల్లో తెలుగును బోధించే పద్ధతిని సరికొత్తగా రూపొందించానని అన్నారు.

పలు క్రియలకు ఇంగ్లిష్ లో బ్రేక్ అనే పదం వాడితే, తెలుగులో వస్తువును, ఆ వస్తువు తయారైన పదార్థాన్ని బట్టి, తెగింది, పగిలింది, విరిగింది, చితికింది అని వాడతాం, అంతటి వివరం తెలుగు భాషలో ఉంది.

"మా ఇంటికి రండి!" అని మన ఉపస్థితిలో ఇంటికి రమ్మని చెబుతాం, "మా ఇంటికి వెళ్ళండి." అని మనము లేనప్పుడు ఇంటికి వెళ్ళమని చెబుతాం. ఈ తేడాలను మనము ఎక్కడా రాసుకోలేదు.

ఎన్ని పద్ధతుల్లో వాక్యం రాయచ్చో, తెలుగులో ఎక్కడెక్కడ మలుపులు తిప్పగలమో, ఎక్కడ వీల్లేదో తెలుగు భాషను నేర్చుకునే టప్పుడు మనం స్పృహతో తెలుసుకుని నేర్చుకోలేదు. అలాంటి సూత్రాలను ఎక్కడా విడిగా ఇదమిత్థం అని రాసుకోలేదు.

వసుచరిత్ర, మనుచరిత్ర, శ్రీనాథ రచనలను ఆంగ్లీకరిస్తూ తెలుగులోని ఈ విశేషాలను తెలుసుకున్నానని ఆయన చెప్పారు.

ప్రతి పుస్తకాన్ని పుచ్చుకొని అందులోని విశేషాలను చదివి, తెలుసుకొని, భాషా విశేషాలను విడమరిచి చెప్పటం ప్రారంభించాలి అని పాఠకులకు ఆయన పిలుపునిచ్చారు.

తెలుగువాళ్ళకి ఆలోచనతో కూడిన వాక్యం రాయడం అల వాటులేదు అని ఆయన ఘాటుగా విమర్శించారు.

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

పాశ్చాత్య ప్రమాణాలతోనో, మరో ప్రమాణాలతోనో, మనం ఈరోజు మన తెలుగు సాహిత్యాన్ని కొలుస్తున్నామని, మన సాహిత్యాన్ని అందుకే అర్థం చేసుకోవటంలో విఫలమవుతున్నామని ఆయన అన్నారు.

ఈనాడు పొగడడానికి, తిట్టడానికి తప్ప, ఆలోచింపజేయడానికి ప్రేరేపించే భాషగా తెలుగు లేదని ఆయన వాపోయారు.

ఆ దృక్పథం లేకపోవడం వలన తెలుగు ఆలోచించే భాషగా లుప్తమైపోయిందని ఆవేదన వ్యక్తం చేసారు.

ఒక ప్రశ్న మన ముందుకు రాగానే వెంటనే ఆ మాటకు అర్థం తెలుసుకోకుండా, ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు ప్రయత్నిం చేస్తాం. ఇది మన రోజువారీ నడవడికలో జీర్ణించుకు పోయింది. మనం వాడిన ప్రతి మాటను శంకించాలి, శంకించి, సమాధానం ఆలోచించాలి. అలా కొత్త నడవడికను అలవరుచుకోక పోతే తెలుగు క్షీణిస్తుందని ఆయన అన్నారు.

ఒక ఉదాహరణ చెబుతూ ఒక ప్రముఖ కవి తెలుగులో ప్రయోగం అనే మాటకు ఎక్స్పెరిమెంట్ అనే అర్థం వచ్చేలా ఒక సిద్ధాంత గ్రంథాన్ని రచించారనీ, ప్రయోగం అంటే వాడుక అనే అర్థముండేది తప్ప ఎక్స్పెరిమెంట్ అనే అర్థం ఈ మధ్య ఏర్పడిందని, అలాంటి తప్పిదం విద్యార్థులు చేస్తే సరిదిద్దవచ్చు గానీ పెద్దవాళ్ళూ చేస్తున్నారని ఆయన అన్నారు.

తెలిసిన విషయాన్ని గురించి మాట్లాడక్కరలేదు, తెలీని విష యాన్ని ప్రశ్నించి, సమాధానం రాబట్టుకోవడం నేటి అవసరం.

ఆలోచించేవారంతా ఇంగ్లిష్ లో రాస్తున్నారు - రాజకీయాల మీద, కుటుంబ విషయాల మీద, ఆర్థిక విషయాల మీద.

తెలుగులో వచ్చే పుస్తకాలు మాత్రం ఆలోచించేవిగా లేదు. తెలుగు ఆలోచింపజేసే భాషగా వెంటనే ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఒక భాష ప్రపంచాన్ని ఒక దృష్టితో చూపిస్తే, మరొక భాష వేరే దృష్టితో చూపిస్తుంది, ఒక కొత్త భాష నేర్చుకున్న ప్రతి సారి, మన ప్రపంచం విస్తృతమవుతుంది.

తెలుగులో రాజుకీ ఇంగ్లిష్ లో కింగ్ కీ చాలా తేడా ఉంది. ఒక భాషను మరో భాషకు సమానార్థకంగా తీసుకోకూడదని ఆయన గుర్తు చేసారు.

బ్రిటిష్ వారు వారి మతమన్నా, భాషన్నా చాలా గొప్పవని, అవి భారతీయులు నేర్చుకుంటేనే బాగుపడతారని వారు భావించారు. మనం వారి సంప్రదాయాన్ని హత్తుకోవాలంటే మన భాష-మతం-చరిత్ర-సాహిత్యం అన్నీ వారి భాష-మతం-చరిత్ర-సాహిత్యం ముందు ఎందుకూ పనికిరావని మనల్ని నమ్మించి, వారి బానిసలుగా మనల్ని చేసుకున్నారు. వారు చెప్పినదే అదనుగా మనం చేసుకుంటూ పోయామే గానీ, మన సాహిత్యంపై అవగాహనతో ప్రశ్నించుకోలేదు. మన సాహిత్యానికి చరిత్రలేదు అనగానే లక్ష్మీకాంతం తెలుగు సాహిత్య చరిత్ర రాసారు, కవుల చరిత్ర లేదనంగానే వీరేశలింగం ఆంధ్రకవుల చరిత్ర రాసారు, కవుల కథలను సాహిత్య చరిత్రలోంచి తీసివేయాలని అనగానే ఆ కథలను తొలగించాము.

ఎక్కడికక్కడ ప్రశ్నలు వేయకుండా, సమాధానంగా రాసి పడేసామే తప్ప, ఒక నిమిషం ఆలోచించి మన సాహిత్యంలో, చరిత్రలో ఇవి భాగమేనా, ఇలా కూడా మన సాహితీ సృజన జరగాలా అని మనం అనుకోలేదు. ఆంగ్ల కొలబద్దకు మన సాహిత్యాన్ని కొలి చాము. వివిధ కాలాల కవుల, రచయితల గురించి మనం సరిగ్గా రాసుకోలేదు.

సాహిత్య చరిత్రను రాజకీయ చరిత్రలాగా రాసుకున్నాం. ఫలానా లేదు అంటే, ఉంది కాబోలు అని మనం రాస్సామే గానీ, అది ఎందుకు అని ప్రశ్నించుకోలేదు. తెలుగు సాహిత్యం పాశ్చాత్య సాహిత్యానికి భిన్నము అని ఏనాడూ మన పూర్వ రచయితలు చూసు కోలేదు.

తెలుగు సాహిత్యంలో ఉన్న గ్రంథాలు గురుముఖత నేర్చుకో గలమే తప్ప నవలలలా ఇంట్లో కూర్చొని వంటరిగా చదవలేము. భారతదేశంలో పుస్తకం చదివేందుకు ఒక పద్ధతి, ఒక సంప్రదాయం ఉంది. మన పుస్తకాలకి రచయిత ఎంత రచయితో, పాఠకుడు కూడా అంతే రచయిత! రచయిత పుస్తకాలు రాసేందుకు ఎంత శ్రమ పెట్టి రాస్తాడో, పాఠకుడు కూడా అంతే శ్రమ పెట్టి పుస్తకాన్ని చదవాలి. అందుకు భిన్నంగా పాశ్చాత్య సాహిత్యంలోలా చదువుకునే రచనలు కావు మనవి! ఈరోజు ఆంగ్ల పత్రికలు, ఆంగ్ల పేపర్లు మాత్రమే ప్రామాణికమయ్యాయి. తెలుగు పత్రికలు తెలుగు వార్తలనందించడం లేదు. ప్రశ్నించే వార్తలు రావటం లేదు. తెలుగు వార్తా పత్రికలు ఈరోజున ఆంగ్ల పదాలను, వాక్యాలను యథాతథంగా రాస్తున్నారు తప్ప, తెలుగు కాదు. తెలుగు అక్షరాల్లో ఇంగ్లిష్ చదవడం అలవాటైతే తెలుగు పత్రికలు చదవడంలో ఎలాంటి ఇబ్బంది ఉండటం లేదు. కొన్నాళ్ళు కథలు, కవితలు, నవలలు, కట్టిబెట్టి తెలుగులో వ్యాసాలు రావాలి. ఆలోచింపచేసే విధంగా వ్యాసాలు రాయండి.

బాలగోపాల్ రాసిన వ్యాసాలు మినహాయిస్తే తెలుగులో ఆలో చింపచేసే పుస్తకాలు రాలేదు.

మనం ప్రస్తుతం మన పత్రికల వలన తెలుగు - ఇంగ్లిష్ - ఈ రెంటికీ సంకరగా ఉన్న మూడో భాష తెలుగిష్‌ల మధ్య కొట్టు మిట్టాడుతున్నామని ఆయన అన్నారు.

"దీన్నేమైనా బాగు చేయగలమా?" అనే ప్రశ్నతో ఆయన ప్రసంగాన్ని ముగించారు.

ప్రసంగం తరువాత ప్రేక్షకులతో ముఖాముఖీలో ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబులు ఇచ్చారు. ఇప్పుడున్న ధోరణిలో కొనసాగితే తెలుగు మనుగడ ఉండదు అని ఆయన అన్నారు.

ఆలోచించడాన్ని ప్రేరేపించే రచనలు రావాలని వక్కాణించి చెప్పారు. అభిప్రాయాలు కాదు, అభిప్రాయాలతో ఏకీభవించని విశ్లేషించే తీరు, ఆలోచింపజేసే తీరు కలిగించే వచనం తెలుగులో రావాలి అని అన్నారు.

– రహ్మానుద్దీన్ షేక్

వీవెన్
9963029061


తెలుగు భాషకు ఆధునిక హోదా-13

మీ సొంత పత్రిక, రేడియో, టీవీ

రానున్న ఐదేళ్ళలో అంతర్జాలం వాడుకునే తెలుగువారి సంఖ్య 5 కోట్లకు పెరుగుతుందని, అందులో ఎక్కువగా వాడేవారి సంఖ్య కనీసం 3 కోట్లయినా ఉంటుందని, వీరందరికీ వారి వినోద, విజ్ఞాన, వికాస అవసరాలను తీర్చే తెలుగు సమాచారం అందుబాటులో లేదని పోయిన నెల వ్యాసంలో చెప్పుకున్నాం. అంతర్జాలంలో తెలుగు సమాచార పెంపుకి మనందరికీ ఉన్న అవకాశాల గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం.


బ్లాగులు

అంతర్జాలం ద్వారా సమాచారం పంచుకోవడం మొదలై అనేక రూపాలు సంతరించుకుంది. తొలితరం వెబ్ సైట్లు తాజా విశేషాలు, ఆన్‌లైన్ డైరీ వంటి శీర్షికలతో క్రమం తప్పకుండా తాజా సమాచారాన్ని అందించే సంప్రదాయాన్ని మొదలుపెట్టాయి. అప్పటి సాంకేతిక నిపుణులు, అంతర్జాలం మీద ఆసక్తి ఉన్న జర్నలిస్టులు వారి అభిప్రాయాలను వ్యక్తిగత బ్లాగుల రూపంలో పంచుకోవడం మొదలై "వెబ్ లాగ్" అన్న పదబంధం బ్లాగుగా



మారింది.

ఆ తర్వాతి కాలంలో అనేక అంశాల గురించి బ్లాగులు వచ్చాయి. ప్రసార మాధ్యమాలకు దీటుగా ప్రత్యామ్నాయ మాధ్య మంగా బ్లాగులు వెలుగొందుతున్నాయి. పౌర జర్నలిజానికి బ్లాగులే పట్టుగొమ్మ. తన అభిప్రాయాలను వ్యక్తవరుస్తూ సొంతగా వ్రాసుకునే వ్యక్తిగత బ్లాగుల స్థాయి నుండి, ఒకే ఆసక్తి గల కొందరు బృందంగా కూడి నిర్వహించే బ్లాగులు, స్వచ్ఛంద వ్యాపార సంస్థలు నేరుగా



ప్రజలతో సమాచారాన్ని పంచుకునే స్థాయి వరకూ అనేక రూపాల్లో బ్లాగులు నడుస్తున్నాయి. విషయపరంగా చూస్తే, కథలు, కవితలు, సమకాలీన రాజకీయ, సాంఘిక అంశాలపై వ్యాఖ్యానాలు, పుస్తక పరిచయాలు సమీక్షలు, సినిమా సమీక్షలు, వంటలు, యాత్రా విశేషాలు, సాంకేతిక అంశాలు, క్రీడలు, ఆరోగ్యం, ఇలా లేదన్న విషయమే లేదన్నట్టు అనేక అంశాలపై బ్లాగులు ఉన్నాయి. అదే ఒరవడిలో తెలుగు లోనూ బ్లాగులు మొదలైనా, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ఉధృతిలో తెలుగు బ్లాగుల జోరు తగ్గింది. అయితే, ఫేస్‌బుక్ వంటి సైట్ల లోనూ, వాట్స్‌ఆప్ వంటి ఆప్స్ లోనూ పంచుకున్న సమాచారానికి అప్పటికప్పుడు స్పందన లభించినా అది ఆ మిత్రబృంద పరిధి దాటి వెళ్ళే అవకాశం చాలా తక్కువ. ఆ సమాచారాన్ని ఇతరత్రా మార్గాల ద్వారా కూడా వెతికి పొందగలిగే అవకాశమూ తక్కువే. అందువల్ల, బహిరంగంగా పంచుకోదగ్గ సమాచారాన్ని బ్లాగులు, వెబ్ సైట్ల రూపంలో సృష్టించి దాన్ని సామాజిక మాధ్యమాలలో పంచుకుంటే రెండు విధాలుగానూ మేలు.

ఎవరికి వారు బ్లాగులు తయారుచేసుకోటానికి అంతర్జాలంలో అనేక ఉచిత సదుపాయాలు ఉన్నాయి. వర్డ్‌ప్రెస్ (wordpress.com), బ్లాగర్ (blogger.com), మీడియమ్ (medium.com) వంటి సైట్లలో ఎవరైనా తమకంటూ ఉచితంగా బ్లాగును సృష్టించుకోవచ్చు. వాటిలో తమ రచనలను, ఆలోచనలను బ్లాగు టపాలుగా ప్రచురించవచ్చు.

మైక్రోబ్లాగింగు

పరిమితమైన అక్షరాలలో భావాలను పంచుకోవడానికి మైక్రోబ్లాగింగు అన్న ప్రక్రియ మొదలయ్యింది. మాటలలో చెప్పలేని భావాన్ని బొమ్మల రూపంలోనూ పంచుకోవడం ఊపందుకుంది. ఇప్పుడు అందరి దగ్గరా కేమెరాలు చేతిలోనే ఉంటున్నాయి కదా. ట్విట్టర్ (twitter.com), టంబ్లర్ (tumblr.com) వంటి సైట్లు ఉచిత మైక్రోబ్లాగింగు సేవను అందిస్తున్నాయి.

వీడియోలు

యూట్యూబు (youtube.com), విమియో (vimeo.com) వంటి సైట్లు మనం వీడియోలను పంచుకోడానికి ఉచిత సేవను అందిస్తున్నాయి. వీటిలో ఖాతా సృష్టించుకొని మనం తయారుచేసిన వీడియోలు ప్రచురిస్తూంటే, మన స్వంత టీవీ ఛానెలు ఉన్నట్టే. వీడియోలలో విషయం ఒక వ్యక్తి వ్యాఖ్యానం (వీడియో బ్లాగింగు) నుండి నిజజీవితంలో జరుగుతున్న సంఘటన (ప్రత్యక్ష ప్రసారం), చిన్న సినిమా, ఏదైనా వస్తువును వాడటం ఎలా, వార్తా విశేషాలు, ప్రాంతీయ ప్రత్యేకతలు, వంటలు, ఇలా అనేక రకాలైన విషయాలపై ఇప్పుడు యూట్యూబు ఛానెళ్ళు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా యూట్యూబులో తెలుగు వీడియోలు బాగా పెరిగాయి, కానీ అవి చాలా మట్టుకు సినీ లేదా పోసుకోలు కబుర్లవే.

ఆడియోలు

సౌండ్‌క్లౌడ్ (soundcloud.com) వంటి సైట్లు మన స్వంత ఆడియో బ్లాగు లేదా పాడ్‌కాస్టు ఉచితంగా నడుపుకునే అవకాశాన్ని అందిస్తున్నాయి. ఇది మన స్వంత రేడియో ఛానెలు అన్న మాట. వివిధ రంగాల్లోని నిపుణులతో సంభాషణలు, సమకాలీన అంశాలపై వ్యాఖ్యానం వంటివే గాక పుస్తకాలు ఆడియో రూపంలో కూడా అందించవచ్చు. శ్రోతలు వేరే పనులు చేసుకుంటూ కూడా వీటిని వినే అవకాశం ఉండటంతో పాడ్‌కాస్టులకు ప్రాచుర్యం పెరుగుతూన్నది.

ఇంకా

సమాచార సాంకేతిక రంగంలో ఆవిష్కరణలు ఇప్పుడప్పుడే నెమ్మదించే పరిస్థితి లేదు. వర్చువల్ రియాలిటీ (మిథ్యా వాస్తవం), ఆగ్‌మెంటెడ్ రియాలిటీ (మెరుగుపరచిన వాస్తవం) అంటూ వినూత్న రూపాల్లో సమాచారాన్ని వినియోగించుకునే/అనుభవించి చూసే పద్ధతులు రూపొందుతున్నాయి.

రానున్న ఆధునిక సమాచార మాధ్యమాలన్నింటి లోనూ తెలుగు విషయం ఉండాలి. తెలుగు రచయితలు, ఇతరత్రా తెలుగు విషయ/సమాచార సృష్టికర్తలు ఈ ఆధునిక మాధ్యమాలపై దృష్టి సారించినప్పుడే వీటిలోనూ తెలుగు వెలుగుతుంది.


సమాచార సాంకేతిక రంగం ప్రచురణను ప్రజల చెంతకు తీసుకువచ్చింది. కేవలం అంతర్జాల అనుసంధానంతో ప్రపంచవ్యాప్త పాఠకులను చేరుకునే అవకాశం కల్పించింది. ఈ ప్రజాస్వామ్యీకృత పనిముట్లను, అవకాశాల్నీ వ్యక్తులుగా మనం ప్రజాస్వామ్య పరిరక్షణకూ వాడుకోవాలి. తతిమా భాషల్లో జర్నలిస్టులు, రచయితలు ప్రజా చైతన్యం కోసం ఈ ఆధునిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకున్నారు.

ఆంగ్లంలో సాంకేతిక నిపుణల తర్వాత ఈ మాధ్యమాల విస్తృతికి ఎక్కువగా తోడ్పడింది జర్నలిస్టులు, రచ యితలే. మన తెలుగు రచయితలు, జర్నలిస్టులు, ఇతరత్రా సాహిత్య కారులూ ఈ ఆధునిక మాధ్యమాలను అందిపుచ్చుకొని ఆధునిక మాధ్యమాలలో తెలుగు కొరతను తీరుస్తారని ఆశిద్దాం.

తెలుగులో రాయలేని, రాయని అధికార్లను నిలదీయండి

జయధీర్ తిరుమలరావు
9951942242

బహు కళల కాణాచి కళాత్మక వైవిధ్యం ఆయన జీవితం



కనువెలుగు : 24-7-1935 బ్రాహ్మణ కోడూరు
కనుమరుగు : 15-1-2019, తెనాలి

మొదలి నాగభూషణ శర్మ పేరు వింటేనే నాటకం, జానపద రంగం, సాహిత్య పరిశోధన అనే మూడు రంగాలు గుర్తొస్తాయి. నాటకరంగం అనగానే ఆయన స్క్రిప్టు రైటర్‌గా, ప్రయోక్తగా, నాటక రంగ పరిశోధకుడిగా చేసిన కృషి గుర్తొస్తుంది. అలాగే జానపదరంగం అనగానే జానపద కళలపై ముఖ్యంగా తోలుబొమ్మలు, జానపద రూపక ప్రక్రియలు గుర్తొస్తాయి. ఈ రంగంలో ఆయన పరిశోధన, జానపద కళల కృషి గుర్తురాక మానదు.

పరిశోధన అనగానే నవలా సాహిత్య ఆవిర్భావ వికాస దశలు, నాటకరంగంపై వెలువరించిన గ్రంథాలు స్ఫురిస్తాయి. పరిశోధించి ఊర్కోవడం ఆయన నైజం కాదు. ప్రతి పరిశోధ నాంశం రాతలోకెక్కాల్సిందే. పుస్తకంగా నలుగురిని చేరాల్సిందే. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో దేశవ్యాప్తం కావలసిందే.

'నర్తనం' త్రైమాసిక పత్రికా సంపాదకుడిగా ఉండి, కళా రంగంపై ఇంగ్లీషులో అనేక వ్యాసాలు రాశారు. 48 సంచికలలో 26 పరిశోధన వ్యాసాలు అచ్చయ్యాయి. కూచిపూడి నృత్యంపై ఆయా గురువులను సంప్రదించారు. క్షేత్ర పర్యటనచేశారు. 34 మంది గురువుల గురించి వారి సంప్రదాయాలు శైలుల గురించి అందులో వివరించారు. కూచి పూడి గురూస్, పెర్ఫార్మర్స్ అండ్ పెర్ఫార్మెన్స్ ట్రెడిషన్ అనే పుస్తకం కూడా రాశారు.

మొదలివారు అనగానే ఈ మూడు రంగాలు గుర్తొస్తాయి. ఆయన కళారంగ కళావేత్త. సంస్కృతి ఆయన హృదయ సఖి. కేంద్ర, రాష్ట్ర సంగీత అకాడమీలలో ఆయన క్రియాశీల సభ్యుడు. ముఖ్యంగా కళోత్సవల నిర్వహణలో ఆయన చొరవ మరవలేనిది. తోలు బొమ్మలాట, జానపద ఉత్సవాలు, కూచిపూడి నృత్యోత్సవాల నిర్వహణలో ఆయన కృషి గొప్పది. వృత్తి కళాకారుల వద్ద తోలు బొమ్మలాట. నేర్చుకుని ప్రదర్శించే స్థాయికి వచ్చారు. తోలు బొమ్మలాట నేర్పినందుకుగాను ఆ కళాకారుల పిల్లలకి మూడు వేసవులలో వారికి చదువు చెప్పారు. నాటకరంగంలోని అన్ని విభాగాలకు అత్యంత సన్నిహితుడు. 'ఒకానొక సమయంలో నాటక ప్రవాహంలో, ఎంతగా కొట్టుకు పోయాడంటే మళ్ళీ ఆయన కనుపిస్తాడా అనేంత లోతుల్లోకి పోయాడు. యాక్టింగ్ స్కూల్ కోసం కేంద్ర పెద్దల్ని ఒప్పించి రాష్ట్ర రాజకీయాధినేతల చేతుల్లో ఓడిపోయాడు. ఐనా పట్టు వదలకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయం నాటక శాఖలో తన సత్తా చూపాడు. ఇంగ్లీషు ఆచార్యులుగా ఉండి కూడా కళలే తన పరమావధి అని నమ్మాడు. నాటకరంగంలో పెద్దలను, తన తరాన్ని కలిపి కృషి చేశాడు. అదేమంత గొప్పకాదు. కాని రాబోయే తరాలను కూడా తయారు చేశాడు. ఐతే ఆయన ఆశించినంత తెలుగు నాటకరంగం ముందుకు పోలేకపోయింది. ప్రయోగశీలత్వానికి దూరమై, కొత్త ఆలోచనలను స్వీకరించక గుడుగుడుగుంజం గుండే రాగంలా మారింది. సినిమా ఆకర్షణలో నాటకం వికసించలేదు. ఎక్కువగా అనువాదాలు, సామాజిక దూరాలతో నాటకం జాతీయ స్థాయిలో వికసించలేదు. మొదలి లాంటివారి కృషికి చేయూత, అనుకున్నంతగా లభించలేదు. అమెరికాలో నాటకంలో ఎం.ఎఫ్.ఎ. చేసివచ్చి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖలో చేరాడు. ప్రొ॥ జి.రామిరెడ్డి అమెరికాలో మొదలివారి నాటకం చూశాడు. ఆ తరువాత కొన్నేండ్లకు ఆయన విసి అయ్యారు. అతనే ఉస్మానియా విశ్వ విద్యా లయంలో నాటక శాఖ ఏర్పాటు చేశారు. దానికి మొదలివారే మొదటి శాఖాధిపతి.

ఐతే ఆయన జానపద కళారంగానికి, పరిశోధనకి చేసిన కృషి విలక్షణమైనది. నాటకం, కూచిపూడి తదితర రంగాలకి ఆయన చేసిన పని చాలా మంది చాలాసార్లు ప్రస్తుతించారు. కాని ఏటికెదురీది జానపద రంగానికి తెచ్చిన వన్నె చాలా మంది విస్మరిస్తారు – అందుకే మరోసారి ఈ కృషి, గురించి తెలుసుకుందాం. ఇందులో కొంతభాగం 'ప్రతిభా వైజయంతి' – 2019 లో వచ్చింది.

తన ఎనిమిదో ఏట నుండి శర్మగారు నాటకాలు వేశారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్నప్పుడు కూడా నాటకాలను వదలలేదు. నాటక రచన, ప్రదర్శనతో పాటు పరిశోధనా రంగంలో తనదైన ముద్రవేశారు. గుంటూరు ఎ.సి. కళాశాల నుండి 1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. కాకతీయ సాంస్కృతికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి కార్యకలాపాలలో వీరు చురుగ్గా పాల్గొన్నారు. దాని ఆధ్వర్యంలో 'నాట్యకళ' పత్రిక నడిచేది. అందులో జానపద ప్రదర్శనలు, సంగీత వాద్యాల గురించి ఎన్నో వ్యాసాలు వచ్చేవి. శర్మగారు కూడా నాటక వ్యాసాలు రాశారు.

తెలుగు నాటక రంగంపై లోతుగా పరిశోధిస్తున్న సమయంలో జానపద కళలపై ఆసక్తి పెరిగింది. జానపద నాటకాలు ఉన్నాయని, అవి కొన్ని వేల ఏళ్ళ నుండి ప్రజలలో మంచి ఆదరణ పొందాయన్నది

అందరికీ తెలిసిన విషయమే. భరతుని 'నాట్యశాస్త్రం' లో కూడా వీటిని పేర్కొన్నారు. వీటిని వీథినాటకాలని, గ్రామీణ నాటకాలని, దేశీ రూపకాలని వ్యవహరిస్తారు. మార్గ నాటక రీతులకన్నా దేశీ జానపద నాటకాలు ప్రాచీనమైనవి. గిరిజన నాటకాలు కూడా వివిధ రూపాలలో కానవస్తాయి. వేటాడడాన్ని, క్రూర జంతువుల నుండి రక్షించుకోవడాన్ని నృత్య రూపక ప్రదర్శనల ద్వారా పిల్లలకు చూపడం నుండి ఇవి ప్రారంభమయ్యాయి. కావ్య ప్రబంధ రచనలు ఆస్థాన కవులు చేసేవారు. అక్కడ జానపద కవులకి స్థానం లేదు. కాని మార్గ నాటకాలకన్నా దేశీ నాటకాలలకి ఆ స్థానంలోనే ఎక్కువ ఆదరం లభించేది. ఈ సంప్రదాయం అన్ని భాషలలో, అన్ని ప్రాంతాలలో నేటికీ కొనసాగుతుంది. వీటిని చిందు అనీ, వీధి బాగోతం అనీ, యక్షగానాలు అనీ, దేశీ రూపకాలని పిలుస్తారు. ఐతే ఈ పదాలు పర్యాయ పదాలు కాదు. వేటికవే స్వరూప స్వభావాలలో, రూపం, ఇతి వృత్తంలో వేరువేరు. వీటిలో సంగీతం, ఆహార్యం కూడా ప్రత్యే కించి ఉంటాయి. ముఖ్యంగా పేర్కొనవలసింది ఆయా ప్రదర్శనలకు ప్రేక్షకులు వేరువేరుగా ఉంటారు. కులం, మతం వారిగా అనుబంధ కళలుగా, ప్రదర్శనలుగా వీటిని పేర్కొనవచ్చును. ఈ ప్రదర్శకులకు ఒక కులం, కులం మీద ఆధారపడిన ఉపకులం, మతం, మత విభాగం, క్రమ కర్మకాండ, పూజ, కుల పురాణ ప్రదర్శన వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేకమైన కట్టుబాటు, శిష్యపరంపర, కుల జన ఆధారిత రూపకాలు విడివిడిగా ఉంటాయి. వీటిని ప్రద ర్శించే వారిలో ఎక్కువగా వృత్తినాటక ప్రదర్శకులు ఎక్కువ. కొన్ని కొత్త కులాల పేర్లు, వాటికి అనుబంధించిన ప్రదర్శనలు ఉంటాయి.

ఈ ప్రదర్శకులే గురువులుగా, పూజారులుగా, పురోహితు లుగా, వైద్యులుగా ఉంటారు. వీరిలో చాలా మంది సంచారులు కేవలం నటులు అని అనలేం. ఆయా సమాజాలలో వారిది బహు ముఖ పాత్ర. ఐతే వీరి ప్రదర్శనలకు ప్రత్యేకమైన రంగస్థల వేదిక అంటూ ఉండదు. సందర్భాన్ని బట్టి ప్రదర్శన జరుగుతుంది. నిజానికి అవి మనకు నాటక ప్రదర్శనలు. కాని ప్రదర్శకులకు, శ్రోతలు, ప్రేక్షకులు, పాల్గొనే ప్రజలకు అది పూజ, బలి, కర్మకాండ, ఆచారం ఏదైనా కావచ్చు. ఐనా అందుకు నాటకీయత, సంగీతం, సంభాషణ, కథ వంటి అన్ని అంశాలు ఒక గొప్ప ప్రదర్శనగానే భాసిస్తాయి. ఇలాంటి రూపక సాహిత్య ప్రదర్శనల గురించి 'నాటకళ తదితర పత్రికలలో చర్చింపబడేది. పరిశోధక జిజ్ఞాసువు కాబట్టి శర్మగారు తొందరగా వాటి పట్ల ఆకర్షితులయ్యారు. ఈ కళారూప ప్రదర్శనలను 'జననా ట్యాలు' అని, శర్మగారు తాను రాసిన జానపద నాటక వికాసం' వ్యాసంలో పేర్కొన్నారు. ఈ వ్యాసంలో దేశీయ రూపకాల గురించి నాటక దృక్కోణంలోంచి పరామర్శించారు. దేశీ రూపకాలలో సంగీత ప్రధానమైన నాటకాలు, నృత్య ప్రధానమైన నాటకాలు ఉన్నాయని ప్రతిపాదించారు. భక్తి ప్రధానమైన నాటకాలను, 'ధార్మిక నాటకాలు'గా పేర్కొన్నారు. తెలుగులో 'భామా కలాపం' సంగీత నృత్య ప్రధానమైన రూపకం. రానురాను ఇది కూచిపూడి నృత్యంగా మారిపోయింది. అంటే జానపదీయ రూపకం శాస్త్రీయ నృత్యంగా మారింది. అలాగే యుద్ధనృత్యం వీరనాట్యం, ఆంధ్రనృత్యంగా పేరుగాంచింది. శారద వాద్యం వాయిస్తూ పాడే కథని వేదిక మీద ప్రదర్శించినప్పుడు 'బుర్ర కథ' అయ్యింది. వైష్ణవాలయంలో ఒక కథకుడు లేదా పౌరాణికుడు చెప్పే కథకు తానే సంగీతం, నటనా, నృత్య భంగిమను కలిపి కథ చెబితే అది 'హరికథ'గా మారింది. బుర్రకథ, హరికథ అటునిటు వందేళ్ళకిందటి జానపద కళా రూపాలుగా పేర్కొనవచ్చు.

శర్మగారు 'జానపద నాటక వికాసం వ్యాసంలో దేశీయాల వికాసంలోని మూడు ముఖ్య దశలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటి లోని ఇతివృత్తం గురించి వివరించారు. పాత్రల గురించీ పాత్ర పోషణ గురించి తెలిపారు. భాష, సంగీతం, హాస్య, సంభాషణలు ఎలా ఉంటాయో చక్కగా చెప్పారు. నాటక కళ అధ్యయన శీలి కాబట్టి జానపద నాటకాల ప్రదర్శన రీతుల గురించి అంతకుముందు ఎవరూ చెప్పని విషయాలను వివరించారు. జానపద ప్రదర్శనలకి వేదిక ఉండదు. రంగస్థల అలంకరణ ఆనాటి సందర్భానుగుణంగా మాత్రమే ఉంటుంది. ఎలాంటి తెరలు ఉండవు. ప్రారంభంలో మాత్రమే ఒక తెల్లని గుడ్డ పట్టుకుని ఉంటారు. ప్రార్థన సమయంలో పౌరాణిక దైవాలు, పాత్రలు ఉంటాయి కాబట్టి, ఆ తెరని తీయగానే పాత్రధారులు అంతా కలసి ప్రార్థన చేస్తారు. ఆ తెర మళ్ళీ కనబడదు. పాత్ర ప్రవేశం సూత్రధారి లేదా ఇతర పాత్రధారి సూచన చేసి పిలుస్తాడు. ఆ పాత్ర రంగ ప్రవేశం చేసి తన గురించి తాను నృత్యం చేస్తూ, సంగీతం వాయిస్తూ పద్యంలోనో, గేయంలోనో వివరిస్తాడు. ఎలాంటి వేదిక, రంగస్థల అలంకరణ లేకుండానే శ్రోతలను, ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో ప్రదర్శన నడుస్తుంది.

ఆధునిక నాటక ప్రదర్శనలో ప్రయోగాత్మకంగా జానపద నాట కాల నుండి గ్రహించి పేరు ప్రఖ్యాతులు పొందారు. ఉదాహరణకు, గొల్ల సుద్దులు, ఒగ్గు కథ వంటి ప్రదర్శనలలో వేదిక నుండి "ఓరి మల్లన్నా, ఎక్కడున్నావ్. రారా, కథా మొదలైతాంది" అంటారు. ప్రేక్షకులలో కూర్చున్న మల్లన్న ఆవలిస్తూ లేచి వేదిక దగ్గరకు వస్తాడు. ఇలాంటి అంశాన్ని మరాఠీ కన్నడ ఆధునిక రంగస్థలం స్వీకరించింది. ఇలాంటి ఎన్నో సంప్రదాయ పద్ధతులను ఆధునీక రించారు. శర్మగారు సుమారు 1970 ప్రాంతం నుండి మోహన్ రాకేశ్, బాదల్ సర్కార్, విజయ్ టెండూల్కర్, సతీష్ తన్వీర్ గిరీశ్ కర్నాడ్ ఇలాంటి ఎంతో మంది నాటక ప్రయోక్తలు ఎన్నో ప్రయోగాలకు స్థానం కల్పించారు.

ఏది ఏమైనప్పటికీ – తెలుగు జానపద కళా రూపాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తేవడంలో కృషి చేసిన వారిలో శర్మగారు ఒకరు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1982లో నాటక శాఖ ఏర్పడింది. దానికి శర్మగారే మొదటి శాఖాధిపతి. శర్మగారు 'నరజాతి చరిత్ర సమస్తం' అనే నాటకంలో నాలుగైదు జానపద కళా రూపాలలోని మూల కథలను వాడుకుని నాటకంలో జరుగుతున్న సంఘటనలను వివరించడానికి, వ్యాఖ్యానించడానికి వాడుకున్నారు.


జానపద కళారూపాలలో అతి ప్రాచీనమైన కళారూపం తోలు బొమ్మలాట, కొయ్యబొమ్మలాట. మనిషి తనకి ప్రతిరూపంగా తోలు బొమ్మని సృష్టించాడు. వాటితో వినోదం, విషయజ్ఞానం పొంద డానికి ప్రదర్శనలు తయారు చేశాడు. మన రాష్ట్రంలోని తోలు బొమ్మలాట ఆయనని విశేషంగా ఆకట్టుకుంది. న్యూ ఢిల్లీలోని సంగీత నాటక అకాడమీ వారికి 'తోలుబొమ్మలాట' అనే ఇంగ్లీషు పుస్తకం రాసిచ్చాడు.

అలా ఆయన ఎన్నో పనులు చేశారు. ఎంతోకృషి మిగిలే ఉంది. ఆయన మరణం కళారంగానికి లోటే అనేమాట సరిపోదు.

డా॥ నాగసూరి వేణుగోపాల్
9440732392

అందరికీ సైన్స్‌ను అందిద్దాం

ఫిబ్రవరి 28 : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా


హోసూరు నరసింహయ్య

సుమారు మూడు దశాబ్దాల క్రితం – సరిగ్గా చెప్పాలంటే 32 సంవత్సరాల పూర్వం ఆగస్టు మాసం ప్రాంతంలో ఒక వ్యాసం నన్ను వెంటాడింది. నిజానికి అది చదవడం కాకతాళీయం. కర్నాటక రాష్ట్రం పి.యు.సి. మొదటి సంవత్సరం ఫిజిక్స్ పుస్తకంలో ఉపోద్ఘాతంగా ఆ వ్యాసం చదివాను. ఆ వ్యాసం చదివిన తర్వాత – అలా వుండలేకపోయాను. పలుసార్లు చదివాను. అయినా తృప్తి కలగలేదు. ఈ విషయాలు తెలుగు వాళ్ళు అంతా తెలుసుకుంటే బావుంటుంది గదా! – ఇలా ఆలోచనలు సాగుతున్నాయి.

అది 1986 అనుకుంటా. హిందూపురానికి నలభై కిలోమీటర్ల దూరంలో ఉండే బాగేపల్లి (కర్నాటక)లో లెక్చరర్‌గా నాలుగయిదు నెలలు పనిచేశాను. ఇది ఆ సమయంలో జరిగిన సంఘటన ఇది. ఆ ఆలోచన రాగానే ఆ 'సైన్స్ అండ్ హ్యూమనిజం' అనే వ్యాసాన్ని అనువదించాను. పాతికేళ్ళ వయసు ఉత్సాహం, పట్టుదలతో ఆ అనువాదాన్ని మెరుగుపరుస్తూ ఆరుసార్లు తిరగరాశాను. చాలా బాగా వచ్చిన నా తొలి అనువాద రచన అది. అందులోని ఆలోచనలు ఇప్పటికీ వర్తిస్తాయి మరింత బాగా.

హెచ్.ఎన్. గా పిలువబడే హోసూరు నరసింహయ్య 1920 జూన్ 6న ఆంధ్రప్రదేశ్ సరిహద్దు పల్లె హోసూరులో జన్మించారు. మాతృభాష తెలుగు. పేదరికం, పట్టుదలగా జీవితం సాగింది. 1936లో గాంధీగారిని ఒక మీటింగులో బాలుడిగా చూశారు, పలకరించారు. కాసేపు ఉపాధ్యాయుల కోరికపై అనువాదకుడిగా పనిచేశారు. ఫలితం జీవితాంతం గాంధేయవాదిగా మారిపోయారు. 1946లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, చెరసాల పాలయ్యారు కూడా. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పిహెచ్.డి. అమెరికా నుంచి పొందారు. బెంగుళూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా పనిచేశారు.

జీవితంలోని అర్థరాహిత్యాన్ని ఎదుర్కొన్న ధీశాలి. సత్యసాయి గాలి నుంచి గడియారాలు, ఉంగరాలు తీయడాన్ని ఖండించారు. ఈ విషయాలు ఆ తరం వారికి బాగా తెలుసు. 1985లో ప్రార్థ ద్వారా బెంగుళూరు సమీపాన ఉన్న టి.జి.హళ్ళి చెరువు నింపుతానని ప్రకటించిన బాలయోగిని సవాలు చేశారు నరసింహయ్య. మూఢనమ్మకాలకు ఆధారం ఏమిటో, దానికి విరుగుడు ఏమిటో, సైన్స్ దృష్టి ఏమిటో – ఇలా సైన్స్ అంతిమ లక్ష్యం ఏమిటో 'సైన్స్ – మానవత' అనే వ్యాసం చక్కగా వివరిస్తుంది.

1989 నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ 2019 సైన్స్ దినోత్సవపు ఇతివృత్తం – కమ్యూనికేటింగ్ సైన్స్ టు ఆల్ – అందరికీ సైన్స్ ను అందజేద్దాం!

ప్రస్తుత తరుణంలో నిబద్ధత గల సైన్స్ పోరాట యోధుడు నరసింహయ్య వర్ధంతి (జనవరి 31), అలానే జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆ ప్రత్యేక వ్యాసం మీకు అందిస్తున్నాం.

సైన్స్–మానవత

ఈ భూగోళం మీద జీవం ఆవిర్భవించి దాదాపు రెండు కోట్ల సంవత్సరాలు అవుతోంది. ఈ సుదీర్ఘ కాలంలో ప్రాణికోటి నిదానంగా, నిలకడగా ఎన్నో పరిణామ దశలు దాటుకుంటూ వచ్చింది. ఈ పరిణామ క్రమంలో అత్యల్ప సూక్ష్మజీవులు మొదలుకొని భూచరాలైన చతుష్పాద జంతువులు, రెండుకాళ్ళ మనిషి దశవరకు మార్పు చెందడం అనేది ఒక వినూత్న శకాన్ని ఆవిష్కరించింది. దీనితో బాటు మానవుల భావ ప్రకటనకు అనువుగా భాష కూడా రూపొందడం మరో అద్భుత పరిణామం. ఇది మరెన్నో పరిణామాలకు నాంది పలికింది.

అనాది మానవునికి ప్రకృతి గురించి తెలిసింది అతి స్వల్పం. అతని మెదడు సరిగా వికసించకపోవడమే దానికి కారణం. అయితే, నిత్య జీవితంలో అతనికి ఎదురయ్యే ఎన్నో సంఘటనలు అర్థంకాని ప్రశ్నలుగా నిలిచాయి. కారు మబ్బు పట్టినపుడు వినపడే ఉరుములూ, కనపడే మెరుపులూ అతణ్ణి ఆశ్చర్యచకితుణ్ణి చేయడమే గాక అతనిలో భయభ్రాంతులు కలిగించాయి. మిట్టమధ్యాహ్నపు సూర్యకాంతిని చీకటిమయం చేసే సూర్యగ్రహణమూ, వెన్నెల వెలుగులో మసక చీకట్లను చిమ్మే చంద్రగ్రహణమూ అతనికి అయోమయంగా తోచాయి. అటువంటి భౌతిక సంఘటనలకు అతీత శక్తులే కారణమని అతను భావించాడు. అట్లాగే మనిషి పుట్టుకా, మరణమూ అతనికి అసలు అర్థం కాక ఎంతో గందరగోళాన్ని సృష్టించాయి. కాలగమనంలో క్రమేణా వీటి గురించి అతనికి ఉత్సుకత మొదలైంది. అతనికి అర్థం కాని వాటిని అతను పరిశీలించడం ప్రారంభించాడు. అటువంటి పరిశీలనతో మరిన్ని ప్రశ్నలు అతనికి ఎదురయ్యాయి. దానితో అతని ఆలోచనా వికసించింది. ఇటువంటి విశేషాలు అతనికి కొంచెం కొంచెం అవగతమవుతూ వచ్చాయి. ఆ విధంగా కాలక్రమేణా మనిషి తన కెదురయ్యే ప్రతి చిన్న విషయాన్ని ప్రశ్నిస్తూ తరచూ పరిశీలించడం అలవాటు చేసుకున్నాడు. ఇట్లాంటి ఆలోచనా రీతే విజ్ఞానశాస్త్రానికీ, శాస్త్రీయదృక్పథానికీ బాట వేసింది.

అయితే... సైన్స్.... అనే పదాన్ని చాల కొద్దిమంది మాత్రమే సరైన రీతిలో అర్థం చేసుకుంటున్నారు. సైన్స్‌ను, టెక్నాలజీతో ముడివేసి రెండూ ఒకటేనని భావించకూడదు. ఉదాహరణకు విమానం తీసుకుందాం. అది కేవలం శాస్త్రం ఆధారంగా నిర్మించిన ఒక యంత్రం మాత్రమే ! అట్లాగే ఇంజనీరు వేసిన ప్లానూ, దాని ఆధారంగా కట్టిన భవనమూ ఒకటి కావు. అదీ సైన్స్‌కీ, టెక్నాలజీకి వున్న తేడా !

టి.ఎ. థాంసన్ ....ఇంట్రడక్షన్ టు సైన్స్.... అనే పుస్తకంలో సైన్స్ యొక్క ఉద్దేశాన్ని ఇట్లా వివరిస్తారు. వీలైనంత ఖచ్చితంగా, సులువుగా, సంపూర్తిగా, మరలా మరలా పరీక్షించేందుకు వీలుగా వ్యక్తిగతం కానటువంటి విషయాలను వివరించడమే సైన్స్ ఉద్దేశం. ఒక భౌతిక సంఘటనను పరశీలించిన శాస్త్రవేత్త దానిలోని సారూప్యతనూ, నిర్దిష్టతనూ గమనించి కొన్ని సర్వసాధారణ నియమాలను పేర్కొంటాడు. వాటి నుంచి ఫలితాలను రాబట్టి సూత్రీకరిస్తాడు.

అంటే భౌతిక సంఘటనను గమనించి, హేతుబద్ధంగా సత్యాన్ని నిర్ధారించడంలో శాస్త్రం రూపుదిద్దుకొంటుంది. ప్రయోగానికీ, పరీక్షకూ నిలబడే గుణాలు సైన్స్‌ని సంపూర్తి చేస్తాయి. సైన్స్ దేన్న యినా అంగీకరించేముందు దాన్ని శల్యపరీక్ష చేస్తుంది. ఆధారం, కారణం లేకుండా సైన్స్ దేన్నీ ఒప్పుకోదు. అత్యంత పురాతన పుస్తకంలోని మాట అని గానీ, ఒక గొప్ప వ్యక్తి అభిప్రాయమని గానీ శాస్త్రం అంగీకరించదు. ప్రతిదాన్నీ ప్రశ్నిస్తుంది, పరిశోధిస్తుంది. ఆ రకంగా సైన్స్ అభివృద్ధి చెందుతుంది. పరిశోధించే వ్యక్తి రాగద్వేషాల మీద సైన్స్ ఎంతమాత్రమూ ఆధారపడదు. అంటే సైన్స్ వ్యక్తిగతం కాదు. అది సార్వత్రికమైంది. అయితే సైన్స్‌లో అన్ని నిర్ధారణలూ సర్వకాలికమైనవి కావు. మరింత విషయ పరిజ్ఞానంతో, కొంగ్రొత్త ప్రాయోగిక అనుభవంలో సైన్స్ ఎప్పటికైనా మారవచ్చు. అభివృద్ధి చెందవచ్చు. ఈ పరిణామ పద్ధతినే శాస్త్రీయంగా సత్యశోధన జరపడం (శాస్త్రీయ దృక్పథం లేదా సైంటిఫిక్ టెంపర్మెంట్) అని అనవచ్చు.

అడుగడుగునా మత మౌఢ్యంతోనూష పిడివాదంతోనూ పోరాడి, పోరాడి సైన్స్ ప్రస్తుత స్థానాన్ని అధిష్టించింది. దాని ప్రగతికీ, ప్రాచుర్యానికీ అడ్డుపడుతున్న ప్రతిదానితోనూ సమరం సాగిస్తోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం గణనీయ ప్రగతిని సాధించినా, దానికి తగ్గ శాస్త్రీయ దృక్పథాన్నీ, స్ఫూర్తినీ పెంపొందించ లేకపోయాం. మనిషి చంద్రుని మీదకు వెళ్ళి దిగ్విజయంగా తిరిగి వచ్చినా మన ఆలోచనాస్థాయీ, దృక్పథమూ ఇంకా అధ్వాన్నస్థితిలోనే వున్నాయి. ఉదాహరణకు సూర్యగ్రహణానికి రెండు సిద్ధాంతాలు వున్నాయి. ఒకటి టీచర్ క్లాస్‌రూంలో బోధించడానికీ, మరొకటి తను ఇంట్లో పాటించడానికి. ఇంట్లో పాటించే విషయంలో అతని దృష్టిలో సూర్యచంద్రులు ఇంకా రాహూ కేతువుల నుండి బయటపడలేదు. డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని జీవశాస్త్ర ఆచార్యుడు చక్కగా బోధిస్తాడు. అయితే అతను మాత్రం తనకుతాను అశాస్త్రీయ సిద్ధాంతాన్ని గుడ్డిగా నమ్ముతాడు. అదే విధంగా ఒక ఫిజిక్స్ అధ్యాపకుడు పదార్థాన్ని సృష్టించడం కానీ, నశింపచేయటం కానీ సాధ్యపడదనే ....నిత్యత్వనియమాన్ని.... (లా ఆఫ్ కన్సర్వేషన్) క్లాసులో అతి చక్కగా వివరిస్తాడు. కానీ తను మాత్రం గాలిలోంచి గడియారం తీయడం సాధ్యమంటాడు. అట్లాగే ఒక ఖగోళ శాస్త్రజ్ఞుడు పూర్తిగా అసంబద్ధిత జ్యోతిష్యాన్ని నమ్మినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఇటువంటి వారికి సైన్స్ పొట్ట కూటికి సాధనమవుతుందే కానీ వారి జీవిత మార్గం కాదు. అటువంటి వారు పరిశోధనలో, బోధనలో అత్యంత హేతుబద్ధంగా వున్నా, నిజ జీవితంలో మాత్రం ఎంతో హేతురహితంగా ప్రవర్తిస్తారు.

పాపం అప్పుడు వారి ఆలోచనా, యింగితమూ అటకెక్కి సెలవు తీసుకుంటాయేమో! సైన్స్ ఆటంబాంబు తయారు చేయడానికి తోడ్పడుతుంది. కానీ దానితో ఉత్పన్నమయ్యే శక్తిని సమాజానికి సద్వినియోగపడే విధంగా వాడుకోమనేటటువంటి నైతిక ఆదర్శాలను మాత్రం బోధించదు. అలాగే ఆటంబాంబు ప్రయోగించే మనిషి ఆలోచనను ప్రభావితం చెయ్యలేదు. కనుక మానవ సంపూర్ణాభివృద్ధి, సామాజిక సంక్షేమం అనేవి సైన్స్‌కు పరమాదర్శాలు కావాలి.

నేడు ఎన్నో మతాలున్నాయి. వాటిని వివిధ కాలాల్లో, వివిధ దేశాల్లో స్థాపించారు. వాటి స్థాపనకు మూలకారణాలు ఏవైనా, ప్రస్తుత కాలంలో మతాలు మాత్రం మానవజాతిని చీల్చి చెండాడి,

ఓట్లు అడిగేది తెలుగులో...ఉత్వర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?

మానవుల ఐక్యతను మంటగలుపుతున్నాయి. వారి ప్రగతిని నాశనం చేస్తున్నాయి. ఒక మతం మరొక మతంపై కత్తిని దూసింది. నిజానికి ఒక మతానికి మరో మతాన్ని మించిన శత్రువు అంటూ ఏదీ లేదు. అది రెండు మూఢ సమూహాల మధ్య జరిగే యుద్ధం తప్ప మరొకటి కాదు. స్థూలంగా అన్ని మతాల మౌలిక సూత్రాలు ఒక్కటే ! వాటి ప్రకారం ....దేవుడు.... మాత్రం స్థిరంగా నెలకొని వున్నాడు. ప్రతి మతం అత్యద్భుతాలకూ, అసంగతాలకూ నిలయం. ఇవన్నీ ప్రకృతి సూత్రాలకు విరుద్ధం, వాస్తవానికి ఎంతో దూరం. ప్రతి మతానికి ఒక పవిత్ర గ్రంథముంటుంది. అయితే, ఏ మతగ్రంథంలోనూ ఈ భౌతిక ప్రపంచ ప్రవృత్తిని కానీ, దాని పోకడలను గానీ వివరించలేదు. ఆ పని కేవలం శాస్త్రపరిశోధనల ఫలితంగానే సాధ్యపడింది. ఒక వేళ, అట్లా ప్రయత్నించే మతం ఏదైనా వుంటే అది మోసానికి, వంచనకీ గురవుతూ వుంది. మూఢనమ్మకమే ప్రతి మతానికీ పునాది. ....నమ్మితే నమ్మూ...లేకపోతే వదిలెయ్ – ఇదే ప్రతి మతం యొక్క మౌలిక దృక్పథం. మతం ఆలోచనను అసహ్యించు కుంటుంది. హేతువును వ్యతిరేకిస్తుంది. పరిశోధనను విసర్జిస్తుంది. ఈ విధంగా మానవ స్వేచ్ఛావలోకనాన్ని బంధించేదిగా మతం తయారయ్యింది. మూఢత్వాన్ని బలవంతంగా సంఘం నెత్తిన రుద్దడమే మతోన్మాదుల ముఖ్యపనిగా అయ్యింది. స్వర్గం, నరకం అనే భావనలు కూడా మతమే కల్పించింది.

మనిషి శిరస్సుపై మతం పైశాచిక నృత్యం చేసిన రోజులు న్నాయి. అప్పుడు బూటకం, మోసం, వంచనా అనేవి అందలం ఎక్కితే, నిజాయితీ, స్వేచ్ఛా, ఆలోచనా అనేవి సంకెళ్ళ పాలయ్యాయి. మధ్యయుగకాలంలో ఆలోచించిన పాపానికి చర్చి జరిపిన దురాగతాలు తలచుకోవడమే ఎంతో విషాదకరం! ప్రశ్నించడం నేర్పని ఆ చీకటి రోజుల్లో కేవలం ఆలోచించిన నేరానికి గెలీలియో, బ్రూనో వంటి వారిని బాధించి, వేధించి, వధించారు. అభ్యుదయానికి పాటుపడిన ప్రతి వుద్యమాన్ని మతాలు అడ్డుకున్నాయి. మతానికీ, సైన్స్‌కూ పోరు సాగుతూనే వుంది. అవి రెండు జతపరచటం సాధ్యం కాదు. గుడ్డి నమ్మకం, ఆలోచనా లేమి, హేతు రాహిత్యం అనేవి మతానికి మూలమైతే– హేతువాదం, అన్వేషణ, ప్రయోగం అనేవి సైన్స్‌కు మూలాధారం. మూఢత్వంతో సైన్స్ కాపురం చేయలేదు. మానవ వికాసానికీ, సంక్షేమానికీ ఎంతో పాటుపడుతున్నట్లు కనిపించినా మతం సైన్స్‌కు సరైనజోడీ కానేకాదు.

అయినా, ఈ...దేవుడు...అంటే ఏమిటి? దేవుడి గురించి వున్న భావనలలో ఏకాభిప్రాయం లేదు. దేవుడి గురించి ఒక్కోమతం ఒక్కోరకంగా నిర్వచిస్తుంది. కొన్ని మతాల ప్రకారం దేవుడు సాకారుడైతే, మరి కొన్నిటి ప్రకారం నిరాకారుడు. నిజానికి దేన్నైతే దైవశక్తిగా నిన్న భావించామో దాన్నే నేడు ప్రకృతి శక్తిగా లెక్కిస్తున్నాం. ఎక్కడయితే భౌతికశాస్త్రజ్ఞుడు విచారించి విషయాన్ని కనుక్కుంటాడో అక్కడ నుంచి పూజారి పలాయనం చిత్తగిస్తాడు. మనకు అర్థం కానిదీ, తెలియనిదీ ....దేవుని.....గా చలామణీ అవుతుంది. నిక్కచ్చిగా చెప్పాలంటే అసలు అజ్ఞానం అనేది దేవుడికి సమానం అవుతుంది. సైన్స్ విస్తరించి, అభివృద్ధి చెందటంలో రోజురోజుకూ దేవుడి స్థానమూ, ప్రభావమూ కుంచించుకు పోతున్నాయి. సైన్స్ చేతిలో అసంగతమతం చావు దెబ్బలు తిన్నది, తింటోంది. కొన్ని సమయాల్లో సత్యమే దేవుడని పేర్కొన్నారు. ఇదే నిజమైన పక్షంలో కర్పూర నివాళులూ, ధూప దీపాలతో నిండిన దేవాలయం కన్నా సత్యశోధనలకు సతతం పాటుపడే ప్రయోగశాలలే ఎంతో అవసరం. మనిషిని దేవుడు సృష్టించాడనే కన్నా, తత్వవేత్త వోల్టేరు చెప్పినట్లు ఈ మానవుడే ...దేవుడు... అన్న భావనను కల్పించాడనేది మరింత నిజమనిపిస్తుంది. సైన్స్ ప్రకారం ఏదీ కొత్తగా పుట్టుకురాదు. కానీ వున్న ప్రతీదీ మరో విధంగా పరిణామం చెందుతుంది.

సైన్స్ దేవుడి గురించి ఏమీ పట్టించుకోదు. భౌతిక సంఘటనలు అర్థం చేసుకోవడంలో ...దేవుడ...నే భావన ఎంత మాత్రమూ సహకరించదు. అలాగే మానవతావాదం కూడా దేవుణ్ణి పటించుకోదు. ఒకవేళ దేవుడున్నా మనుషుల విషయాల్లో అతడికేమీ పాత్రలేదు. హేతువాదమే ప్రధాన మార్గంగా మానవ సమస్యలను పరిష్కరించటమే మానవతావాదం. మనిషి పెరుగుదలా, సాఫల్యమూ, సృజనాత్మకతా అనేవి మానవతావాదానికి ప్రధానం. ఈ మానవతావాదం ప్రకారం– మనిషి దైవ సాయం లేకుండా తన కాళ్ళ మీద తాను నిలబడి, తన కర్తవ్యం తాను చెయ్యాలి. తన విధికి తానే విధాత! తన భవిష్యత్‌కు తానే నిర్మాత!

ఇంకా ప్రార్థనల ద్వారా, పూజల ద్వారా విన్నపాలు చేసుకోవడం కూడా అర్థ రహితం. మనిషి ఆలోచన మీదా, అతడి అమోఘశక్తి సామర్థ్యాల మీదా నమ్మకం కలిగివుంటే చాలు. ఈ స్వర్గ–నరక భావనలూ, కర్మ సిద్ధాంతాలు, వర్ణ వ్యవస్థలూ, పునర్జన్మ వాదమూ, మోక్షసాధన వంటివి సామాజిక అన్యాయానికీ, ఆర్థిక మోసాలకూ తోడ్పడతాయి. సామాజిక న్యాయానికై పోరాడేవారి మనోనిగ్రహాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి నమ్మకం చాటున, భయం నీడన కాకుండా హేతువాదపు వెలుగుల్లో ప్రయోగాల ఊతతో మానవతావాదం నిలబడుతుంది. ప్రకృతికీ, మానవ జీవితానికీ సైన్స్, టెక్నాలజీలను అనువర్తించి పరిసరాల్ని అదుపు చేయవచ్చు. పేదరికాన్ని పారద్రోలవచ్చు. రోగాలను తగ్గించవచ్చు. మానవ ఆయుర్దాయాన్ని పెంచవచ్చు. విజ్ఞాన వంతుని చేయవచ్చు. మనిషి పరిణామాన్నే మార్చవచ్చు! ఎన్నో వినూత్న శక్తులకు తలుపులు తెరచి మనిషికి విస్తృతమైన, అర్థవంతమైన జీవితాన్ని కల్పించవచ్చునని మానవతావాదం ఆశిస్తోంది.

సంప్రదాయక నీతిసూత్రాలూ, పద్ధతులూ (పురాతనమైనవైనా, ఆధునిక మైనవైనా) అవి మనిషి అవసరాలకు తగినంతగా సాయపడలేదు. మత సిద్ధాంతాల ప్రకారం నైతికత అనేది సాపేక్షికమైంది. నిన్న నీతికానిది నేడు నీతికావచ్చు. ఈ నీతిశాస్త్రం సాంఘికమైనది,


తెలుగులో మాట్లాడలేననే తెలుగువాణ్ణి వేదికనుంచి దింపేయండి

స్వతంత్రమైనదీ, కాలంపై ఆధారపడనిదీ. దీనికి మత సంబంధమైన ఉత్తర్వు ఎంతమాత్రం అవసరం లేదు. మనం అబద్ధం, మోసం, దొంగతనం వంటి పనులకు పాల్పడకపోవటానికి బుద్ధుడో, కృష్ణుడో, క్రీస్తో, అల్లానో కారణం కాదు. అటువంటి పనులు తప్పు అనీ, అవి ఎవరికీ ఏ రకంగానూ తోడ్పడవనీ మనకు అనుభవపూర్వకంగా తెలియడమే కారణం. నీతిసూత్రాలు, శీలగుణాలు అనేవాటికి దైవికమైన ఉత్తర్వు ఏదీ అవసరం లేదు. కాబట్టి మన ప్రవర్తనకు, మతానికీ సంబంధం లేదు. అందువల్ల మతాన్ని దూరంగా వుంచాల్సిన అవసరం ఎంతో వుంది. జాతి, దేశం, ప్రాంతం, రంగు, లింగం, పుట్టుక వంటి వాటి ఆధారంగా కాకుండా మనిషి శక్తి సామర్థ్యాలూ, మేథా, సహృదయతలను బట్టి మనిషి విలువను మానవతావాదం నిర్ణయిస్తుంది. మనిషి హుందాతనాన్ని కాపాడుతుంది.

ఈ రకంగా శాస్త్రీయ దృక్పథంలో, మానవతా వాదాలలో చాలా సామాన్య అంశాలున్నాయి. రెండూ పరిణామ బద్ధమైనవీ, సార్వత్రికమైనవీ, ప్రాయోగిక బద్ధమైనవీను. వాటికి హేతుబద్ధమైన ఆలోచనే పునాది. రెండింటిలో ఏదీ పిడివాదం కాదు. నిజాన్ని, నిజాయితీని గౌరవిస్తాయి. ఈ రెండూ నైసర్గికమైనవే కానీ దైవికమైనవి కావు. మనిషిని వ్యక్తిగా పెంపొందించడానికి ఈ రెండూ తోడ్పడతాయి. సామాజిక అన్యాయాలూ, అమానుషత్వాలూ, మోసాలు, ఆర్థిక అసమానతలూ, ప్రగతి నిరోధక వాదాలూ మొదలైన వాటిని రూపుమాపడానికి పాటుపడతాయి. కాబట్టి ఈ శాస్త్రీయ దృక్పథం, మానవతావాదాలు విద్యాప్రణాళికలో సమ్మిళితం అయితే అప్పుడు సామాజిక ప్రగతి సాధ్యమవుతుంది.

సంప్రదాయాలూ, ఆచారాలు పేరుకున్న ఈ సమాజాన్ని మార్చడానికి సంప్రదాయిక సూత్రాలతో ఏర్పడిన విద్యా ప్రణాళిక మనకు సత్ఫలితాలనివ్వదు. పిడివాదం విషయంలో విశ్వవిద్యాలయాలు దేవాలయాలకన్న తక్కువేం తినలేదు. ఈ విశ్వవిద్యాలయాలు గులకరాళ్ళకు మెరుగుపెట్టి, వజ్రాలను బొగ్గులుగా చేస్తాయి. ఒక్కోసారి గులకరాళ్ళకు మెరగుపెట్టడం కూడా అనుమానాస్పదమే! నేటి మన విద్యా వ్యవస్థ అక్షరాన్య మూఢులనూ, చదువు వచ్చిన మతోన్మాదులనూ తయారు చేస్తున్నది. వీళ్ళు చాలా ప్రమాదకరం. చాలా మంది విద్యావేత్తలకి విద్య గమ్యం ఏమిటో తెలవదు. సామాజిక, ఆర్థిక సంస్కరణలకు విద్యను ప్రధాన ఆయుధంగా వాడుకోవాలి. విశ్వవిద్యాలయాల గురించి నెహ్రూ యిలా అంటారు.

మానవతకు, హేతుబద్ధతకు, ఊహల సాహసాలకు విశ్వవిద్యాలయాలు ప్రతీకలు. అవి మానవ జాతి ఉత్కృష్ట లక్ష్యసాధనకై ప్రగతి మార్గంలో పయనించాలి. అప్పుడే దేశమూ, ప్రజలూ సవ్యంగా వుంటారు. సత్యావిష్కరణా, అన్వేషణా విశ్వవిద్యాలయ విధుల్లో ప్రధానమైనవి. పరీక్షకు, పరిశోధనకు నిలవనంత పవిత్రమైనవి ఏవీ లేవు. విశ్వవిద్యాలయాలు వాటి విధులను సక్రమంగా నిర్వర్తించాలంటే మన విద్యా ప్రణాళికలో సైన్స్, మానవతావాదాలు పడుగు పేకలు...కావాలి!...



డా॥శివరామకృష్ణ శక్తి
9441427977

దక్షిణ తెలంగాణలో కోయలు..

జనవరి సంచికకు కొనసాగింపు...

ఖమ్మం, వరంగల్ జిల్లాలలో గల కోయలు వారి ఉనికిని, వృత్తిని బట్టి గుట్ట (కొండ) కోయలు, గొమ్ము (నదీ తీరం) కోయలు, కమ్మర కోయలు, ముసర కోయలు(డప్పులు వాయించేవారు) డోలు కోయలు (కర్మకాండలలో డోలు వాయిస్తూ కథలు చెప్పేవారు. లింగకోయలు (శైవులు) వడ్డికోయలు (పూజారులు)గా పిలుచు కుంటారు. వీరి కట్టుబాట్లను నడిపించేది గ్రామ సభ 'దొరలసత్తం'. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వారి దేవతల త్యాగాన్ని మహిమను చాటిచెపుతుంది. తమకు మంచి వేట దొరకాలి అని వారు పాడే ఈ పాట " ఎవడబ్బ సొమ్మని కులుకుచు తిరిగేవు" అంటూ తన దేవుడు శ్రీరాముడిని నిలదీస్తున్న భక్తరామదాసు కీర్తనను గుర్తుకు తెస్తుంది.

యెహోరేలా రేలారేలా రేరేల రేలరేలా-యోహో ముత్తెలమ్మ సిగ్గురాదు ముత్తెలమ్మ
యోహో ముత్తెలమ్మ సిగ్గురాదు సిగ్గురాదు-యోహో గంగాలమ్మ సిగ్గుమాలే గంగాలమ్మ
యోహో గంగాలమ్మ సిగ్గురాదు సిగ్గురాదు-యోహో దండికొండ సిగ్గురాదు దండికొండ
యోహో దండికొండ సిగ్గురాదు దండికొండ-యోహో దూలపురాయి సిగ్గుమాలె దూలపురాయి
యోహో దూలపురాయి సిగ్గురాదు సిగ్గురాదు -యోహో ఊరిపేరు ఉట్టి గ్రామం దొరపేరు పొద్దయ్యదొర
యోహో దండికొండ ఎక్కెవుగాని దండిపోతునేసికిరా

దేవతలందరిని సిగ్గుపరచినట్లయితే వారికి పౌరుషం వచ్చి, వేటకు వెళ్ళిన పురుషులకు జంతువులు దొకేలా చేస్తారని గిరిజనుల నమ్మకం.

నాయకపోదుల పురాణగాథలు ..

భద్రాచలం దగ్గర రేకపల్లి నుంచి ఆదిలాబాదు జిల్లాలో గాంధారిఖిల్లా వరకు విస్తరించిన ఒక నాటి సైనికులు నాయకపోదులు, వారి ఆశ్రితులు కొర్రాజుల వారి అడవి జీవితంలో పరిమాణాలకు భారత, భాగవత కథలను అన్వయించి తమ స్వంతం చేసుకున్నారు. దళిత బహుజన గిరిజన వర్గాల ఈ సృజనాత్మకత సామాజిక సమరసత కొనసాగిస్తుంది.

నాయకపోదుల లక్ష్మీదేవర ..

కోయలతో పాటు అదే ప్రాంతంలో నాయకపోదులు వారితో కలిసి జీవిస్తున్నారు. లక్ష్మీదేవర నాయకపోదులు లేదా పద్మనాయ కులుగా పిలువబడే గిరిజన ప్రజల ప్రధానదేవత. లక్ష్మీదేవరకు సంబంధించిన కథలో శ్రీ మహావిష్ణువు రాక్షస సంహారం చేయడానికి దేవకీ వసుదేవుల గర్భంలో జన్మించి కృష్ణావతారం దాల్చినపుడు, లక్ష్మీదేవి శ్రీ సాంభవునిపట్నంలో వెండిగడిలో జన్మిస్తుంది. అక్కడ కీకారణ్యంలో కాలినడకన వెళ్తుండగా ఆమె శరీరం నుంచి చెమట బిందువులు చెరువులో ఉన్న ఎర్రటి తామరపద్మములపై పడి ఐదు గురు శిశువుల జన్మిస్తారు. పద్మములపై జన్మించిన వారు కాబట్టి పద్మనాయకులుగా గుర్తింపు పొందుతారు. వారితో, నేను మీ తల్లినైన లక్ష్మీదేవిని, మీ తండ్రి విష్ణుమూర్తి, మీరు పాలు తాగడానికి అడవిగోవులను ఇస్తున్నా, అడవిలో దొరికే పాలపండ్లు, పరికి పండ్లు, అల్లనేరడి ఫలములు, జాంబోనేరడి ఫలములు, సీతా ఫలములు, శ్రీరామ ఫలములు, దుంపగడ్డలు, ఎల్లేరు గడ్డలు, బొద్దమగడ్డ, నల్లసన్నగడ్డలు, తెల్లసన్నగడ్డలు తినుకుంటూ జీవించమని తెలుపు తుంది. వారికి పద్మనాయకుడు, రామనాయకుడు, భీమనాయకుడు, సూర్యనాయకుడు, చంద్రనాయకుడు అని పేర్లు పెడుతుంది. పండ్లు, ఫలాలు భుజించే ముందు తనతో పాటు సురాముప్పది కోట్ల దేవతలు, అష్టదిక్పాలకులు, పద్నాలుగువేల గంధర్వులు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర దేవతలందరికి తామరాకులలో పెట్టి ఆరగింపు చేయాలని తెలిపింది. పద్మనాయకులు ఐదు పర్ణశాలలు నిర్మించు కొని, లక్ష్మీదేవి చెప్పిన విధంగానే ముందు దేవతలందరికి ఆరగింపు చేస్తుంటారు.

పద్మనాయకులకు సంతానం కలిగి వారి శ్రీసాంభవపట్నం ఆరు ఆమడల దూరం విస్తరిస్తుంది. దీని నుంచి పన్నులు వసూలు కాకపోవడంతో పాండురాజు యుద్ధానికి వస్తాడు. లక్ష్మీదేవి పద్మ నాయకులను పిలిచి మహాబలవంతుడైన పాండురాజుతో యుద్ధం వద్దని చెప్తుంది. లక్ష్మీదేవి వెంట రాగా పద్మనాయకులు మంగళ హారతులతో పాండురాజు వద్దకు వెళ్లారు. పాండురాజు పద్మ నాయకుల వెంటవచ్చిన లక్ష్మీదేవిని చూసి, ఆ అమ్మాయి మీకు ఏమి కావాలి అని అడుగుతాడు. పద్మనాయకులు ఆమె మా ఇంటి దేవత, మమ్ములను పద్మములో పుట్టించి, పెంచి పెద్దచేసిందని చెప్తాడు. పెండ్లి జరిగిందా అని అడిగి, లేదని తెలుసుకొని, ఆమెను తనకు దానం ఇమ్మని అడుగుతాడు. హస్తినాపురంలో శ్రీకృష్ణుడికి లక్ష్మీదేవికి వివాహం జరుగుతున్న సమయంలో పద్మనాయకులు,

ప్రజల భాషలో పరిపాలించలేని ప్రభుత్వాలు మనకు సిగ్గుచేటు

కొర్రాజులు వివాహానికి వెళతారు.

కర్ణుడికి పిల్లని వెదుకుతూ వియ్యం కోరి వచ్చిన ధర్మ రాజును నలగామరాజు బంధిస్తాడు. పాండవులు, కౌరవులు కలిసి నందిగామునిపై యుద్ధానికి వెళతారు. బలరాముని వెంట శ్రీకృష్ణ పరంధాముని భార్య లక్ష్మీదేవి కూడా యుద్ధరంగానికి వస్తుంది. దూరం నుంచి లక్ష్మీదేవిని చూసిన అర్జునుడు నందిగాముడిగా పొర పాటు పడి ఆమె తల తెగకొడతాడు. ఆ తల పుట్టమీద పడుతుంది. దుంపల కోసం ఆ పుట్టను తవ్వుతున్న పద్మనాయకులకు దొరుకు తుంది.

అక్కడ యుద్ధభూమిలో లక్ష్మీదేవి చనిపోయిందని తెలుసుకున్న శ్రీకృష్ణుడు, పంచపాండవులు లక్ష్మీదేవిని బతికించాలని చూస్తారు. లక్ష్మీదేవి మొండేనికి తల కావాలని శ్రీకృష్ణుడు అర్జునునికి తెలుపుతాడు. అర్జునుడు యుద్ధభూమిలో చనిపోయిన ఆడగుర్రం తలనరికి తెస్తాడు. ఆడగుర్రం తలను అతికించడానికి శ్రీకృష్ణుడు పూజా కార్యక్రమం ముగిసే సమయానికి, అక్కడికి పద్మనాయకులు కూడా లక్ష్మీదేవి తలను తీసుకొని వస్తారు. శ్రీకృష్ణుడు లక్ష్మీదేవి తలను అతికించి బతికిస్తాడు. అప్పటి వరకు లక్ష్మీదేవి తలగా అమర్చి పూజలు అందుకున్న ఆడగుర్రం తలను శ్రీకృష్ణుడు పద్మనాయకులకు అందించి, మీ ఇలవేల్పు లక్ష్మీదేవిగా భావించి పూజలు జరుపు కోవాలని తెలుపుతాడు. ఆనాటి నుంచి ఈ గుర్రం తలను లక్ష్మీదేవిగా భావించి పద్మనాయకులు పూజలు జరుపుతున్నారు. కోయగిరిజనులు కూడా లక్ష్మీదేవిని తమ ప్రధాన దేవతగా భావిస్తారు.

లక్ష్మీదేవర ఆకారం నకాశి కళాకారుల చేతిలో రూపుదిద్దు కొంటుంది. ఇది గుర్రంతల ఆకారంలో ఉంటుంది. వెదురు కట్టెలతో పెద్ద బుట్టమాదిరిగా అల్లుకొని లక్ష్మీదేవర తలకు అమరుస్తారు. ఈ వెదురుకట్టలపై ఎరుపురంగు గుడ్డవేసి, లోపటి నుంచి ఒక మనిషి నిలుచొని వెళ్తుంటాడు. అతని వెంట పూజారులు వాద్యగాండ్లు ఉంటారు.

మేడారం జాతర సందర్భంగా లక్ష్మీదేవరను ఎత్తుకుని జంపన్నవాగు ఒడ్డువెంట తిరుగుతారు. భక్తులు లక్ష్మీదేవరకు మొక్కుకుని డబ్బులు చెల్లిస్తారు. సమ్మక్క గద్దె మీద నుంచి వనంలోకి వెళ్ళిన వెంటనే లక్ష్మీదేవర మేడారంలోకి వస్తుంది.

పోలీసుల శల్య పరీక్ష ..

ఈ దేవతల విశిష్టతను తెలియని పోలీసులు, వారిని హింసించిన సంఘటనను పేర్కొన్న ఒక అధికారి పేర్కొన్న ఈ సంఘటన గమనించదగినది.

తుపాకుల గూడెం గ్రామంలో చాలా మంది పిల్లలకు జబ్బులు చేస్తున్నాయట, అందుకని పక్క గ్రామంలో ఉండే నాయకపోడులను వారి దేవతలతో వచ్చి ఇక్కడ పూజ చేయమని పిలిచేరట. నాయకపోడులు వారి గ్రామాన్ని విడిచిపెట్టేముందు బొమ్మలకు పూజ చేసి ఒక చెక్కపెట్టెలో పెట్టి తాళం పెట్టారు. దారిలో అడవిలో వెళ్ళేటప్పుడు ఆ దేవతలను భద్రంగా చూసుకుంటూ తుపాకులగూడెం గ్రామానికి వస్తున్నారు. అప్పుడే నక్సలైట్లకై గాలింప చర్య చేపట్టిన పోలీసులకు వీరు తారసపడ్డారు. గాలింపుచర్యకు బయలు దేరే ముందు, తుపాకుల గూడెంలో కోయలు పూజలు చేస్తున్నారని తెలిసి, పోలీసులకు మేకమాంసం ప్రత్యేకంగా ఇవ్వాలని ఒప్పందం అప్పటికే చేసుకున్నారు కూడా. అసలే పిల్లల జబ్బులతోటి, చావులతోటి బాధపడుతున్న కోయలు, ఇది మరో ఖర్చు అనుకుంటూ, ఖర్మ అని తిట్టుకుంటూ ఒప్పుకున్నారు. అడవిలో తారసపడ్డ నాయకపోడులను ఎక్కడికి వెళ్తున్నారని అడిగేరు పోలీసులు. తుపాకుల గూడెంలో కోయల సౌభాగ్యం గురించి పూజలు చేయడానికి వెళ్తున్నామని చెప్పారు నాయకపోడులు. అయితే పెట్టెలో ఏమున్నాయి, బాంబులా? తుపాకులా.? అని అడిగారు పోలీసులు, కాదు దేవతల బొమ్మలు అని చెప్పారు నాయకపోడులు. 'పెట్టె మూత తీసి చూపించండి' అని అడిగారు పోలీసులు. 'తుపాకులగూడెంలో పూజ మొదలుపెట్టినప్పుడే పెట్టె మూత తీయాలి, ఇప్పుడు తీస్తే దేవతలకు కోపం వస్తుంది, చాలా అనర్ధం జరుగుతుంది' అని చెప్పారు నాయకపోడులు. అనుమానం తీరని పోలీసులు, నాయక పోడులను కొట్టారు. 'మీరు ఉండేది తుపాకులగూడెమే కదా, అక్కడకు వెళ్ళిన తరువాత మీ ఎదురుగుండానే పూజా సమయంలో చూపిస్తాము. మేము చెప్పినది అబద్ధం అయితే, అప్పుడు కొట్టండి' అని చెప్పి నాయకపోడులు ఎంత బ్రతిమిలాడినా, పోలీసులు వినలేదు. పోలీసులు వీరిని కొడుతూనే పెట్టె పగులకొట్టి చూశారు. దాంట్లో ఉన్నవి దేవుళ్ళ బొమ్మలే. 'సరే వెళ్ళిపొండి' అని చెప్పారు పోలీసులు. వాళ్ళ దృష్టిలో అవి బొమ్మలే, కాని నాయకపోడులకు, కోయలకు అవి దేవతలు ఆవహించిన బొమ్మలు. గిరిజనులకు మనస్తాపం కలిగింది. అన్నలకు మరో ఆయుధం దొరికింది.

గిరిజనప్రాంతంలో సంప్రదాయ గ్రామసభలు ..

ఉదా: గోండులు, రాయ్ సెంటర్లు లంబాడాల నసాబులో ఇలా హెచ్చరించుకుంటారు.

జాతి పోతి పాతి నీవా వెహవెల్ కామ్ నావా
జాతి అద్దె పోతి నియ్యత్ అద్దె పాతి
కర్మతూన్ పియ్తె దుఃఖ్ ధర్మ తూన్ పియె సుఖ్
-పెన్ భూప్యాల్ లింగో(గోండి భాషలో)

జాతి పురాణం ప్రసాదం
నీకు చెప్పే బాధ్యత నాది కాదు
జాతే పురాణం
నిజాయితే ప్రసాదం
కర్మానుసారంగ నడిచిన దు:ఖం
ధర్మానుసారంగ నడిచిన సుఖం
-పాహుండి కుప్పర్ లింగో (తెలుగులో)

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే

భాషోద్యమ కథానిక

దాసరి శివకుమారి
98660 67664

మన ఊరు-మన భాష

"ఏరా నాన్నా! చిన్ని కన్నా! ఇలా దగ్గర కురా!' అంటూ మనుమడి కొడుకును నోరారా పిలుస్తూ, చేతులు చాచారు వాడి కోసం. "చిన్ని తల్లీ! నువ్వూరా! బంగారం" అంటూ మరోసారి కూతుర్నీ పిలిచారు.


ఆ పిల్ల ఏం మాట్లాడ లేదు. 'నో. ఐ డోంట్ లైకిట్" అంటూ దూరంగా జరిగాడు నిఖిల్. వాడేమన్నదీ ఖచ్చితంగా అర్థం కాలేరు కాని తన దగ్గరకు రావటానికి నిఖిల్ ఇష్ట పడటం లేదని మాత్రం బామ్మగారికి అర్థమ యింది. వాళ్లను చూసిన సంతోషంతో ఇంట్లోని మిగతా వాళ్ళు ఎవరు దగ్గరికి తీసుకోబోయినా నిఖిల్, వాడి చెల్లెలూ ఇద్దరూ దూరదూరంగా పోయి తండ్రినొకల్లో, తల్లినొ కళ్ళొ చుట్టుకుపోయారు.

వాళ్ళ అమ్మవంక పరిశీలనగా చూశారు బామ్మగారు. విరబోసుకున్నజుట్టు, బిగుతుగా వున్న లెగ్గిన్స్, దానిపైన బొమ్మల బొమ్మల చొక్కా వేసుకుని వున్నది. "ఏంటే పిల్ల కట్టూ బొట్టూ ఇట్లా ఏడ్చాయి? ఏ లండన్‌లోనో పుట్టి పెరిగిన దొరసానినను కుందేమో? నిఖిల్ వాళ్ల నాన్న వంక చూస్తే పెద్ద పిచ్చుక గూడులాంటి దుబ్బు జుట్టూ, పెరిగిన గడ్డం, మెళ్లో కుంకుడు గింజల సైజులో వున్న నల్లని పూసల దండ వున్నది. వంటి మీద గుడ్డలు చూస్తే రెండు మోకాళ్ల మీద పెద్ద పెద్ద చిరుగులున్న జీన్‌పాంటూ, దానిమీద పొడలు పొడలుగా వెలిసి పోయిన షర్టూ కనపడుతున్నాయి. ఇదేమిటి? వీడిట్లా వున్నాడు? చేసే ఉద్యోగం కానీ పోయిందా ఏమిటి? చేతిలో డబ్బుల్లేక ఇలాంటి గుడ్డలేసుకు రాలేరు గదా?" అనుకున్నది బామ్మగారు.

"ఏమే ముసలీ! ఎలాగున్నావు? సెంచరీ కొడ్తావులే, మాకంటే నువ్వే ఆరో గ్యంగా వున్నావు". అంటూ నిఖిల్ వాళ్ల నాన్న బామ్మగారి దగ్గరకొచ్చి కూర్చున్నాడు.

"ఏమిట్రా ఈ అవతారం? బూచాడిలా వున్నావు. ఆ జుట్టేమిటి? ఏ పక్షైనా చూసిందంటే తనకు పనికి వచ్చే గూడే అను కుని అమాంతం నీ తలమీద గుడ్లు పేట్టేయ గలదు" అంటూ అతని తలలో వేళ్లు పెట్టి ప్రేమగా నిమరసాగింది. బామ్మగారి చేతి వేళ్లకు పొట్టుపొట్టుగా తగిలింది. బయటకు తీసి చూస్తే ఆమె చేతి వేళ్లనిండా తెల్లని పొట్టు అంటుకుని వున్నది.

"ఇదేమిట్రా ఇంత చుండ్రు? నీకు దుర దెలా పుట్టటం లేదు? రెండు రోజులు పోతే ఈళ్లో పేలూ చేరతాయి వెధవాయ్"



"మీ ఊరూ, మీ పొలాలూ బాగా నచ్చినట్లున్నాయి బామ్మగారూ. పిల్లలు ఒకటే మురిసిపోవటం అన్నది నిఖిల్ వాళ్ళమ్మ మీ ఊరూ, మీ పొలాలూ కాదమ్మా. మన ఊరూ, మన పొలాలు. మనందరి స్వంత ఊరు ఇదే. రేపునీ పిల్లలదీ ఇదే ఊరవుతుంది. సొంత ఊరుకు వస్తూ పోతూ వుండి. మన మనుషుల్నీ, మన సంప్రదాయాలను గుర్తుపెట్టుకోవాలమ్మా" అంటూ ఆమె తల మీద చెయ్యేసి నిమిరింది. "హాలిడేస్ వున్నప్పుడల్లా ఇవ్వన్నీ చూట్టానికి రావచ్చునా" అంటూ అడిగాడు నిఖిల్.

అంటూ తన చేతులు కడుక్కుని వచ్చింది.

అతను నవ్వుకుంటూ మునివేళ్లతో తన జుట్టును సరిచేసుకున్నాడు. అతని భార్యకు మాత్రం ఇదంతా ఏం నచ్చలేదు.

పిల్లల ముందు ప్లేట్లలో తినటానికి ఏం పెట్టినా "ఐ డోంట్ లైక్ దిస్" అంటూ, పక్కకు నెట్టేశారు. వాళ్ళమ్మనడిగి చాక్లెట్ బారూ బిస్కట్ పాకెట్ తీసుకుని పరపరలాడించ సాగారు. చెతొక సెల్‌ఫోన్ తీసుకుని గేమ్స్ ఆడుకోవటంలో మునిగిపోయారు. ఇంట్లో ఎవరితో మాట్లాడటానికి గానీ అటూ ఇటూ తిరగటానికి గానీ ఇష్ట పడకుండా మంచం మీద బోర్లా పడుకుని ఫాన్ వంకే తదేక దృష్టి పెట్టారు.

"ఒరేయ్ వెధవాయ్! ఇలారా! నా దగ్గరగా కూర్చో" అన్నారు బామ్మగారు. నిఖిల్ వాళ్ళ నాన్నను పేరుపెట్టి పిలవరు. ఎందుకంటే ఆమె భర్త పేరే అతనికి పెట్టారు. "వెధవాయ్! అంటూ పిలిచినా మా తాతగారిని తిట్టినట్లేగా బామ్మా!" అంటూ మనుమడు ఆట పట్టించినా నవ్వేసి ఊరుకుంటారు.

దగ్గరగా వచ్చి కూర్చున్న మనుమడితో "ఒరేయ్ నాన్నా! నీ పిల్లలకు ముందు నాలుగు తెలుగు ముక్కలు నేర్పించండి. అంతకంటే మీరు పక్కా తెలుగు వాళ్ల లాగా వుండండి. తెలుగులో మాట్లాడండి. వాళ్లకు కాస్త తెలుగు కథలూ, కాకరకాయిలూ చెప్పండి. అట్లా చెప్తూ వుంటే అస్తమానం ఆ ఫోన్‌లో తల దూర్చకుండా వుంటారు. వాళ్ళ వాలకం చూస్తుంటే కంటి చూపు తగ్గి ఇప్పుడే కళ్లజోళ్లు వచ్చేటట్లు వున్నది. మా రోజుల్లోనూ, మీ తాతగారూ ఆఖరుకు మీ నాన్న వాళ్లకు నేర్పిన రామాయణ, భారత, భాగవత కథల్లో ఎన్నెన్ని మంచి విషయాలుండేవి? అంతెందుకురా, రాజుగారి కొడుకుల్ని ప్రయోజకుల్ని చేయటానికి విష్ణు శర్మ అనే పండితుడు ఎన్నెన్ని మంచి కథలు చెప్పాడు! జంతువులతోనే గొప్పగొప్ప నీతుల్ని బోధించాడురా. అవన్నీ నీకు నీ చిన్నప్పుడు చెప్పాంరా. నీ పిల్లలకూ వాటిని చెప్పండి".

"ఆ పంచతంత్ర కథలు ఇప్పుడూ వున్నాయి బామ్మగారూ. ఈ ఫానుల్లో, టాబ్‌లలో వాటిని చదువుతారు. కాకపోతే పోకీమాన్ లాంటివి చూడటానికి పిల్లలు ఎక్కువిష్టపడుతున్నారు" అన్నది నిఖిల్ వాళ్లమ్మ.

"వాళ్లకి వాళ్లు మన తెలుగు కథల్ని ఇంగ్లీషులో చదువుకుంటుంటే ఏమీ మనసుకెక్కదమ్మాయ్. మనం కమ్మని తెలుగులో మన అమ్మ భాషలు ఆసక్తిగా చెప్తుంటే శ్రద్ధపెట్టి కథ వింటారు. కథ చెప్పే వాళ్ళ వంక చూస్తూ రకరకాల ప్రశ్నలు వేస్తూ నాలుగు విషయాలూ తెలుసుకుంటారు. దాంతోపాటు తెలుగు భాషా వస్తుంది. భాషపట్ల ప్రేమా పెరుగుతుంది. తెలుగు ఒంటబట్టించుకున్నాకే ఇంగ్లీషైనా, హిందీ అయినా, నేను అన్ని పుస్తకాలూ చదువుతాను. దేముడిదయ వలన చిన్నప్పుడే ఆ కళ ఒంట బట్టించుకున్నాను. నాకిప్పటికీ చూపుబాగానే వుంది. చూడమ్మాయ్ మీరంతా ఇప్పుడు గొప్పగా చెప్పుకునే అబ్దుల్ కలామ్ కూడా తల్లి దగ్గర కథలు వింటూనే ఆలోచించటం నేర్చుకున్నాడు. గొప్ప మేధావీ అయ్యాడు" అంటూ సుదీర్ఘంగా వివరణ ఇచ్చింది బామ్మగారు. మధ్యాహ్న భోజనాలవ్వగానే పెద్దవాళ్ళంతా కాస్త నడుం వాల్చారు. కాని నిఖిల్ వాళ్ల చెల్లీ అలాగే కూర్చుని టాబ్ ఒకటి ముందు పెట్టుకుని "కేసింగ్ మోటో 3డి' అనే దానిని తదేక దీక్షతో చూడసాగారు. నిఖిల్ వాళ్ల నాన్నక్కూడా నిద్రపట్టలా, లేచి హాల్లోకి వచ్చాడు. అప్పటికే బామ్మగారు ఒక కునుకు తీసి లేచి కూర్చున్నారు. ఒక కుర్చీ బామ్మగారి మంచం దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

"ఒరేయ్ నాన్నా! మన దక్షిణప్పొలంలో వరిపైరు పొట్ట మీదుంది. మొక్కలు చేనంతా పరుచుకుని చూట్టానికి నిండుగా వుంటుంది. ఉత్తరప్పొలాన చేపల చెఱువులున్నాయి. మొన్నే చెఱువుల నిండా నీళ్లు పెట్టారు. నీళ్లను చూస్తే పిల్లలు సరదా పడతారు. పడమటి పొలాన తోటలున్నాయి. నువ్వు చిన్నప్పుడెప్పుడో పొలానికెళ్ళేవాడివి. ఇప్పుడు నీ పెళ్ళాం పిల్లల్ని తీసుకెళ్ళి చూపించు. ఎప్పుడూ సినిమాలూ, టీ.వీ.లూ కాదురా. కాస్త మన ఊళ్ళో, ఊళ్ళోని మనుషులూ, పొలాలూ, పుట్రా మీద కూడా ధ్యాస పెట్టండి. నీకేమన చుట్టాలూ, ఊళ్ళూ సరిగా తెలియటం లేదు. తెలియకుండా పోతే ఎలాగరా! నీదే వూరంటే రేవునీ పిల్లలు చెన్నపట్నమనే చెప్పేటట్లున్నారు. తాత తండ్రుల ఊరుపేరు చెప్పుకోవాలిరా. బతుకు తెరువు కోసం ఎక్కడెక్కడ వుండాల్సి వచ్చినా మన ఊరిని మర్చి పో కూడదురా". అంటూ మరో వివరణ ఇచ్చింది బామ్మ.

అక్కడకు వచ్చిన నిఖిల్ వాళ్ళమ్మకు ఇదంతా సోదిలాగ అనిపించింది. నిఖిల్ వాళ్ళ నాన్న మాత్రం అలాగేనే బామ్మ, వీళ్ళను పొలానికి తీసుకెళ్తాను అంటూ పెళ్లాం పిల్లల్ని బయలుదేరతీశాడు.

వీళ్లకంతా చూపించటానికి పాలేరు నొకణ్ణి తోడుగా పంపింది బామ్మ.

ముందుగా వరిపొలానికెళ్ళారు. బామ్మ చెప్పినట్లు పొలాలన్నీ పచ్చగా, ఏపుగా పెరిగి కళకళలాడుతున్నాయి. వాటిని చూసిన పిల్లల కళ్లలో ఆశ్చర్యం, ఆనందం కనపడుతున్నది.

"వావ్ ఎంత గ్రీనిష్‌నెస్, చూట్టానికి చాలా బ్యూటిఫుల్‌గా వుంది" అని ముచ్చట పడుతూ చేను గట్టు మధ్యకెళ్లి నిలబడ్డారు. నిజంగా పొట్ట మీదున్న వరి మొక్కలు బాగా దుబ్బు కట్టి నిండుగా, కనుచూపు మేరంతా పచ్చదనాన్ని పరుచుకుని కంటికి ఆహ్లాదంగా వున్నది. "రియల్ గ్రీనిష్‌నెస్" అని మరీ మరీ అనుకుంటూ తనివి తీరా పొలాన్ని చూస్తూ, ఫోటోలు తీసుకుని మరీ ఇవతలికొచ్చారు. ఆ తర్వాత చేపల చెఱువు దగ్గరకెళ్ళారు. చెఱువు నిండా నీళ్ళున్నాయి. ఆ నీళ్లలో వుండుండి ఒక్కో చేప పైకి ఎగురుతూ మరలా లోపలికి పోయింది. "ఒక్క ఫిష్షన్నా దొరికితే బాగుండుననుకున్నారు పిల్లలు. వాళ్ల ఉద్దేశ్యాన్ని పసికట్టినట్లుగా పాలేరు తన తల గుడ్డ విప్పి చెఱ్లో పరిచి, ఒడుపుగా రెండు చిన్న చేపల్ని పట్టి ఒడ్డునేశాడు. అవి ఒడ్డున గంతులేస్తుంటే దానికంటే ఎక్కువగా పిల్లలు గంతులేశారు. అక్కడా ఫోటోలు తీసుకున్నారు. పాలేరునూ ఫొటో కోసం సరిగా నుంచోమన్నారు. "రియల్ వాటర్ టాంక్, రియిల్ ఫిషెస్" అంటూ పిల్లలు ఎంతో సంబర పడిపోయారు.

"పిల్లలకు నడక అలవాటు లేక కాళ్ళు నొప్పుంటారేమోనయ్యా" అన్నాడు పాలేరు.

"లేదు. లేదు. ఇంకా కొంచెం టైమ్ ఇక్కడే వుంటామన్నారు..." సరేనని పడమటి పొలం వైపుకెళ్లారు. పాలేరు గబగబా కూరగా

యలు తెంపాడు. పిల్లలూ చిన్న కాయల్ని తెంపాలని చూశారు. కాయితోపాటు చిన్న మొక్కా పెకలివచ్చింది. “ఇట్స్ బాడ్” అనుకుంటూ మొక్కల్ని వదిలిపెట్టి ఇవతల కొచ్చేశారు. నిఖిల్ వాళ్లనాన్న చెట్టునే పండిన సపోటాలు కోశాడు. కర్చీఫ్‌తో వాటిని తుడిచి వలిచి ఇస్తే అందరూ తిన్నారు. “రియల్ స్వీట్‌నెస్” ఇంకా కావాలన్నారు. చీకటి పడుతున్నది. ఇంటికెళ్దామని బయలుదేరారు. పిల్లలకంటె నిఖిల్ అమ్మా, నాన్నలకే, కాళ్ళు నొప్పులనిపించాయి. పిల్లలు మాత్రం తిరిగి వెనక్కు చూసుకుంటూ ఇంటిదారి పట్టారు. దారి పొడుగునా అన్నా చెల్లెలు ఒకరితో ఒకరు పోటీపడి తాము చూసినవన్నీ మాట్లాడుకుంటూ వచ్చారు. మాటల్లో ఇల్లు వచ్చింది.

తాము కోసుకొచ్చిన కూరగాయలూ, పళ్ళూ అక్కడున్న అరుగు మీద వుంచారు. అరటి చెట్ల మధ్యనున్న నాపరాతి బండమీద నుంచుని కాళ్ళూ చేతులూ, ముఖం కడుక్కుంటుంది ఏ.సీ.లోకన్నా చల్లగా, హాయిగా వుందనిపించింది వాళ్ళకు. లోపలికి వస్తూనే డాడీ! రేపు కూడా ఇక్కడే వుండి ఇంకేమైనా చూద్దాం అన్నారు పిల్లలు.

“పొలాలూ తోటలూ అన్నీ వచ్చాయంటరా!” అనడిగారు బామ్మగారు.

“మీ ఊరూ, మీ పొలాలూ బాగా నచ్చినట్లున్నాయి బామ్మగారూ. పిల్లలు ఒకటే మురిసిపోవటం అన్నది నిఖిల్ వాళ్ళమ్మ మీ ఊరూ, మీ పొలాలూ కాదమ్మా. మన ఊరూ, మన పొలాలు మనందరి స్వంత ఊరు ఇదే. రేపునీ పిల్లలదీ ఇదే ఊరవుతుంది. సొంత ఊరుకు వస్తూ పోతూ వుండి మన మనుషుల్నీ, మన సంప్రదాయాలను గుర్తుపెట్టుకోవాలమ్మా” అంటూ ఆమె తలమీద చెయ్యేసి నిమిరింది. “హాలిడేస్ వున్నప్పుడల్లా ఇవ్వన్నీ చూట్టానికి రావచ్చునా” అంటూ అడిగాడు నిఖిల్.

“నేనా వస్తాను” అంది వాళ్ళ చెల్లి.

“మీ అమ్మ. నేను కూడా ఇక నుండీ పండగలకూ, వాటికీ ఇక్కడికే వస్తాం. అంతే కాదురా. మీరు ఈ పెద్దబామ్మ దగ్గర కూర్చుంటే బోలెడు బోలెడన్ని తెలుగు కథలు బ్రహ్మాండంగా చెప్తుంది”. అన్నాడు వాళ్లనాన్న.

“శుభ్రంగా బోలెడు తెలుగు కథలు చెప్తాను. తెలుగులో ఇన్ని మంచి కథలు న్నాయా అని మీరే ఆశ్చర్యపోతారు. ఇంకా కొన్ని కథలు చెప్పు బామ్మా అంటారు. మన పొలాలు మీకెంత నచ్చాయో మన తెలుగు కథలు కూడా అంత నచ్చుతాయి. అంత కమ్మగా వుంటాయి. అసలు తెలుగే కమ్మగా వుంటుందిరా పిల్లలూ” అన్నది బామ్మ.

“నిజంగానా? అయితే వింటాం. తెలుగు కథలు వింటాం. తెలుగూ నేర్చేసుకుంటాం. సరేనా బామ్మా”

“ప్రతిసారీ శెలవులవ్వగానే వచ్చేయండి. నాతోపాటు ఇంట్లో వాళ్ళంతా మీ కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తారురా నాన్నా” అంది బామ్మగారూ. “ఇంకో మాటరా. తెలుగును గురించి చెప్పగానే తెలుగు కథలు వినటానికి ఇష్టపడ్డారు. మీరు నిజంగా చాలా మంచి వాళ్లురా” అంటూ మెచ్చుకున్నది.

శ్రీకాకుళం (జిల్లాకేంద్రం) సవర పలుకుల పండుగ




విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న సంఘ కార్యదర్శి డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు

2019 జనవరి 22వ తేదీ మంగళవారం గిడుగు రామమూర్తి గారి 79 వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పాఠశాల నిర్వాహకుల సౌజన్యంతో సవరభాషా సంఘం 'సవర పలుకుల పండుగ' జరుపుకుంది. ఈ సందర్భంగా సవర కథలు, సవర పాటల రచనల్లో పోటీ నిర్వహించారు. విద్యార్థులు సవరభాషలో రచనలతోపాటు వాటి తెలుగు అనువాదం కూడా అందించారు. 16 మంది కథలు రాయగా ఇద్దరు పాటలు రాశారు. విద్యార్థులు తాము రాసిన కవితలను పాడి వినిపించారు.

సాయంత్రం 3 గంటలకు సవరభాషా సంఘ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సవరభాషా సంఘ అధ్యక్షులు కణుగుల వెంకటరావుగారు అధ్యక్షత వహించారు. సంఘ కార్యదర్శి అల్లంసెట్టి చంద్రశేఖర రావు గారు సంఘ కార్యక్రమాల గురించి వివరించారు. శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సవర భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దానికి కావలసిన విద్యావిషయిక సహాయం అందించ గలమని తెలిపారు. సవర విద్యార్థులు చక్కని తెలుగు నుడికారంతో తప్పులు లేకుండా తెలుగులో రాసినందుకు వారిని అభినందించారు. ముఖ్య అతిథి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుగారు సవరభాషలో రాయడం చదవడం నేర్చుకోవాలని విద్యార్థులకు సలహాయిచ్చారు. సవర సంస్కృతిని నిలబెట్టుకోవాలని కోరారు. తమ పాఠశాల సవర సాంస్కృతిక కేంద్రం కాగలదని హామీ ఇచ్చారు. కొందరు విద్యార్థులు గిడుగు రామమూర్తిగారు సవరభాషలో రచించిన 'చెట్లు నరకొద్దు' అన్న పాట పాడారు. సవర పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు. తరువాత రచయితలకు బహుమతులనందించారు. విజేతలతోపాటు రచయిత లందరికీ నగదు బహూకరించారు. సహోపాధ్యాయులు వరప్రసాద్‌గారు బాధ్యతలు నిర్వహించారు.

మధురాంతకం నరేంద్ర
9866243659

వ్యంగ్య రచనా విశారదుడికి వీడ్కోలు



కవనశర్మగారిని తలచుకుంటే ముందుగా గుర్తుకొచ్చేవి బ్రెయిన్ డ్రెయిన్, వడ్డించే మన వాళ్ల కథలు. ఆ కథలు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా వస్తున్నప్పుడు నేను పదమూడేళ్ళ కుర్రాడిని. ఆ వయస్సులో నాకా కథలు అర్థం కాలేదు. రచన 'సాయి'గారు వాహినీ బుక్ ట్రస్టు తరపున కవనశర్మగారి 'వ్యంగ్య కవనాలు' ప్రచురించింది 1994లో. అప్పుడు నా వయస్సు ముప్పయ్యైదేళ్ళు. విశ్వ విద్యాలయంలో అప్పటికి నేను గూడా అధ్యాపకుడనే హోదాను సంపాదించుకుని, యూనివర్సిటీల నియమాలకనుగుణంగా పీహెచ్డీ చేసి, డిగ్రీలు తిరిగిన పండితుణ్ణయి పోయి (మన్నించాలి, కవనశర్మగారి భాష వొంటికి పట్టేసినట్టుంది) విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలెంతగా మాగి పండయిపోయాయో తెలుసుకునేశాను. దాంతో కవనశర్మగారి వ్యంగ్య కవనాలు అప్పుడు మాత్రం నా శక్తి మేరకు అర్థం చేసుకున్నానని అనుకుంటున్నాను.

తెలుగు సాహిత్యంలో హాస్యమూ, వ్యంగ్యమూ బాగా తక్కువని కవనశర్మగారే చాలాసార్లు పిర్యాదు చేశారు. ఆయనకు యింగ్లీషులో యే రచయితలంటే యిష్టమో తెలియదుగానీ, తెలుగులో మాత్రం ముళ్ళపూడి వెంకటరమణగారంటే చాలా యిష్టం. హాస్యంలో స్వచ్ఛమైన హాస్యమనీ, వ్యంగ్య హాస్యమనీ రెండు రకాలుంటాయి. 'బుడుగు' చేష్టలు స్వచ్ఛమైన హాస్యానికి ఉదాహరణ అయితే రాజకీయ బేతాళ పంచవింశతి' వ్యంగ్య హాస్యానికి వుదాహరణ. కవనశర్మగారు రెండో రకపు హాస్యంలో అందెవేసిన కలం. అయితే కవనశర్మగారు తెలుగువాళ్ళు హాస్య ప్రియులు కారనీ అనడంలో మాత్రం అంత నిజం లేదనిపిస్తుంది. తెలుగువాళ్ళ ఆధునిక సాహిత్యం "కన్యాశుల్కం" "బారిష్టరు పార్వతీశం", "గణపతి" వంటి రచనలతోనే మొగ్గలు తొడగనారంభించింది. అయితే ముళ్ళపూడి, కవనశర్మ, యర్రంశెట్టిశాయి వంటి రచయితలు మాత్రం యిటీవలికాలంలో చాలా తక్కువ. వ్యంగ్య రచనలతో మనల్నో వూపు వూపి పారేసిన కెయన్‌వై పతంజలిగారిక్కూడా మనం వెయ్యాల్సినంత పెద్ద పీట వేసినట్టు లేము.

ఆంధ్రపత్రికలో ఆయన వ్యంగ్య కవనాలు వచ్చిన తర్వాత వో ఆంధ్రజ్యోతి దీపావళి సంచికలో ఆయన నవలిక "బంగారు రోజులు" వచ్చింది. ఆ రచనతో బాటూ ప్రచురించిన కవనశర్మగారి అందమైన ఫోటో యిప్పటికీ స్పష్టంగా గుర్తుంది. దాంతో బాటూ ప్రచురించిన కవనశర్మగారి స్వీయ పరిచయంలో; చివరన "కడుపు చించుకుంటే కాళ్ళపైన పడుతుంది. నవల రాస్తే ఆంధ్రజ్యోతిలో పండుతుంది" అన్న మాటలు యెప్పటికీ గుర్తుకొస్తూనే ఉంటాయి" తరువాతెప్పుడో వో ఆంధ్రప్రభ కథలపోటీలో ఆయన కథ "చిన్న చిన్న ప్రయాణీకులుంటారు జాగ్రత్త!" అనే కథ వచ్చినట్టు జ్ఞాపకం.

వ్యంగ్య రచయితల రచనల్ని చదివేటప్పుడు జాగ్రత్తగా వుండాలని విమర్శకులు చెప్తారు. వాళ్ళెప్పుడు కేవలం స్వచ్ఛమైన హాస్యాన్ని చేపడతారో, యెప్పుడు వ్యంగ్యంగా రాస్తారో చెప్పడం చాలా కష్టం. కేవలం హాస్యమని. అలసత్వంలో వున్నప్పుడు వ్యంగ్యాన్ని వుపయోగించవచ్చు. అలాగే తీవ్రమైన వ్యంగ్యానికి మధ్యలో హాస్యాన్నీ వాడుకుంటారు. అందుకే మార్క్‌ట్వయిన్ వంటి గొప్ప వ్యంగ్య రచయితను పాఠకులు చాలా కాలంపాటూ కేవలం హాస్యగాడుగా పొరబడ్డారు. వ్యంగ్య రచయితలందరూ నిజానికి గొప్ప సంఘ సంస్కర్తలు గూడా. తాము కోరుకునే గొప్ప సామాజిక వాతావరణం లేనప్పుడూ, తాము ఆశించినంత మంచి మనుషులు కనబడనప్పుడు వాళ్ళూ నిరాశ పడిపోతారు. తమ నిరాశను యధాతథంగా వ్యక్త పరిస్తే, ఆ విమర్శను పాఠకులు భరించలేక, ఆ రచనలను వాళ్ళు నిరాకరించే ప్రమాదముంది. ఆ ప్రమాదాన్నుంచీ బయటపడడానికి ఆ రచయితలకు దొరికే మార్గం వ్యంగ్య మొక్కటే! కవనశర్మగారూ, ఆయన వ్యంగ్యం కవనాలూ ఆ కోవకే చెందుతాయి.

వ్యంగ్య కవనాలలో చాలా కథలు కాశీమజిలీ కథలకి పేరడీల్లా సాగుతాయి. మణిసిద్ధుడు కవనశర్మగారి చేతుల్లో మణి అనే కూతురున్న సిద్దయ్య అనే మోతుబరి రైతుగా మారిపోతాడు. గోప కుమారుడు గోపన్న వురఫ్ గోపాల్రావ్ అనే అల్లుడుగా

తయారవుతాడు. కూతుర్నిచ్చి పెళ్ళిచేసి గోపాల్రావును అమెరికాకు పంపాలనుకునే సిద్ధయ్యను అల్లుడెలా భారతదేశపు విశ్వవిద్యాలయాలకు తీసుకెళ్ళాడో అక్కడ అల్లుడి అనుభవాల ద్వారా అతనికర్థమైన పరిస్థితులేమిటో "వ్యంగ్యం కవనాలు" ఆధునిక కాశీమజిలీ కథల్లా సాగుతాయి.

14,15 శతాబ్దాల్లో స్పెయిన్‌తోబాటూ యూరపులోనంతా బాగా ప్రాచుర్యంలో వుండే 'రొమాన్సు' లను యెగతాళి చేస్తూ సెర్వాండెస్ అనే గొప్ప రచయిత "డాన్ క్విక్సాట్" అనే ప్రసిద్ధమైన వచన రచన చేశాడు. ఆధునిక నవలలకు అదే మూలమని విమర్శకులు గుర్తిస్తారు. సెర్వాంటిస్‌కు సమకాలీన సమాజంలో వుండే రుగ్మతలపైనెంత విముఖత వుందో, రొమాన్సుల లక్షణాలను గురించి అంత గాఢమైన అవగాహన కూడా వుంది. కవనశర్మగారికి కూడా సమకాలీన వ్యవస్థలో వున్న లోపలవైన అసహిష్ణుతతోబాటూ తెలుగు సంప్రదాయ సాహిత్యంపైన అంతే మక్కువా, గౌరవమూ వున్నాయి. 'వ్యంగ్య కవనాలు' లో వుండే వివిధ కవనాలన్నీ తెలుగువారివే అయిన సంప్రదాయ సాహిత్యపు శిల్పాన్నే అనుసరిస్తాయి.

శాస్త్రజ్ఞుల కవనాలలో సమయానికి స్కాలర్‌షిప్పులు రాక యిబ్బందులు పడే పరిశోధన విద్యార్థులూ, విద్యార్థుల పరిశోధనలను దౌర్జన్యంగా దోచుకునే పరిశోధనా పర్యవేక్షకులూ, కేవలం సంఖ్యకోసం మాత్రం రాసే పరిశోధనా వ్యాసాలూ, "యింట్యూషన్" మేరకు పరిశోధనల్లేకుండానే నిర్ణయాలకొచ్చే పరిశోధకులూ, యెన్నిసార్లు తిరిగొచ్చినా పట్టు వదలక మళ్ళీ సిద్ధాంత గ్రంథాల్ని వండే పరిశోధక విద్యార్థులూ - యిలా విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో జరిగే అనేకానేక సిద్ధాంత రాద్ధాంతాలనంతా కవనశర్మగారు వ్యంగ్యం విలసితంగా పరిచయం చేస్తారు. చాలా "సీరియస్"గా యీ కథల్ని చెప్పే కథకుడు తొడుక్కునే వ్యంగ్య హాస్య తొడుగు (మాస్క్) కింద యీ దురన్యాయాలను సహించలేక విలవిలలాడే గొప్ప మానవుడున్నాడని మనం గ్రహించాలి. యిలాగే సదస్సుల పేరుతో జరిగే తిరనాళ్ళలో జరిగే గోల, మనవాళ్లకు మాత్రం వుద్యోగాల్ని వడ్డించే పక్షపాతాలూ, ప్రవేశ పరీక్షల దగ్గరి నుంచీ పట్టా పుచ్చుకునే వరకూ జరిగే విద్యా వ్యాపారాలూ, కవనశర్మగారి వ్యంగ్యానికి శలభాలైనాయి (!) యిల్లనే మౌలిక సమాజంలో జరిగే తుఫానులూ, సమాజంలో సన్మానాల్ని దోచుకునే ఘరానా వ్యక్తులూ, క్రమంగా యాంత్రికమూ, దిగజారుడు తనమూ తమ లక్షణాలుగా రూపు దిద్దుకుంటున్నాయి. చలన చిత్ర రంగమూ, కవనశర్మగారి వాడి బాణాల్ని తప్పించుకోలేక పోయాయి.

'2005లో 'కథా వార్షిక' సంపాదకుడిగా కవనశర్మగారి అద్భుతమైన కథ 'స్పృహ' ను ప్రచురించే అవకాశం దొరికింది నాకు. వో చిన్న పిల్లాడి దృష్టికోణం నుంచీ యీ కథలో కవనశర్మగారు సమకాలీన భారతీయ సమాజాన్ని యిరుకు గదులుగా మారుస్తున్న కులమనే అడ్డు గోడల్ని అలవోకగా పరిచయం చేస్తారు. ఆ కథలోని కుర్రాడి పేరు గూడా శర్మే! బహుశా అది ఆత్మకథాత్మకమై వుంటుంది. ఆ కుర్రాడిలో టామ్‌సాయిర్, హకిల్ బెరీఫిన్ యిద్దరూ కనబడతారు.

ప్రాథమిక పాఠశాలకెళ్ళే శర్మ అనే అయిదేళ్ళ కుర్రాడికి గోదావరి, గౌతమి, రాఘవమ్మ, సుగుణ, సారథి, ఆలీ, ఆశీర్వాదం అనే స్నేహితులుంటారు. స్త్రీ పురుషుల మధ్య వుండే తేడా గూడా తెలుసుకోలేని ఆ చిన్న పిల్లాడు క్రమంగా కులాల మధ్య వుండే అడ్డుగోడలెంత బలంగా వున్నాయో గ్రహిస్తాడు. పిల్లల్లో సహజంగా వుండే కుల లక్షణాలు వాళ్ల స్నేహాలకెంత యిబ్బందిని కలిగిస్తాయో తెలుసుకుని విస్తుపోతాడు. యేమీ తెలియని రోజుల్లో వొకరి తాయిలాన్ని మరొకరు హాయిగా పంచుకునే పిల్లల్ని, తల్లిదండ్రులెలా మార్చి పారేస్తారో అనుభవం ద్వారా తెలుసుకుంటాడు. మొదట్లో ఆశీర్వాదం అనే దళిత కుర్రాడు శర్మ యింట్లో చేసిన అరిసెల్ని యిష్టంగా తింటాడు. కానీ శర్మ తల్లి ఆశీర్వాదం యింట్లో వండిన అరిసెల్ని తాకద్దని కొడుకును మందలిస్తుంది. కానీ శర్మ తల్లి మాటల్ని పట్టించుకోకుండా ఆశీర్వాదం వాళ్ళమ్మ యిచ్చిన అరిసెల్ని చేతికి తీసుకుంటాడు. అయితే ఆశీర్వాదం వాళ్లయింటి వాతావరణమూ, అక్కడున్న తోళ్ళ నుంచే వాసనా, అతడ్ని ఆ అరిసెల్ని తిననివ్వవు. "నా రక్తంలోనే నేను వాటిని తినకుండా ఆపే గుణం వుంది" అనుకుంటాడు శర్మ పశ్చాత్తాప ధోరణిలో. అందుకే దారిలో ఆ

బడిలో–గుడిలో–ఏలుబడిలో తెలుగుకు సాధికారత కావాలి

అరిసెల్ని కుక్కముందు పడేస్తాడు. ఆ విషయం తెలుసుకున్న ఆశీర్వాదం ముందు "నాకు సహించలేదురా!" అని సిగ్గు పడి పోతాడు. "సహించక పోతే మా చెల్లెలికిచ్చేసెయ్యాల్సింది. అదయినా తినేది!" అంటాడు ఆశీర్వాదం. ఆశీర్వాదానికి శర్మ తమ అరిసెను పారేశాడని కోపమూ, పౌరుషమూ రాలేదు. ఆ అరిసెలు చాలా కష్టపడి సంపాదించాక వాళ్ళమ్మ వండగలిగింది. అది వాడికి అరుదైన వంటకం. "అందుకే. దానికి యెంగిలనే తేడా కూడా వాడికి తెలియదు" అనుకుంటాడు శర్మ బాధగా.

"శర్మ" అనే కుర్రాడిలో కవనశర్మగారి గుణం గూడా స్పష్టంగా కనబడుతుంది. సమాజపు రుగ్మతలకున్న మూలాలను అన్వేషించడమే ఆయనకిష్టం. అయితేఅవసరమైనప్పుడు తనలోకి గూడా తాను తొంగి చూడడమూ, మిగిలిన ప్రపంచంలో వున్న లోపాలు తనలో గూడా వుండే వుంటాయన్న విషయాన్ని గ్రహించగల్గడమూ, తెలుసుకున్న సత్యాల్ని నిజాయితీతో ప్రకటించడమూ గొప్ప వ్యంగ్య రచయితలు మాత్రమే చేయగలుగుతారు. యీ గొప్ప గుణం వుండడం వల్లనే మార్క్‌ట్వయిన్, అడిసన్, గోల్డింగ్, రవీంద్రనాధ టాగూరు వంటి మహా రచయితల వ్యంగ్య రచనలు పాఠకులకు కూడా ఆత్మీయమైనాయి. కవనశర్మగారి రచనలన్నీ గూడా యీ కోవలోకే వస్తాయి.

1997లో శ్రీకాకుళంలో జరిగిన 'కథా నిలయం' ప్రారంభోత్సవానికి వెళుతూ వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారితో కలసి వెళ్ళినప్పుడు, తిరుగు ప్రయాణంలో విశాఖలో ఆగి కవనశర్మగారి యింట్లో ఆతిధ్యం తీసుకున్నాము. అప్పుడే ఆయనను తొలిసారిగా వ్యక్తిగతంగా కలిసినట్టు జ్ఞాపకం. విశాఖ బస్టాండుకు దగ్గరిలో కందులవారి యిల్లని పేరు పెట్టుకున్న ఆధునిక ఫ్లాట్ల సముదాయంలో ఆయనకు రెండు మూడు ఫ్లాట్లు కలిపిన పెద్ద యిల్లుండేది. తనకు పెద్దల నుంచీ వారసత్వంగా వచ్చిన యింటిని డెవలపర్స్‌కిచ్చి, అక్కడ కట్టిన ఫ్లాట్లలో తనకు రావలసినన్ని ఫ్లాట్లు తీసుకున్నానని ఆయన చెప్పారు. అందుకే ఆ యింటికి తన కుటుంబపు పేరు పెట్టినట్టు చెప్పారు. అప్పటికి దాదాపు అరవై సంవత్సరాల వయస్సున్న కవనశర్మగారు "బంగారు రోజులు" ఫోటోలో వున్నంత యవ్వనంలోనే వున్నట్టు కనిపించారు. నెరసిన వెంట్రుకలు తప్ప. రెండు మూడేళ్ళక్రితం కథా నిలయం పాతిక సంవత్సరాల వుత్సవానికెళ్ళినప్పుడు అదే ఆయన్ని నేను ఆఖరుగా చూస్తున్నాననుకో లేదు. అదే చమత్కారం. అదే జీవితానందం. కుదురుగా దువ్వుకోకపోయినా, చెల్లా చెదురైనా అందంగానే వున్నా వెండి వెంట్రుకల జుట్టు. పెద్దగా పట్టించుకోకుండా దొరికిన బట్టల్ని తొడుక్కున్నట్టుగా కనిపిస్తారు. లంక పొగాకు చుట్టను వయ్యారంగా కాలుస్తూ కనిపించారారోజు రాత్రి. 'అంత పరవశమేమిటని' అడిగితే విశాఖవైపు కొచ్చినప్పుడల్లా వొకటో రెండో వాటిని తాగకపోతే తనకు లోటేనని అన్నారు. మరింతగా రెట్టిస్తే రుచి చూడమని నాకూ వొకటిచ్చారు. అప్పుడే అన్నాను – " మీ వ్యంగ్య కవనాలు కేవలం హోమియో డోస్‌లో వుంటాయి. యీనాటి పరిస్థితులకు వెటర్నరీ డోసు కూడా సరిపోదు. మళ్ళీ వోసారి వోపట్టు పట్టండి" అని. ఆయన అదోలా నవ్వేశారు. ఆనవ్వులో సమకాలీన వ్యవస్థపట్ల కోపంతోబాటూ నిరసన గూడా కనిపించింది. అందుకే ఆయన ఆ పని చేయకుండానే వెళ్ళిపోయారు. ప్రపంచాన్నీ జీవితాన్ని యెక్కువగా ప్రేమించిన వాళ్ళకే దానిపట్ల అంత నిరసన గూడా వుంటుంది.

కవనశర్మగారి వ్యంగ్య రచనలు లేకుంటే తెలుగు కల్పనా సాహిత్యానికి యేర్పడి వుండే లోటు చాలా పెద్దది.

ప్రతిస్పందన

అమ్మనుడి జనవరి సంచికలో వెలువడిన చెంఘిజ్‌ఖాన్ నవలను గురించి శ్రీకాకుళం నుంచీ కనుగుల వేంకటరావుగారి స్పందనకు కృతజ్ఞతలు. విశాలాంధ్ర వారు ప్రచురించిన 'చెంఘిజ్ ఖాన్' కు రాసిన ముందు మాటలో తెన్నేటి సూరిగారు యీ నవల ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో సీరియల్‌గా వెలువడిందని స్పష్టంగా రాశారు.

వేంకటరావుగారు చెప్పినట్టుగా "రెండు మహా నగరాలు" (ది చార్లెస్ డికెన్స్ నవల) గొప్ప ప్రాచుర్యమున్న నవల. దానికి తెన్నేటి సూరిగారి అనువాదమూ గొప్పగా వుంది. చరిత్ర పాఠాల ద్వారా చెంఘిజ్ ఖాన్ గొప్ప క్రూరుడనే అభిప్రాయం స్థిరపడి పోవడం వల్ల ఆనవల పట్ల ఆశక్తి కలగలేదని ఆయన అనడంలో కూడా కొంత సత్యముంది. "రెండు మహానగరాలు" కు ఆంగ్లమూలమై "ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్" వుపవాచకంగా వుండడం వల్ల అది దాని ఆంధ్రానువాదం గూడా పాఠకాభిమానాన్ని చూరగొందని ఆయన అనడం కూడా నిజమే! వొక పుస్తకం పైన పాఠకులకు యేర్పడే అభిప్రాయానికి పక్షపాతమైన విద్య యెంతగా కారణ మవుతుందో యీ రెండు విషయాలనూ గమనించితే అర్థమవుతుంది. మొదటిది : ఛెంఘిజ్ ఖాన్ మహానుభావుడా, దుర్మార్గుడా? అన్నది చరిత్రకారులే తేలని వివాదాంశం. అతడ్ని దుర్మార్గుడన్న వాళ్ళంతా పాశ్చాత్యులే! రెండవది : ప్రచారంలోకి వచ్చిన నవలే గొప్పదని అందరూ ముందుగానే నమ్ముతారు. అయితే యిటువంటి రంగు తెరల మాటున వున్న సత్యాన్ని మాత్రమే పాఠకుడు చూడగలగాలి. దానికి పాఠకులూ, విమర్శకులూ స్వచ్ఛమైన మనస్సుతో పుస్తకాన్ని చదవగలగాలి అలా చదవకపోయినందువల్లే ఛెంఘిజ్‌ఖాన్ నవల గొప్పతనాన్ని యింత వరకూ తెలుసుకోలేక పోయాం.


తెన్నేటి సూరి"చెంఘిజ్‌ఖాన్' నవల డికెన్స్ నవలలతో సరితూగగలిగే నవల అనడం డికెన్స్‌కు కూడా గౌరవ ప్రదమే అని గుర్తించగలగడం యిప్పుడెంతో అవసరం.

ఆహ్వానం, వేదిక అలంకారం, సభ నిర్వహణ – అంతా తెలుగులోనే ఉండాలి

పొరుగు తెలుగు

కన్నడతోటలో విరిసిన తెలుగుపాట

బుర్రకథ ఈరమ్మ–సంచారి ఆత్మకథ



కన్నడ మూలం
డా. నింగప్ప ముదేనూరు

అనువాదం
రంగనాథ రామచంద్రరావు

(జనవరి సంచిక తరువాయి...)

ఒంటరి పోరాటం

ఈరమ్మ పుట్టిల్లు చేరినా తల్లితండ్రులు కానీ, కులస్థులు కానీ 'ఎందుకు?' అని అడగలేదు.

వాళ్ళకు కూతురు అనుభవిస్తున్న నరకం తెలుసు.

కూతురు సంసారాన్ని చక్కదిద్దే అవకాశాలు లేవని వాళ్ళకు కమలమ్మ ప్రవర్తనతోటే అర్థమైంది.

అంతకుముందు ఒకటి రెండుసార్లు అల్లుడు రామచంద్రప్పకు, అతని మొదటి భార్య కమలమ్మకు చెప్పుకుని, బతిమిలాడుకున్నారు.

వాళ్ళ ప్రయత్నమంతా చెవిటివాళ్ళ ముందు శంఖం ఊదినట్టయింది.

దాంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వాళ్ళుండిపోయారు.

కూతురు భర్తను వదిలి శాశ్వతంగా పుట్టింటికి వచ్చేసినందుకు బాధగా అనిపించినా కూతురు ఆ నరకం నుంచి బయటికి వచ్చినందుకు నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు.

కూతురి వైవాహిక జీవితం చెదరిపోయినందుకు బాధకలిగినా అక్కడ కూతురు అనుభవిస్తున్న నరకం నుంచి విముక్తి దొరికినందుకు నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు.

ఆడపిల్లయినా కథలు చెప్పుకుని పొట్టపోసుకోవచ్చని ఆమెలో ధైర్యం నింపారు.

కూతురుకు అండగా నిలిచారు.

కుటుంబ సభ్యులంతా ఈరమ్మ పరిస్థితికి బాధపడినా ఆమె ముందు తమ బాధను ఎన్నడూ బయటపెట్టుకోలేదు.

అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లు, వదినలు అందరూ ఈరమ్మకు అండగా నిలబడ్డారు.

గుండెల నిండా దుఃఖంతో వచ్చిన ఈరమ్మను ఒక్కమాట అనకుండా ఆమెను గుండెలో దాచుకున్నారు.

తల్లితండ్రులు బుర్రకథ చెప్పుకుని బతకవచ్చని కూతురుకు ధైర్యంచెప్పి ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

దాంతో ఆమె ముందరి జీవితానికి బుర్రకథలే దారి దీపాలయ్యాయి.

నెలలు నిండిన ఈరమ్మ ఒక ఆడపిల్లకు జన్మ ఇచ్చింది.

ఆ బిడ్డకు బీచమ్మ అని పేరు పెట్టింది.

ఆ బిడ్డరాకతో ఈరమ్మ మనస్సు కుదుటపడింది..

బిడ్డను చూసుకుని ఆమె తన దుఃఖాన్ని మరవటానికి ప్రయత్నించసాగింది.

బిడ్డ ఆలనాపాలనాలో కాలం గడపసాగింది.

పుట్టిన బిడ్డను చక్కగా సాకాలని మొండిధైర్యం తెచ్చుకుంది.

పగలు పొలాల్లో పనులు చేస్తూ, రాత్రిళ్ళు బుర్రకథలు చెబుతూ పాటలు పాడుతూ తన కష్టాలన్నీ మరిచిపోతుంది. తాను బతకవలసింది తన కూతురి కోసమని, అదే విధంగా పాట కోసమని ఆమె భావన.

కూతురు పుట్టుక, పాట ఆమె జీవితానికి నూతన చైతన్యాన్ని కలిగించాయి.

అలా భర్త ఇంటి నుంచి వచ్చిన ఈరమ్మ మళ్లీ వెనుతిరిగి పోనేలేదు.

ఈరమ్మ జీవితం పూలపానుపు కాదు. ముళ్లపానుపు.

జీవితంలో నిరంతరం బాధనే అనుభవించింది.

భర్త నిర్లక్ష్యం, మోసం, వంచన ఒకవైపు.

సవతి అసూయ, ఆమె పెట్టిన దైహిక హింస మరో వైపు.

వీటన్నిటి వల్ల ఎంతో సంతోషంగా బతకవలసిన ఈమె



కన్నడ రచయిత
డా. నింగప్ప ముదేనూరు



అనువాదకుడు
రంగనాథ రామచంద్రరావు

జీవితం చిన్న వయస్సులోనే నలిగిపోయింది.

ఈరమ్మకు ఇంకొకరి డబ్బుపట్ల ఆశలేదు.

తన కాళ్ళమీద తాను నిలబడాలి.

తనే స్వయంగా సంపాదించుకోవాలి.

ఆ సంపాదనతోనే తన బిడ్డను సాకాలి.

ఆ పట్టుదలతోటే జీవించసాగింది.

ఆమెకు అడుగడుగున కుటుంబ సభ్యుల సహకారమూ దొరికింది.

బుర్రకథలు చెప్పటంలో ఈరమ్మ పేరు తెచ్చుకుంది. రాను రాను ఆమె పాటలకు, బుర్రకథలకు విలువ పెరిగి గ్రామాల నుంచి ఆమెకు పిలుపులు రావటం మొదలయ్యాయి.

ఆ చుట్టుపక్కలంతా ఆమె 'బుర్రకథ ఈరమ్మ'గా ప్రసిద్ధురాలైంది.

బుర్రకథ చెప్పటంలో ఈరమ్మకు చెల్లెలు శివమ్మ, వదిన పార్వతమ్మలు సహాయపడేవారు.

ఆమె కథలకు విలువ పెరగటంతోపాటు ఆమె సంపాదన కూడా పెరిగింది.

ఈరమ్మ సంపాదనలో తన చెల్లెలికి, వదినకు భాగాలు పంచేది.

ఇంటి సంసారానికి సహాయపడేది. కూతురి కోసం బట్టలు కొనేది. బంగారం, డబ్బు కూడబెట్టేది.

ఆమె అడుగులకు బుర్రకథే దారి చూపింది !

*

ఈరమ్మకు రేపటి గురించి చింతపట్టుకుంది.

భర్త అప్పుడప్పుడు వచ్చి తాగుడు కోసం డబ్బులు ఇప్పించుకుని పోయేవాడు.

సవితి పిల్లలూ అప్పుడప్పుడు వచ్చి తమలో ఒక్కడినైనా ఆమె దగ్గర ఉంచుకోమని బతిమిలాడేవారు.

ఈ రోజున తాను సంపాదించిందంతా వాళ్ళ నోట కుక్కితే రేపు తన గతి ఏమిటి?

రేపటి రోజున తన బిడ్డ గతి ఏమిటి?

తన బిడ్డను ఎలా సాకాలి?

భర్త దగ్గర ఉన్నప్పుడు అతను చేసిన వేలాది రూపాయల అప్పును ఆమె మోసుకుంది.

ఆ అప్పును తీర్చాలి. ఒక ఎకరం పొలం ఇస్తామని, సవితికొడుకును ఆమె దగ్గర పెట్టుకోమని వాళ్ళు చెప్పిపంపడం ఆమెను మరింత బాధించింది. ఆ పొలం వద్దు. సవితి కొడుకుల పీడ వద్దు అనుకుంది. వాళ్ళ పొలం మీద బతకవలసిన పరిస్థితి తనకు పట్టలేదని అనుకుంది. వాళ్ళ దయాదాక్షిణ్యాలపై బతకడం, వాళ్ళ ముఖాలు చూస్తూ బతకడం సాధ్యం కాదని అనుకుంది.

బతుకు తెరువులో ఏమి దొరుకుతుందో అదే తిని బతుకుతానని అనుకుంది.

అన్నం, చట్నీ దొరికినా చాలు అదే తిని ఈ బతుకు ఈదుస్తానని అనుకుంది.

ఈరమ్మ సవితి పిల్లలు అప్పుడప్పుడు ఆమె దగ్గరికి వచ్చేవారు.

తండ్రిలాగే ఆ పిల్లలు తాగుడుకు అలవాటుపడినవాళ్ళు.

ఈరమ్మకు సవితి పిల్లల పట్ల నమ్మకం లేదు. ఈరమ్మ దగ్గర ఉంటామని ఆమెను వేధించారు. రామచంద్రప్పది పెద్ద సంసారం. సవితి పిల్లల్లో ఆరుగురు మగపిల్లలు. ఆ ఆరుగురిలో కొందరు ఈరమ్మ దగ్గర ఉంటామని పీడించసాగారు.

ఒకసారి సవితి కొడుకుల్లో ఒకడు "నేనైనా ఉంటాను. మా నాన్న ఆస్తి తింటారుకదా?" అన్నాడు.

ఆ మాటలకు ఈరమ్మ కోపంతో మండిపడింది.

"మీ నాయినా ఇక్కడికి వచ్చి డబ్బులు ఇప్పించుకుపోయేవాడు. అప్పు చేసి ఇచ్చాడు. అది ఎవరు తీర్చాలి? ఆ అప్పే రెండు వేల రూపాయల వరకు నా నెత్తి మీద ఉంది. కూతురికి సేరు డాబు చేయిస్తానన్నాడు. చేయించాడా? భూమి ఇస్తానన్నాడు. ఇచ్చాడా? మూడు తులాలు బంగారం ఇస్తానన్నాడు. ఇచ్చాడా? రెండుసేర్లు వెండి ఇస్తానన్నాడు? ఇచ్చాడా? పదిపశువుల్లో ఒకటైనా ఇచ్చాడా? నేను తీసుకున్నానా? కట్టుబట్టలతో బయటికి వచ్చాను. అడగటానికి మీకు సిగ్గు ఉందా?" అని అడిగింది.

ఆ మాటలు విన్న నలుగురు , "రేయ్, మీకు బుద్ధి ఉందేంరా? ఆమె పాపం ఒక్కతే కష్టపడుతోంది. పైగా చిన్న కూతురుంది. ఉప్పు, పప్పు, చింతపండు ఇలా అన్నీ ఆ ఆడపిల్లనే కష్టపడి సంపాదించుకోవాలి. ఉంటే తింటుంది. లేకపోతే ఉపవాసం ఉంటుంది. ఏమైనా ఇవ్వడానికి పోతే వద్దప్పా అని అంటుంది. మీరు సిగ్గుపడాలి. మీరు మగపిల్లలు. సంపాదించి మీరే తెచ్చి ఆమెకు ఇవ్వటం పోయి సిగ్గు లేకుండా ఆమెను అడుగుతున్నారుకదా" అని అనేసరికి వాళ్ళు నోరు మూసుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

అలా వాళ్ళు పీడించటానికి కారణం ఉంది. ఈరమ్మ బుర్రకథలు చెబుతూ అంతో ఇంతో సంపాదిస్తోంది. ఆమె సంపాదన మీద వాళ్ళ కన్ను ఉంది. దాంతో ఆమె దగ్గర ఉంటామని లేనిపోనీ ప్రేమ చూపించసాగారు. అయితే ఆ విషయం ఈరమ్మ గమనించకపోలేదు.

కొంత కాలం గడిచింది.

చివరికి ఒక రోజున కరణం ఆస్తి భాగాలు చేయాల్సి వచ్చినపుడు ఈరమ్మను పిలిపించారు.

"నీ భర్తకు చెందిన పొలాలు, వస్త్రాలు, బంగారంలో నీకూ భాగముంది. ఇవ్వటం అతని ధర్మం. అది తీసుకోవటం నీ ధర్మం" అన్నారు.

"ఈ ధర్మంతో నాకు చాలైపోయింది. నాకు అతని ఆస్తి వద్దు. బంగారంవద్దు, బట్టలూ వద్దు. ఇలాగే కథలు చెప్పుకుని నా బతుకు నేను బతుకుతాను. అంతా ఆ మొదటి భార్యకే, ఆ పెద్దామెకే ఇవ్వండి. ఆమెకు చాలామంది పిల్లలున్నారు. వాళ్ళు కూడా నా పిల్లలే. పాపం బతకనీ" అని కరాకండిగా చెప్పి, అదే విధంగా రాసిన పత్రాల మీద వేలిముద్ర ఒత్తి వచ్చింది.

ఆనాడు పంచాయితీలో పాల్గొన్న పెద్దలందరూ ఆమె అభిప్రాయానికి మెప్పుదలతో తలలూపారు.

అప్పటి ఆమె నిర్ణయం ఆమెకు సమంజసంగానే తోచింది.

సంసారం పొందికగా లేనప్పుడు, ఇంటి నుంచి బయటికి వచ్చేసిన తనకు భర్త ఆస్తితో పనేమిటి? అతడి దయాదాక్షిణ్యాలు తనకు వద్దు. తన కూతురును తాను పోషించుకోగలను అని గట్టిగా నిర్ణయించుకుంది.

*

ఈరమ్మ తన కూతురును పెంచడంలోనే తన దుఃఖాన్నంతా మరచిపోవడానికి ప్రయత్నించేది.

ఆ పిల్ల ఆలనాపాలనలోనే ఆమెకు సంతోషం, సుఖం, ప్రశాంతత దొరికేవి.

కూతురే ఆమె జీవితం అయిపోయింది.

కాలచక్రం గిర్రున తిరగసాగింది.

ఈరమ్మ ఆ చుట్టుపక్కలనే కాకుండా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు తన బుర్రకథల ద్వారా పరిచయమైంది.

ఆమె ఎంతో పేరు సంపాదించుకుంది.

ఈరమ్మ కూతురు పెరిగి పెద్దమనిషి అయ్యింది.

కులపెద్దల సూచన ప్రకారం కూతురు పెద్దమనిషి అయిన విషయాన్ని భర్త ఇంటివాళ్ళకు తెలియజేసింది.

అయినా ఎవరూ రాలేదు.

దాంతో ఈరమ్మనే కూతురు ఒడి నింపింది.

కొంత కాలం తరువాత ఈరమ్మకూతురు పెళ్ళి నిశ్చయమైంది.

కూతురి పెళ్ళికి భర్తను, సవితిని, సవితి పిల్లలను పిల్చుకుని రమ్మని తన అన్నను ఈరమ్మ పంపింది.

అయితే రామచంద్రప్ప తనకు రెండు వేల రూపాయలు తాగడానికి ఇస్తేనే వస్తానని చెప్పి పంపాడు.

కూతురు పెళ్ళిలో తండ్రి లేకపోవడం సమంజసం కాదని అతడికి అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తానని ఈరమ్మ అంగీకరించిన మీదట రామచంద్రప్ప కూతురి పెళ్ళికి వచ్చాడు. కూతురికి పెళ్ళికి డాబు చేయిస్తానని అందరి ముందు చెప్పాడు. తరువాత ఆ మాట ఎత్తకుండా మౌనంగా ఉండిపోయాడు.

పెళ్ళిల్లో రామచంద్రప్పకు కావలసినంత సారా తెప్పించి పెట్టింది.

కూతురికి తాను సంపాదించి, కూడబెట్టిన డబ్బుతో బంగారు గొలుసు, తాళి, కమ్మలు మొదలైనవి చేయించి వేసింది.

తన అన్న కొడుకు నాగరాజుతో కూతురి పెళ్ళి ఉన్నంతలో వైభవంగా జరిపించింది.

*

కూతురు పెళ్ళిలో ఇష్టమొచ్చినట్టు తాగి, తిని, మజా చేసి తన ఊరికి రామచంద్రప్ప వెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిపోయిన రామచంద్రప్ప మళ్ళీ ఈరమ్మ దగ్గరికి అప్పుడప్పుడు వచ్చి తాగడానికి డబ్బులు ఇప్పించుకుని పోతూవుండేవాడు. భర్తగా ఈరమ్మకు ఏమీ చేయకపోయినా, తండ్రిగా కూతురికి ఏమీ ఇవ్వకపోయినా ఆ తల్లీకూతుళ్ళకు భారంగానే తయారయ్యాడు.

కాలం గడిచేకొద్దీ రామచంద్రప్ప సంపాదన తగ్గింది.

దాంతో అతను భార్యపిల్లల మీద ఆధారపడాల్సి వచ్చింది.

తాగి తాగి ఒళ్ళు గుల్లవుతుంది ఆరోగ్యం చెడి మూలన పడ్డాడు.

భార్యాపిల్లలను అతడిని పట్టించుకోవడం మానేశారు.

దిక్కులేని వాడిలా పడివున్నాడి తెలిసి ఈరమ్మకు భర్త అవస్థపట్ల కనికరం కలిగింది.

అతడు తనను హింసించినవ్వీ మరిచి భార్యగా తను అతడికి సేవచేయడం తన ధర్మమని ఈరమ్మ అతడి ఇంటికి వెళ్ళింది.

అతడిని ఆస్పత్రికి తీసుకుని పోయింది.

మందులు ఇప్పించింది.

పక్షవాతంతో మంచం పట్టిన భర్తకు అన్ని సేవలు చేసింది.

చివరి రోజుల్లో రామచంద్రప్పకు ఈరమ్మ మంచితనం అర్థమైంది.

ఆమె త్యాగబుద్ధి తెలిసి వచ్చింది.

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

తన పెద్దభార్య చెప్పుడు మాటలు విని ఆమెను బాధపెట్టిన సంగతులు గుర్తుకొచ్చి కుమిలిపోయాడు.

చేసిన పాపాలకు పశ్చాత్తాపం కలిగింది.

లోలోపల తను ఆమె పట్ల ప్రవర్తించిన తీరుకు కుమిలి పోయాడు.

అతడి ఆరోగ్యం రోజు రోజుకు క్షీణించింది.

ఎన్ని ప్రయత్నాలు చేసినా రామచంద్రప్ప ఎక్కువ రోజులు బతకలేకపోయాడు.

బతికి ఉన్నంత కాలం హింసించిన భర్త మరణం ఈరమ్మను మానసికంగా కుంగదీసింది.

అతడిని ఎంత అసహ్యించుకున్నప్పటికి అతని మరణం ఆమెను బాధించింది.

ఈరమ్మ మానసికంగా కొంత కాలం కుంగిపోయినా మళ్ళీ కూతురును, మనుమరాలిని చూసుకుని ధైర్యం తెచ్చుకుంది.

జీవితంలో వచ్చిన కష్టాలను ఆమె ఎదుర్కొన్న తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఆమె ఆత్మబలానికి ఆమె పాటలే కారణమని చెప్పక తప్పదు.

మళ్ళీ తన పాటల లోకంలోకి ప్రయాణం మొదలుపెట్టింది.

ఈరమ్మ తన ధైర్యంతోను, ఆత్మ విశ్వాసంతోను, స్వాభిమానంతోనూ జీవితంలో వచ్చిన అన్ని బాధలను తట్టుకుని నిలబడింది.

ఆమె జీవితం సంఘర్షణామయమైంది.

జీవితంలో ఎంతటి కష్టాలు ఎదురైనప్పటికి ఆమెది ఒంటరి పోరాటం !

తోడుగా కూతురు ఉన్నప్పటికీ ఆమెకు అనుభవం చాలదు.

అత్యంత కష్టమైన రోజులలోనూ ఈరమ్మ తన కూతురును సాకింది.

కూతురుకు తండ్రి ఒక 'కల'గానే మిగిలిపోయాడు.

కూతురు పెళ్ళికి వచ్చిపోయినవాడు తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడు.

అతడిని మట్టి చేసి తిరిగి వచ్చిన తరువాత ఈరమ్మ మళ్ళీ ఆ ఇంటి గడపలోకి ఎన్నడూ అడుగు పెట్టలేదు.

*

(వచ్చే నెలలో- **పాటతో ప్రయాణం**)

కవిత

యుద్ధం

నాలుగ్గదుల నిశీధిలో
ఒంటరిగా కూర్చున్నావా
జ్వలిస్తున్న చీకటితో
ఎంతసేపని మాట్లాడతావు

ఇప్పటికైనా చెప్పు
యుద్ధం చేస్తానంటే
కరవాలం నేనిస్తాను

విశ్వానికి పడ్డ తూటాల
గాయాలింకా కనబడలేదా?
నెత్తుటి మరకల చరిత్రను
ఇంకా వీక్షిస్తావా?
మదిలో నిప్పుల కొలిమి
సెగలు రగిలించవా?
హృదయం యుద్ధ మైదానం కావాలి

నల్దిక్కుల పొంచివున్న గ్లోబల్ ప్రమాదం
మనిషి అస్థిత్వానికి
సవాలు విసురుతోంది
మానవత్వాన్ని నడి వీధిలో
నిల్చుండబెట్టింది

ఇక కలాలు తిరగబడాలి
గళాలు గర్జించాలి
కాగితం కదనరంగమవ్వాలి
విలువలు కోల్పోతున్న
సమాజానికి
సిరాచుక్కలే ఆయువు పోయాలి.

- కెంగార మోహన్

భాష లేకపోతే భావం లేదు
నీ భావాల్ని నీ భాషలో
చెప్పడమే సరైనది

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

చలసాని నరేంద్ర
9849569050

మహిళా సాధికారికత నినాదాలకే పరిమితమా !



కీలకమైన రంగాలలో, ప్రముఖమైన హోదాలలో ఉంటూ, పేరు ప్రఖ్యాతులు గల అనేక మంది మహిళలు కొంత కాలంగా – మీ టూ' ఉద్యమం ప్రభావంతో గతంలో తమపై జరిగిన లైంగిక వేధింపులు, అత్యాచారాల గురించి బహిరంగంగా చెప్పడానికి ముందుకు వస్తున్నారు. అసలు తాను వేధింపులకు గురైనట్లు కొద్ది సంవత్సరాల తర్వాత కానీ తాను గుర్తించలేక పోయిన్నట్లు ఈ మధ్య ఒక ప్రముఖ హిందీ నటి చెప్పారు.

మహిళల పట్ల ఇటువంటి అనుచిత వైఖరి ప్రదర్శించడం కేవలం భారతీయ సమాజానికి మాత్రమే పరిమితం కాదు. ప్రపంచ వ్యాప్తంగా నేడు ఆందోళన కలిగిస్తున్న అంశం ఇది. గతంలో ఇటువంటి వేధింపులను, అవమానాలను మహిళలు తమలోనే దిగమింగుకొనే వారు. సహచరులతో, కుటుంబం సభ్యులతో చెప్పుకోవడానికి సహితం సాహసించే వారు కాదు. కానీ నేడు కొద్దిమందైనా బహిరంగంగా చెప్పగలుగుతున్నారు. ఆ విధంగా చెపుతున్న వారిని మనం ఏ విధంగా చూస్తున్నాము అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది.

అత్యున్నత పదవులలో ఉన్నవారు సహితం ఇటువంటి అంశాలలో ధైర్యంగా ఎదుర్కొనే ప్రయత్నం చేయలేక పోతున్నారు. మహిళా సాధికారికత గురించి మనమెంతగా మాట్లాడుతున్నా పురుషులతో సమానంగా వారిని చూస్తున్నామా? ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మంత్రిగా పనిచేసిన ఒకామె తన అనుభవాన్ని ఒకసారి చెప్పారు. మంత్రివర్గ సమావేశాలలో మంత్రులు కేవలం తమ శాఖలకు సంబంధించిన అంశాల గురించి మాత్రమే కాకుండా ఇతర మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలపై కూడా అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చు. తాను అటువంటి ప్రయత్నం చేస్తే "నీ శాఖ సంగతి చూసుకోవమ్మా" అంటూ తనను మాట్లాడనిచ్చే వారు కాదని ఆమె వాపోయారు. మంత్రులుగా ఉంటున్న వారికే అటువంటి అనుభవాలు కలుగుతూ ఉంటే ఇక మిగిలిన వారి సంగతి ఏమిటి?

ఇప్పుడు ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవికి పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్న ఇంద్ర నూయి ఒక ఇంటర్వ్యూ లో తన జీవితాల్లో ఎన్నో అవహేళనలకు గురైనట్లు చెప్పుకొచ్చారు. మొత్తం ప్రపంచాన్ని పర్యవేక్షిస్తోంది అనుకొంటున్న ఐక్యరాజ్య సమితిలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు ఈ మధ్య ఒక అధ్యయనంలో వెల్లడైంది. ఆ విధంగా గురవుతున్న వారిలో ఉన్నత పదవులలో ఉన్నవారు కూడా ఉన్నారు. 1945లో ఏర్పడిన ఈ అంతర్జాతీయ వేదికకు ఇప్పటి వరకు ఒక్క మహిళా కూడా సెక్రటరీ జనరల్ గా ఎన్నిక కాలేదు. ఒక మహిళ ఎన్నికయ్యేటట్లు పలు ప్రయత్నాలు జరిగినా ఫలించడం లేదు.

ఈ ప్రపంచ సంస్థలో మహిళలకు సమాన ఆదరణ లభించేటట్లు చూసేందుకు తాను గత రెండేళ్లుగా ప్రయత్నం చేస్తున్నట్లు సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ తెలిపారు. అయినా పరిస్థితులలో చెప్పుకోదగిన మార్పులు రాకపోవడం గమనార్హం. ఎంతో ప్రగతి కాముక దేశంగా భావించే అమెరికాలో ఇప్పటి వరకు ఒక్క మహిళా ఆ దేశ అధ్యక్షురాలు కాలేకపోయారు. మొదటి సారిగా రెండేళ్ల క్రితం ఒక మహిళ – హిల్లరీ క్లింటన్ అధ్యక్ష పదవికోసం పోటీ పడ్డారు. వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికలలో పోటీకి పలువురు

మహిళలు ప్రయత్నం చేస్తున్నారు.

అమెరికా సమాజంలో మహిళలను సేవలు అందించే నర్స్‌గా, ఎయిర్ హోస్ట్‌గా, టీచర్‌గా ప్రాధాన్యత ఇస్తున్నా అత్యున్నత నాయకత్వ స్థానంలో ఏమాత్రం ఆదరణ కల్పిస్తున్నారో చెప్పలేని పరిస్థితులు ఉన్నాయి. ప్రపంచంలోనే అతి పురాతనమైన పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్ లో అతి సుదీర్ఘకాలం 19 ఏళ్ళ పాటు ఒక మహిళా – సోనియా గాంధీ అధ్యక్షురాలుగా ఉన్నారు. ఆమె సారధ్యంలో పార్టీ 10 ఏళ్ళ పాటు కేంద్రంలో అధికారంలో ఉన్నది. అయినా మహిళల విషయంలో చెప్పుకోదగిన కృషి చేయలేక పోయారు.

చట్ట సభలలో మహిళలకు మూడవవంతు సీట్లు కేటాయింపుకు అన్ని రాజకీయ పక్షాలు ఒప్పుకొంటున్నాయి. కానీ పార్లమెంట్ లో చట్టం మాత్రం కాదు. కేవలం బిజెపి, కాంగ్రెస్ కలిస్తే ఈ చట్టం చేయడానికి వీలవుతుంది. కానీ ఆ రెండు పార్టీలు మాటలకే తమ వాదనలను పరిమితం చేస్తున్నాయి. బిజెపిలో మూడవవంతు పదవులను మహిళలకు ఇస్తున్నారు. కానీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులలో మాత్రం మహిళలకు తగు స్థానం ఇవ్వడం లేదు. విదేశీ వ్యవహారాలు, రక్షణ వంటి కీలక మంత్రిత్వ శాఖలను మహిళలకు ఇచ్చారు. అయితే వారికి సొంతంగా తమ విధులను నిర్వహించే స్వాతంత్ర్యం మాత్రం లేదు.

ముస్లిం సమాజంలో మహిళలకు తగు ప్రాధాన్యత ఉండదని మనం చెబుతూ ఉంటాం. కానీ పొరుగున ఉన్న పాకిస్థాన్, బాంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలలో ఉన్నంతమంది మహిళలు మన పార్లమెంట్ లో లేరే ? స్థానిక సంస్థలలో చాలా రాష్ట్రాలలో సగం సీట్లను మహిళలకు రిజర్వు చేసాము. అయితే రిజర్వేషన్ కారణంగా పోటీ చేయలేక పోయిన మగవారి భార్యలు, కుమార్తెలు, ఇతర కుటుంభ సభ్యులు మాత్రమే పోటీ చేస్తున్నారు. వారి అధికార విధులలో మగవారే ఎక్కువగా పెత్తనం చేస్తున్నారు. చివరకు మగవారు అధికారిక సమావేశాలకు ఎటువంటి హోదా కూడా లేకుండా హాజరై నిర్ణయాలు తీసుకొంటున్నారు.

తమకు అవకాశం వచ్చిన ప్రతి రంగంలో దాదాపుగా మహిళలు తాము పురుషులకన్నా ఏ విధంగా కూడా తీసిపోమని నిరూపించుకొంటూనే ఉన్నారు. అయితే పురుషులలో కనిపించే కొన్ని బలహీనతలు కొందరు మహిళలలో కూడా ఉండవచ్చు. అంత మాత్రం చేత వారికి సమాన అవకాశాలు ఇవ్వనవసరం లేదని చెప్పలేము. శాంతిభద్రతల సమస్యలు, యుద్ధ వాతావరణం, పకృతి వైపరీత్యాలు వంటి పరిస్థితులలో పురుషులకన్నా ఎక్కువగా మహిళలే ఇబ్బందులకు గురవుతున్నారు. పురుషులు అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, చట్టాతీత హత్యలు, ఇతర వేధింపులకు గురయితే వారితో పాటు వారితో ఉన్న మహిళలు కూడా అకారణంగా ఇబ్బందులకు గురికావలసి రావడం గమనార్హం.

మహిళా సాధికారికత అన్నది కేవలం మహిళలను ఉద్దరించడం కోసం కాదని గ్రహించాలి. సమాజం నాగరికంగా మనుగడ సాగించాలి అనుకొంటే అందుకు మహిళలు సహితం పురుషులతో పాటు సమాన భాగస్వాములు కావలసిందే. హిల్లరీ క్లింటన్ వంటి కొద్దిమంది మహిళా నాయకురాళ్లు యుద్దోన్మాదులుగా పేరొందినా సహజంగా మహిళా నేతలు శాంతికి ప్రాధాన్యత ఇస్తారు. యుద్ధం, రక్తపాతం, దురాక్రమణ వంటి పరిస్థితులను నివారించే ప్రయత్నం చేస్తారు. అవసరమైన సమయంలో ధృడమైన నిర్ణయాలు తీసుకోవడంలో వారు పురుషులకు తీసిపోరు. ఇందిరా గాంధీ, సిరిమావో బండారునాయక, బెనజీర్ భుట్టో, షైక్ హసీనా వంటి నేతలు క్లిష్ట పరిస్థితులలో సహితం ధైర్యంగా వ్యవహరించడం చూసాము.

రాజకీయ, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య పరంగా మహిళల సాధికారికత సమ్మిళిత అభివృద్ధిలో కీలక అంశంగా గుర్తించాము. మహిళా సాధికారికతలో విద్య కీలక పాత్ర వహిస్తుంది. అయినా విద్య పరంగా ఇంకా పురుషులతో సమానంగా మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేక పోతున్నాము. మంగోలియా వంటి దేశాలలో విద్య, సామజిక రంగాలలో పురుషులకన్నా మహిళలు ఎంతో ముందంజలో ఉన్నప్పటికీ ప్రపంచం మొత్తం మీద మహిళల పరిస్థితి అంత మెరుగుగా లేదనే చెప్పాలి.

ఇంకా మహిళలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు అవసరమా? బాల్య వివాహాల గురించి ఇంకా మనం వింటూ ఉన్నామంటే ఎటువైపు వెడుతున్నాము? ఒకే పనికి స్త్రీ, పురుషులకు సమాన వేతనం ఇవ్వాలని కోరవలసిన పరిస్థితి ఏర్పడటం ఎటువంటి పరిస్థితిని సూచిస్తుంది? మహిళలు ఇంటికే పరిమితమైన, ఎటువంటి ఉద్యోగం చేయక పోయినా వారు చేసే పనులకు విలువ కడితే పురుషుల కన్నా ఎక్కువగానే పని చేస్తున్నట్లు వెల్లడి అవుతుంది. వారి పనికి తగు గుర్తింపు, గౌరవం ఇవ్వవలసిన అవసరం ఉంది.

సాధికారికత పట్ల మహిళల్లోనే తగు అవగాహన లోపించడం మరింత తీవ్రమైన అంశం. భర్తలు తమను భౌతికంగా హింసకు గురి చేయడం (కొట్టడం) సరైనదే అని సగం మంది భార్యలు భావిస్తున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైనది. మహిళలకు తాము సంపాదించే డబ్బును ఖర్చు పెట్టుకొనే స్వాతంత్ర్యం ఉండటం లేదు. మహిళా సాధికారికత అంటే చాలాకాలం మహిళా సంక్షేమ కార్యక్రమాలకే పరిమితం అవుతూ ఉండేవారు. కానీ ఇప్పుడు నిర్ణయాలు తీసుకోవడంలో వారికి సమాన అవకాశం ఇవ్వడం. వనరులపై వారికి కూడా తగు అధికారం లభించడం. నాయకత్వంలో తగు ప్రాధాన్యత లభించడం వంటి అంశాలు తెరపైకి వస్తున్నాయి.

మహిళా సాధికారికతను కార్యరూపం దాల్చలేని పక్షంలో మొత్తం మానవుల సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని 1995లో ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం నివేదికలో గుర్తించారు. అప్పటి నుండి ఆ దిశగా అంతర్జాతీయంగా, జాతీయ స్థాయిలో

(తరువాయి 43వ పుటలో...)

కవిత

నేలపై నడయాడే శివుడా

నేలపై నడయాడే ఓ శివుడా, మమ్మల్ని మన్నించవయ్యా,
మా ఉసురు నిలుపగ నువు పుడితే,
నువు ఉసురు తీసుకునేంత వరకు, నిన్ను మేం గుర్తించలేదయ్యా

విత్తుకోసం మేం పరిగెడితే,
విత్తనం కోసం నువ్వు ప్రాణాలిచ్చినవ్-
విలువల్ని వదిలేసి మేం వెళితే
వలువలైనా లేని నువ్వు, వట్టి పోయిన నేలకు సైతం ప్రాణం పోసినవ్-

కలం పట్టిన మేం, చాలా గొప్ప వాళ్లమని విర్రవీగుతుంటే,
హలం పట్టిన నువ్వు, అనామకుడిగానే మిగిలినవ్-!
పొలం ఇచ్చిన పంటంతా మాకు పంచి,
అది మిగిల్చిన హాలాహలం నువ్వు మింగినవ్!!

ఆస్థులు కూడేయడంలో మునిగి, కూడుపెట్టిన వాడ్ని మరిచిపోయినం
ఆయువంతా వెచ్చించి, మా ఆకలి తీర్చిన నిన్ను, ఆదిలోనే వదిలేసి పోయినం...
అరికాలి లోతైనా దిగక ముందే, కష్టాల్లో మునిగామని అల్లల్లాడి పోయే మేం,
మా ఆకలి తీర్చడం నీ బాధ్యతనుకుని, అప్పులు చేసి మరీ,
మళ్ళీ దుక్కిదున్నిన నిన్ను మొక్కడం మరిచినం !

మట్టి విగ్రహాలకు మ్రొక్కి, హుండీలో కాసులేసి, అదే భక్తనుకున్నమ్
మట్టిని మొక్కి, మొక్కను పూజించే నిన్ను చూసి, పిచ్చోడని నవ్వినం!
మనుష్యులమే కానీ, మానవత్వమొకటుందని మరిచినం-
మరబొమ్మల్లోలే మారి, నరమాంసంతోనే జూదమాడుతున్నం!

మేఘాల నుండి ఒక్క నీటి చుక్కనయినా తేలేని మేం,
మరో గ్రహానికి చేరినమని గర్వపడ్డం-
మమ్మల్నే నమ్ముకున్న నిన్ను, నువ్వు నమ్ముకున్న మన్నుల్లోనే కలిపినం!

మందులెన్నో కనిపెట్టి, ఎంతో ముందుకెళ్ళినమని మురిసి పోయినం,
పురుగుల మందు తాగి, ప్రాణమిడిచిన నిన్ను,
వెనక్కి తిరిగి చూడడం మరచిపోయినం !

మనిషంత స్వార్థజీవి ఇంకొకరు లేరని, సమస్త జీవజాతంతా తిట్టిపోస్తే,
అది అబద్ధమని నిరూపించడం కోసం నువ్వు నిలబడ్డవ్ -
నీ కష్టాల్ని కన్నెత్తైనా చూడక, పొందడం తప్ప ఇవ్వడం మరిచిపోయిన మేం,
వాటి మాటను నిజం చేసి, నిన్ను మళ్ళీ ఓడించినం -

మెతుకుతో బ్రతుకునిచ్చే నీ ముందు
మొరపెట్టుకుంటే కానీ మోక్షం ప్రసాదించని ఆ శివుడెంత ?
అగిడితే కానీ వరమివ్వని ఆ శివుడు,
ప్రాణాలు పంటగ మార్చి, సిరులు పండించే నీ ముందెంత ?

నీ రుణం తీర్చుకోవాలన్న ఆలోచన, ఏ ఒక్క క్షణమైనా మాలో ఎందుకు కలగలేదో !?
రుణాలు తీర్చలేక, ఉరిని ఆశ్రయించే తరుణంలో కూడా,
నీకు మాపై కోపమెందుకు రాలేదో !?

నీ అన్నం తిన్న అన్నపూర్ణలెవరూ నీకు సాయం రాకుంటే,
కూసింతైనా కోపం తెచ్చుకోవేమయ్యా...?
మా జంగమ దేవరా, నీ జోలె నింపని ఈ జగతిపై, జనంపై,
ఇంకా జాలి తరగదేమయ్యా?

గింజగింజలో నీ గుప్పెడు గుండెను దాచి, మాలో జీవం నిలిపిన ఓ కర్షకుడా,
ఇన్నాళ్ళూ మా గురించే ఆలోచించిన నువ్వు
ఉరివేసుకుని ఉసురు తీసుకునే ముందు,
ఒక్కమారు, నీ గురించి కూడ కాస్త ఆలోచించుకోవయ్యా -

నువ్వులేని ఈ నేల అనాధగా మారుతుంది
నువులేక ప్రతిజీవి, ఆకలితో మాడుతుంది.

నేలపై నడయాడే మా శివుడా, మమ్మల్ని మన్నించవయ్యా-
అనాధలుగా మమ్మల్ని మిగిల్చి, సమాధిపాలు కాకయ్యా-
మన్నులనేలే ఓ దేవరా, మిన్నులకేగకయా-
మింట ఒక్క శివుడు చాలు,
మా కోసం నువ్వు నేలపై కొలువుండవయ్యా

- డా॥ సిరి.

కీ.శే. దుర్గానంద్

శబ్దగాండీవి వేమన-7



(జనవరి సంచిక తరువాయి)

ముగింపు

కవుల చరిత్రల మీద ఈ వరకే ఎన్నో అభిప్రాయాలు వచ్చి ఉన్నాయి. ఎంతో గ్రంథం పెరిగి ఉంది. ఇలాంటి విషయాల మీద వ్యాసం వ్రాయడం చాలా కష్టమవుతుంది. ఆ అభిప్రాయాల ప్రభావం ముందుగా మన మీద పడితే మనం ఇహ సొంత అభిప్రాయం ఇవ్వలేము. వ్రాయలేము. అందువల్ల నేను ఏదైనా వ్యాసం వ్రాసేటప్పుడు ముందు ఎవరివీ చదవను. వ్రాసిన తరువాత మాత్రం తృప్తికోసం ఒకరిద్దరివి చూస్తాను. వేమన మీద ఈ వ్యాసం పూర్తి చేసిన తరువాత వంగూరి సుబ్బారావు పంతులుగారి 'శతక కవుల చరిత్రము'లోని వేమనను గురించిన భాగము చదివాను. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి 'వేమన' చదివాను. వీళ్లిద్దరిలో సుబ్బారావు గారి వాదమే నాకు సత్యానికి దగ్గరగా ఉన్నట్టు తోచింది. వంగూరి సుబ్బారావుగారు వేమనను 15వ శతాబ్దపు వాడని కొన్ని ఉపపత్తులు చూపారు. కాని రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు వేమన అంత పూర్వీకుడు కాదని 17వ శతాబ్దమూ ఇంకా ఇవతలికి కూడా తెచ్చారు. ఈ విషయాన్ని పైపై ఊహలతో కల్పనలతో కాకుండా అసలు ఉద్యమ స్వరూపాన్ని బట్టికూడా కొంత చూడవలసి ఉంది. వేమన చేపట్టిన ఈ అద్వైత కవితా మార్గం ఈ జ్ఞాన మార్గం అసలు తెలుగుది కాదు. వేమనకు ముందు శివ కవుల్లోగాని పురాణాల్లోగాని ఈ రకమైన కవిత్వం లేదు. ఇది అఖిల భారతీయ సిద్ధాంతం. ఉత్తర భారతంలో దీన్ని ప్రారంభించినవాడు కబీరు. అందుకే దాన్ని కబీరు పంథా అంటారు. ఈ రకమైన కవిత్వానికి కబీరే ఒక ఒరవడి ఇచ్చాడు. తతిమ్మా అన్ని ప్రాంతాల్లోనూ అతని ద్వారానే ఈ రకమైన కవిత్వ బీజా వాపనం జరిగింది. ఆయన జీవించిన 120 సంవత్సరాల దీర్ఘ జీవితంలోనూ పలు ప్రాంతాల్లో తిరిగి ప్రచారం చేశాడు. మహారాష్ట్ర కన్నడ మొదలైన అన్ని ప్రాంతాల్లోనూ ఆయన తరువాతనే ఈ జ్ఞాన కవిత ప్రబలింది. అచ్చు యంత్రాలు ఉన్నా లేకపోయినా ఈ జ్ఞాన సూర్యుని కిరణాల్ను అడ్డుకోవడానికి ఏ తలపులకూ కిటికీలకూ శక్తి చాలదు. మనశక్తిని యంత్రానికి ధారపోస్తే యంత్రం నడుస్తుంది. యంత్రం లేకపోతే మనమే యంత్రాలమై శక్తిధార బోస్తాము. విమానాలు లేక పోయినా మన దేశానికి ఇత్సింగు వస్తాడు. పాదయాత్ర చేసైనా పాహియాన్ వస్తాడు. రవాణా సౌకర్యాలులేని మాత్రాన రవాణా ఆగదు. 14,15 వ శతాబ్దాల్లో వెలసిన ఈ కబీరు ఉద్యమాన్ని దానికి చేరువలోనే ఉన్న వేమన అందుకున్నాడనడమే సబబైనది. వేమన తరువాత ఈ రకమైన సాహిత్యం ఎంతో బ్రహ్మంగారి, యాగంటి మొదలైన వారి తత్వాల్లో వెల్లి విరిసింది. సిద్ధాంతం ముందు సూక్తుల్లో ఉంటుంది. తరువాత అవి పాటలుగా సాగి ప్రజానీకం లోకి వస్తాయి. ఉద్యమ కర్త అయిన కబీరులో ఈ కవిత్వం చిన్నచిన్న సూక్తుల్లో దోహాల్లో మొలకరించింది. అలాగే వేమన ఆట వెల దుల్లో ప్రస్ఫుటితమైంది. సూర్యుడు ఉదయిం చినప్పుడే పక్షులు కిలకిలా రావాలు చేస్తాయి. బారెడు పొద్దెక్కిన తరువాత ఏ పక్షీ కూయదు. ఉత్తర భారతంలో ఉదయించిన ఈ సూర్యుణ్ణి చూచే అప్పుడు ఆ ప్రాంతాల అన్ని విహగ కులాయాలు కుహుకుహూ రుతాలు చేసి నయి. వేమనను అప్పటి ఆ తెలతెలవారని ప్రొద్దులో ఉన్నవాడు అనుకుంటేనే ఆ విహగ కూజితానికి అర్థముంటుంది. ఏ పదిహేడో పద్దెనిమిది శతాబ్దం వాడో అయితే ప్రొద్దు బారెడు ఎక్కిన తరువాత కూసిన కూతే అవుతుంది. సాహిత్యోద్యమం ఇంత చల్ది కూడును భరించలేదు. ఇంగ్లీషు వాళ్లు వచ్చే మన దేశానికి 300 యేళ్లు అయింది. వాళ్ళతోనే మనకు వెలుతురు వచ్చింది అనుకుంటున్నాము. ఈ వెలుతురులో ఉన్న వాడే వేమన అయితే ఆయన కుల గోత్రాలు, పుట్టుకలూ కనిపించకపోవడానికి అవే మీ చిన్న నలుసులు కాదు, వేమన మీద డజన్ల కొద్దీ చరిత్రలు ఉన్నాయట, యాభై అరవైలు అనుకరణలు ఉన్నాయట. రెండు మూడు వందల సంవత్సరాల నాటి తాళ పత్ర గ్రంథాలున్నాయట. వందల కొలది పాఠాంతరాలు, పుట్టుకను గురించి కథలు, అవతారాలు ఇన్ని ఉన్నవాడు నిన్న మొన్నటి వాడు ఎలా అవుతాడు! తనది కొండవీడు అని తానే చెప్పుకున్నాడు. కొండవీటి రాజుల వంశం వాడు అని పురాణం చెబుతుంది. అప్పటి వాడుగా ఆ పురాణాల్లో పుట్టుక తిధీ మరణ తిధీ కూడా ఇచ్చారు. అవి పుక్కిటి పురాణాలుగా కొట్టివెయ్యడానికి మనకు హక్కు ఎలా ఉంటుంది. కాదనడానికి ప్రబలమైన సాక్ష్యాలు లేనప్పుడు. కుమారిగిరి పుత్రుడు వేమన అని ఒక కథ చెబుతుంది. కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు అతనికి పుత్రులే లేరన్నారు. చిలుకూరి వీరభద్రరావుగారు అతనికి ఒక పుత్రుడు ఉండేవాడు అన్నారు. ఇంకొక పుస్తకంలో అతనికి ఇద్దరు కొడుకులని ఉన్నదట. వీళ్లలో ఎవరిమాట నమ్మాలి? వీరందరూ చేయి తిరిగిన చరిత్ర పరిశోధ కులే. అసలు వేమన చరిత్ర పురాణంలో ఏమని ఉంది? రెడ్డి రాజుల్లో కడపటివాడు రాచ వేమారెడ్డికి మన వేమన తమ్ముడట కొమరగిరి వేమారెడ్డి కొడుకు. తల్లి మల్లమ్మ అన్న భార్య సరసమ్మ. ఆవిడ బోధలు విని ఈయన యోగి అయ్యాడు. ఇది చరిత్రలు చెబుతున్నాయి ప్రజలు ఇలాగే నమ్ముతు న్నారు. కొండవీటి రాజ్యం చివరి రోజుల్లో

1428 తరువాత నుండి ఈయన ఉండి ఉంటాడు. నల్ల చెరువు దగ్గర ఒక పూజారి ఇతని పేరు పుల్లయ్యగాని వేమన కాదు అని చెప్పాడట. పిడుగు పడ్డ తరువాత పుల్లారెడ్డి చచ్చి పోయాడట. 8 రోజుల్లో నే వేమనగా అవతరించాడట. మనం పురాణాల్లోని ఇలాంటి పుక్కిటి కథల్లోని మాటల్ను తలా తోకాలేనివని కొట్టి వేస్తాముగాని దాంట్లో ఎంతో అందముంది, ఎంతో కల్పనా మాధుర్యముంది. పురాణాల్లో ఇక్షు సముద్రం క్షార సముద్రం, ఘృత సముద్రం, దధి సముద్రం ఉన్నాయంటే క్షీరదధి సముద్రాలు ఉండటమే మిటి అబద్ధం అని త్రోసి రాజన్నాము. దధి ఎప్పుడూ గడ్డకట్టే ఉంటుంది. ఉత్తర ధృవ ప్రాంతాల్లో ఉన్న ఆర్కిటెక్ మొదలైన సముద్రాలు ఎప్పుడూ గడ్డకట్టే ఉంటాయి గాబట్టి వాటిని దధి సముద్రాలని ముద్దుగా పిలుచుకున్నారు పురాణ కర్తలు. ఘృతం కరుగుతుంది, గడ్డ కడుతుంది. అట్లాంటిక్ మొదలైన సముద్రాలు వేసవి కాలంలో కరుగుతాయి మళ్లీ శీత కాలంలో గడ్డ కడతాయి గాబట్టి కరిగి గడ్డకట్టే సముద్రాలను ఘృత సముద్రాలు అన్నారు. మంచి నీళ్లుగా ఉన్న సుపీరియర్, బాల్టిక్ సముద్రాలను ఇక్షు సముద్రాలు అన్నారు. ఇటువంటి కల్పనల్లో ఉన్న అందాలను గ్రహించలేక మనం వాటిని కొరగాని ఊహలని త్రోసి పారేస్తుంటాము. వేమన్నను పుల్లయ్య అని ప్రజలెంత బాగా అన్నారో చూడండి. జ్ఞాని వేదాంతి (తాత్వికుడు) కాకముందు అసలు వేమన్న ఎవరు పుల్లయ్య కాకపోతే. ఈ ప్రపంచంలో ఎంత మంది పుల్లయ్యలు లేరు! వాళ్లల్లో ఒకడు. ఆ పుల్లయ్యే పిడుగు పడ్డ తరువాత వేమన అయ్యాడు. ఆ వేమన మనకు కావాలి. మనకు ఇలాంటి పుల్లయ్యలే తరువాత వేమన్నలు అయిన వాళ్లు చాల మంది ఉన్నారు, ఒక మామూలు అబ్బాయి తేలుకుట్టిన తరువాత సత్యసాయిబాబా అయ్యాడు. ఒక మామూలు గొల్లవాడు కాళికాదేవితో నాలిక మీద వ్రాయించుకుని కాళిదాసు అయ్యాడు. ఒక మామూలు రాజ కుమారుడు రావి చెట్టు క్రింద కూర్చుని ఒక మెరుపు మెరిస్తే కళ్లు బైర్లు గమ్మి బుద్ధుడయ్యాడు. ఒక సామాన్యుడు లోకాతీత మానవుడుగా మారేటప్పుడు ప్రజలు ఆ మారడాన్ని సాధారణ ఘటనగా భావించరు. దానికొక దైవిక మహత్తును కల్పిస్తారు. అదే వేమనపట్ల కూడా జరిగింది. అందులో కూడా అనలులో జరిగిన కొంత యధార్ధముంటుంది. అది ప్రజలు వాళ్ల ఊహల్లో ఎంత మభ్యపెట్టి చెప్పినా దాయరు.

పూజారి చెప్పిన మాటల్లో ఒక యధార్థముంది. వేమన కొండవీటి నుంచి వచ్చినవాడట. ఆయన అన్న వెళ్లగొడితే తల్లితో వచ్చి నల్ల చెఱువు వద్ద సేద్యం చేసుకుంటూ ఉండేవాడట. ఇది మాత్రం ఖాయం. ఆయన రాజవంశం నుండి విరక్తుడయ్యే వచ్చాడో వెళ్ల గొడితే వచ్చాడో మనం చెప్పలేము గాని మొత్తం మీద రెడ్డి రాజ వంశీయుడే. 'వేమన వచనం' లో తండ్రి పేరు కుమరగిరి అని లేదు 'రెడ్డన్న' అని ఉన్నది అందువల్ల నమ్మశక్యంగా లేదని అనంతకృష్ణశర్మగారు అన్నారు. ఆత్మీయులెవరూ రాజునైనా మహారాజునైనా పేరుతో చెప్పుకోరు. మనం మన జామీందార్లకు రాజుల్ను ఏమని పిలుస్తాము! చిన్నాయన అని పెదనాయన అనీ చిన్నబాబు అని పెదబాబు అనీ పిలుస్తాము. శ్రీకృష్ణ దేవరాయలు తిమ్మరసును తిమ్మరసుగారూ అని పిలిచేవాడా? 'అప్పాజీ' అని పిలిచేవాడు. రెడ్డన్న కూడా అలాంటిదే కృష్ణదేవరాయల కాలమందలి ప్రబంధ కవులైతేనేమి లేమనను ఎందుకు ఎత్తుకోరు! వాళ్లు ఎంత పాండిత్యమున్న కవులైనా కవిత్వమున్న వాడిని చూచి భయపడ వలసే వస్తుంది. కవిత్వం కవిని భయపెడుతుంది. శిరోనమనం చేయిస్తుంది. 1581 లో నాగర ఖండం వ్రాసిన తురగా రామకవి 'శరభాంకు రాజశేఖరవేము' అని పొగిడాడు. ఈ వేము చేటల వేమయ్యగానీ బెలిదేవర వేమయ్యగానీ అయితే వాళ్లకు ఇలాంటి రాజశేఖర వేమువంటి విశేషణ ముందా, అయినా వాళ్లు వేమయ్యలే గాని వేమన్నలు కాదు. ఆంధ్రజాతికి తెలిసింది ఒకే వేమన. అందువల్లే ఎల్లనార్యుడు కూడా 'వేమన గీర్తించి విమలమతిని' అన్నాడు. కృష్ణదేవరాయల కాలంలోని ఎడపాటి ఎఱ్ఱా ప్రెగడ

'వినుతులొనర్తు నాంధ్ర సుకవి ప్రభునన్నయభట్టు దిక్కయ

జ్వను, శివదేవు, భాస్కరుని, జక్కన, నాచన సోము, సర్వదే

వుని భవ దూరు వేమునల పోతన'

అని సుకవి ప్రభుల్ను ఆస్తుతిలో ఎన్నుకొన్నాడుగాని, శివ భక్తుల్ని గాదు. వైష్ణవులు కల్లు ద్రాగి చెడిపోయారని వేమన వ్రాస్తే అలా చెడి పోయింది కృష్ణదేవరాయల తరువాతే, అప్పుడే వైష్ణవం ప్రబలి దిగజారి పోయింది. అప్పుడు కల్లు తాగితే తాగారేమోగని తొలి రోజుల్లో తాగి ఉండరని శర్మగారు అంటున్నారు. అంటే వాళ్లు కల్లు త్రాగడం 16వ 17వ శతాబ్దంలోనే అని. ఒక మతం ప్రజల్లో అన్ని ఉచ్ఛనీచాలు అనుభవించిన తరువాతే కవిత్వంలోకి సిద్ధాంత పరమైంది మొదట రావచ్చుగాని ప్రబంధ పరమైంది తరువాతనే వస్తుంది. వైష్ణవం కృష్ణదేవరాయలకు ముందే అన్నీ అనుభవించింది. మతం దిగజారినప్పుడే కల్లు త్రాగరు. భక్తి ఒక ప్రక్కన సాగుతూనే ఉంటుంది, కల్లు ఒక ప్రక్కన సాగుతూనే ఉంటుంది. దేవుడి ప్రక్కనే దయ్యముంటుంది. శైవం ప్రక్కనే వైష్ణవం ఉంది. అప్పుడే బసివిరాండ్రు అసలైన వాళ్లు ఉన్నారు. శర్మగారు చెప్పిన నకిలీ బసవి. రాండ్రనుగాదు వేమన చెప్పింది. తురకల్ను గురించి వేమన వ్రాశాడు. విజయనగర సామ్రాజ్యం పతనం అయిన తరువాతే ఆ శిధిలాల్ను చూచి వేమన వ్రాసి ఉంటాడని శర్మగారి అభిప్రాయం.

రాళ్లు పగలగొట్టి రాక్షస పుత్రులు

మాళ్లు నూళ్లు గలిగి మనిరి వేమ

ముసల్మానులు విజయ నగర రాజ్య విగ్రహాలనే పగలగొట్ట లేదు. వాళ్లు మన దేశానికి వచ్చినప్పటి నుండీ యీ పని చేస్తూనే ఉన్నారు. గజనీ మహమ్మద్ సోమనాధ దేవాలయం విరగ్గొట్టడం ఎవరికి తెలియదు!

షేకు సైదు మొగలు చెలగు పఠానులు

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

తురకల దొరతనము తొలుత జేసి
రాఁగ రాఁగ విడిచి రైతులై కొలిచిరి

ఈ పద్యంలో ముసల్మానుల పేరులన్నీ వచ్చినాయి. 'మొగలు పేరే వేమన కాలాన్ని కొండవీటి రెడ్ల కాలం నుంచి కొంచెం ఇవతలికి జరుపుతుంది. ఈ పద్యం వేమనదే అయితే ఆయన కాలం మొగలుల తరువాత 1530 లేక 1540 అని ఊహించవలసి వస్తుంది. అయినా ఆయన కబీరుకు చాలా చేరువ వాడే అయి ఉండాలి. కబీరు మరణం 1518లో. తతిమ్మా పద్యాలు ఎలా ఉన్నా ఈ క్రింది పద్యం మాత్రం వేమన మీద కబీరు ప్రభావం ఉన్నదన్న సంగతిని అద్దం పట్టి చూపుతుంది.

"కల్లుకిచ్చునట్లు చల్లకీయగలేరు" అని వేమన అన్నాడు. కబీరు 'పాలు పెరుగు తిరిగి తిరిగి అమ్మవలసి వస్తుంది. మద్యం మాత్రం కూర్చున్న చోటే అమ్ముడు పోతుంది' అన్నాడు. ఇంతకంటే భావ సామ్యం లేదు. ఇలాంటి భావం ఏ వొక్క కవికీ మాత్రమే వస్తుంది. పోతే కాశీ అయితేనేం, మక్కా అయితేనేం, రామ్ అయితేనేం, రహీమ్ అయితేనేం అని కబీరు చాలా చోట్ల అన్నాడు. వేమన కూడా.

"మక్కకు జననేల, మగుడ దారానేల
యేకమైన చిత్త మెందు గలదు
అన్నిట పరిపూర్ణమల్లా మహమ్మదు"

అన్నాడు. పర్యవసానమేమంటే కబీరు వేమన్నల తేడా దశాబ్దాలలోనే ఉండాలిగాని శతాబ్దాలు కా గూడదు. ముసల్మానులవిగాని హిందువులవిగానీ ఉత్థాన పతనాలు చరిత్ర గతిలో కాలం పొడుగూతూ వస్తున్నవి. వాటిని నిర్దిష్ట కాల ఘటితాలుగాచేసి వాదాన్ని సమర్థించుకోనవసరం లేదు. వేమన తన కాలంలో అంతకు ముందు జరిగినవీ విన్నవీ కన్నవీ వ్రాశాడు. కబీరూ అంతే. వాళ్లు సామాన్య కథనంలోనే చరిత్రనూ, సమాజాన్నీ తీసుకున్నారు. ప్రతి కవీ అలాగే వ్రాశాడు. ఆ పద్ధతి ప్రకారమే నడిచింది. శర్మగారు అన్నట్టు తురకల్ను గురించి వ్రాయడానికి 18వ శతాబ్దము వరకూ రానక్కర్లేదు. అల్లసాని పెద్దనగారు చంద్రుణ్ణి తురకల దైవంబవు' అన్నారు. 'గజపతులు, గండికోట శబ్దాలు వేమనలో వస్తే ఆయన 18వ శతాబ్దానికి దిగుతాడా! అసలు ఈ గజపతులూ గండికోట ఎప్పటివి? కృష్ణదేవరాయలకు ముందే గజపతులు లేక పోతే ఆయన వాళ్లతో యుద్ధాలు ఎలా చేశాడు! జన సామాన్యంలో ఉండే స్థితి గతుల్ని ఆఖరకు కారే చిల్లికుండకు గుడ్డ పెట్టే సంగతి కూడా వేమన్నకు తెలిసింది. అతడు రాజ వంశీయుడైతే ఇవన్నీ ఎలా తెలుస్తాయి అని అనంతకృష్ణశర్మగారు అంటారు. అంత ఉచ్చస్థితి నుండి వచ్చిన వాడికే ప్రజల స్థితి చప్పున అర్థమౌతుంది. మనస్సు ఒక్కసారి ఆఘాతాన్ని తిన్నట్టవుతుంది. బుద్ధుడూ, మహా వీరుడూ, భర్తృహరీ అందరూ ఇలా వచ్చిన వాళ్లే. మహా చక్రవర్తి అయిన శ్రీకృష్ణదేవరాయలే ఆముక్తమాల్యదలో ప్రజల దైనందిన స్థితిని చక్కగా వర్ణించడం మనకు తెలిసిందే. అలాగే శూద్రక మహారాజు, భద్రభూపతి. ఈ రాజులే ప్రజల జీవితాన్ని చక్కగా అందీయ గలిగి ఉన్నారు. <u>వేమనకు సోమశేఖరునకు గురువూ కావచ్చు, పోతన్నకు గురువూ కావచ్చు.</u> దీనిలో కల్పన ఏముంది? అసలు ప్రక్కన ఉన్న పోటీలను బట్టి కవిత్వం నిగ్గు తేలుతుంది. వేమనకు ప్రక్కన, రెండు బలమైన కవిత్వపు పోటీలు ఉన్నాయి. ఒక ప్రక్కన బద్దెన సుమతీ శతకం వ్రాస్తున్నాడు. రెండో ప్రక్కన పోతన భాగవతం వ్రాస్తున్నాడు. ఆ ఒత్తిడికి సమాధానమా అన్నట్టే వేమన పద్యాలు వ్రాశాడు.

అనంతకృష్ణశర్మగారు వేమన ఉనికిని గురించి అనవసరమైన శంకల్ను రేకెత్తించుకున్నారు "శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు కుమార గిరికి కుమారుడున్నట్లు శాసనాదుల వలన తెలియుచున్నది యనిరి. కాని యతడు రాజ్యమునకు రాలేదు. ఈ రాజ్యమునకు రాని కుమారుడే బైరాగుల సావాసమునబడి పోయిన మన వేమన్నయై యుండునాయను సందేహము కలుగుచున్నది" అని శర్మగారు వ్రాశారు. ఇక సందేహము వెలిబుచ్చనవసరమేముంది. కథ దొరుకుతుంది. శాసనాధారముంది. 'వేమన వచనం'లో తండ్రి పేరు 'రెడ్డన్న' అని ఉంటే అది అసలు పేరు ఎలాగూ కాదుగదా! ఇహ సందేహాలకు తావు లేదు. అసలు మన సాహిత్య చరిత్ర రచనల్లోనే ఒక విచిత్రం జరుగుతుంది. తిక్కన, పోతన, పెద్దన, తిమ్మన, జక్కన, మారన మొదలైన కవుల వివరాలు వాళ్లు ప్రసిద్ధులైనా కాకపోయినా వాళ్ల కుల గోత్రాలు శాఖలు ఉపశాఖలు తాతలు ముత్తాతల దగ్గర నుండి సవిస్తరంగా దొరుకుతున్నాయి. బద్దెన నన్నయభట్టు, రంగనాథుడు, హుళక్కి భాస్కరుడు పాల్కురికి సోమనాథుడు మన వేమన మొదలైనవాళ్లవి మాత్రం ఎంత ప్రయత్నించినా దొరకడం లేదు. వీటి వివరణా తాళపత్రగ్రంథాల్లో మొదళ్లనో చివళ్లనో ఉండి ఉంటుంది. ఇష్టంలేని వాళ్లు అవి లాగేసి ఉండవచ్చు. ఏముందీ! ముందు రెండు తాటాకులు లాగేస్తే ఈ అనంత సముద్రంలో ఇహ అతని పత్తా కూడా ఉండదు. వేమన గుడి వద్ద వేమన తల్లిదండ్రుల పేర్లు కూడా మారి ఉన్నాయట. మల్లమ్మ పేరు అచ్చమ్మగా మారి ఉండవచ్చు భార్యకూడా ఆది లక్ష్మమ్మ. ఎందుకంటే మల్లమ్మ ప్రజలు ఆమెను మామూలు మానవ మాత్రురాలుగా ఉంచదలుచుకోలేదేమో. ఆమెను ఆదిలక్ష్మిగా చేయదలచి ఆ పేరు పెట్టి ఉంటారు. ప్రజల మనస్తత్వం విచిత్రంగా ఉంటుంది. మానవుల్ని దేవతల్లాగానూ చేస్తారు. దేవతల్ను మానవుల్నిగానూ చేస్తారు. అందర్నీ తమ అనుభూతులు దగ్గరకూ తమ వేదనలూ, ఆవేశాలూ దగ్గరకు తెచ్చుకొనందే తృప్తి ఉండదు. అలా ఉంటేగాని నేటివిటీ ఫీలవరు. పరశురాముని తల్లి రేణుకాదేవి తెలంగాణా వారి పాటల్లో బతకమ్మ అయింది. మన గొబ్బెమ్మలు పార్వతమ్మలో గంగమ్మలో. మన వెంకమ్మలు, మంగమ్మలూ నాంచారమ్మలు పోలేరమ్మలూ వీళ్లంతా ఎవరు! ఎవరో పెద్ద దేవుళ్ల భార్యలే. మన దగ్గరకు వచ్చి మనంత వాళ్లయి పోయారు. రాముడు మన దేశంలో దశరథుని కుమారుడుగాని ప్రక్క దేశాల ఒక రామాయణంలో ఒక చిన్న రైతుబిడ్డ బుద్ధుడు ఒక కంసాలి పుత్రుడు. వీటిని చరిత్ర కాదని కొట్టి వేసేకంటే, వాటి వీటి పరిస్థితుల్ని గుర్తించాలి. నిప్పు ఉంటేగాని పొగరాదు. అసలు కథ ఏదో ఉంటుంది.

వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది. వాడని భాష వాడిపోతుంది

దానికి ప్రజలు కొంత పోగ కలుపుతారు. ఈ పోగ కూడా అబద్ధం కాదు. పోగతో పాటే నిప్పుకూడా. నిప్పు పోగా కలిపే నిప్పు. ప్రజలు ఒక యథార్థం చుట్టూ కొంత పోగను అల్లుతారు, కొన్ని అతిశయోక్తుల్ను కలుపుతారు. ఈ అతిశయోక్తులు కూడా బర్తిది గాదు. వాళ్ల భావన, వాళ్ల ఆవేశం. యధార్థం ప్రజల్ను ఒరసినప్పటి తాకిడి. ఆ యధార్థ వ్యక్తికి ఏర్పడిన కీర్తికాయమూ చరిత్ర కాయమూ వ్యావహారిక కాయమూ. ఈ అయదార్థము కూడా ఆ యదార్థానికి కాలం తయారు చేసిన ఒక యథార్థము. ఒర్తి కాగితాన్నే పది రూపాయలు అనుకు న్నాము. పది రూపాయలు అనుకోవడం కల్పనే. అయినా ఆ కాగితాన్ని ఆ పది రూపాయలనే కల్పన, లేకుండా తీసేసి చూడ గలమా! చూస్తే అది ఒర్తి కాగితమే అవుతుంది. దాన్ని పారవేస్తాము. కాని మనం పారవేయడం లేదు. ఆ ఒర్తి కాగితాన్ని, పది రూపాయల కల్పనతో కూడా కలుపుకుని జేబులో పెట్టుకుంటున్నాము. ఇది వొర్తి కాగితమే అయినా పది రూపాయల బరువు దాని మీద ఉన్నది అన్న సంగతి మరచిపో గూడదు. అలాగే ఈ కథల్ను కూడా గాలికి వదలి పెట్ట గూడదు. పుక్కిట కథఅని మనము ఏది అనుకుంటున్నామో దానిలో ప్రజలు ఉన్నారని గ్రహించాలి. ఈ పుక్కిట కథలు ఎంత అర్థ సత్యాలో ఈ చారిత్రక పరిశోధనలు కూడా అంతే అర్ధ సత్యాలు. 1428తోనే కొండవీటి రెడ్డి రాజ్యం అంతమైంది అని అసలు ఎవడు డేటు ఇచ్చాడు? ఒక రాజ్యం అంతమవడానికి గానీ పుట్టడానికి గానీ ఖచ్చితమైన ఒక డేటు ఉంటుందా! ఆంగ్లేయ సామ్రాజ్యం అసలు ఈ దేశంలో ఎప్పటి నుండీ ప్రారంభమైందో ఒక డేటు చెప్పమనండి. తూర్పు ఇండియా కంపెనీ వాళ్లు మన దేశానికి వచ్చినప్పటి నుండా క్లైవ్ ఫ్రెంచి వాళ్లను ఓడించినప్పటి నుండా? అసలు మనకు స్వాతంత్ర్యం వచ్చిందని ఎప్పటి నుండీ అని భావించాలి. ఇంటరిమ్ ప్రభుత్వం ఏర్పడినప్పుడా! నెహ్రూను ప్రధానిగా చేసిన ప్పుడా! రిపబ్లికుడే జరుపుకొన్నప్పుడా! కొంత మంది అయితే ఇప్పటికీ మన దేశానికి స్వాతంత్ర్యం రాలేదు అంటున్నారు అను కోండి. అసలు ఏమి జరుగుతుందంటే ఈ చరిత్రకారులు పరిశోధనలు చేసి చేసి విసుగు పుట్టి ఒక డేటు నిర్ణయిస్తారు. అది ఖచ్చితమైన గీటుగా దానికి అవతల ఉంది చీకటీ ఇవతల ఉంది వెలుతురూ అనుకుం టాము. ఒక రాజు తలకాయ తెగి ఇంకో రాజు గద్దె మీద కూర్చోగానే ఆ డేటు పెట్టి చరిత్రకారుడు మనకు చెప్పేస్తాడు అక్కడితో అతని రాజ్యం పోయింది. ఇతని రాజ్యం వచ్చింది అని. ఆ డేటు గుర్తు పెట్టుకోవడానికి బాగానే ఉంటుందిగాని అదే దాని అంతం కాదు. బండి ఆగుతూ వస్తుంది. చీకటి పోయి వెలుగు వస్తుంది. కాని ఒక్కసారి రాదు. ముందు సంజె వెలుతురు వస్తుంది. ఉదయానికి ఇంకొంచెం వస్తుంది. మధ్యాహ్నానికి గాని పట్ట పగలు వెలుతురు రాదు. సృష్టిలో అన్నీ ఇలా ప్రవాహంలాగా సాగుతుండగా ఒక రాజ్యం అంతమవటం పుట్టడం దభీమని ఒక్క వేటుతో జరుగుతుందని ఎలా అనుకుంటాము? మొగలాయి రాజ్యం పోయిందనుకున్న తరువాత చిన్న చిన్న నవాబులు మొఖాసాదార్లు ఉన్నత వర్గాల రూపంలో ఇప్పుడూ ఉన్నది. అలాగే రెడ్డి రాజ్యానికీ ఏ 1428 అనో. ఒక డేటు పెట్టుకోలేము. ప్రధానరాజు పోయినా సామంత రాజుల రూపంలోనో పాలెగాండ్ర రూపంలోనో కొంత నడిచి ఉంటుంది. రాజవంశావళిలో మనకు కనపడే రాజులందరూ వాళ్ల పుత్రులే కాదు. అప్పుడు ఆ వరసలో గద్దెక్కిన మంత్రి అయి ఉండవచ్చు, వాడిని చంపిన బానిసా అయి ఉండవచ్చు. కాని ఆ లిస్టులో వాళ్లను చూచి వాళ్ల వంశావళీ అనుకుంటాము. అందువల్ల రెడ్డి రాజ్యం 1428 కే గాక ఇంకా కొంత ఇవతలకు కూడా వచ్చి ఉంటుందనీ, ఆ రాజుల్లో కొడుకుగాని లేక అలాంటి రాజరికపు వారసుడో మన కవి వేమన అయి ఉంటాడని అతణ్ణి 1540,1550 ప్రాంతం వాడుగా భావించవచ్చుననీ నా ఊహ! పల్లెముత్తడని వేమన ఒక దాన శీలుణ్ణి పేర్కొన్నాడు. 17వ శతాబ్దంలో ఉన్న గుంటుపల్లి ముత్తన వేరొకడు కావచ్చు. వేమన కాలంలో ఉన్న పల్లే ముత్తణ్ణి ఆదర్శంగా పెట్టుకుని దాన ధర్మాలు చేసి ఈ గుంటుపల్లాయన కూడా అపరముత్తడుగా కీర్తి పొందవచ్చు. ఇలా ఎంతైనా చెప్పుక పోవచ్చు. ఒక బరువుంది. ఒక మనిషికి ఎంత బరువుందో అది కాల వైశాల్యం చెబుతుంది. వేమన బరువును బట్టి చూస్తే అతడు నిన్నమొన్నటి వాడు కాదు చాలా కాలపు బరువు వాడుగా కనపడుతున్నాడు. పాశ్చాత్యులు ఎంత సత్యాన్వేషకులైనా వాళ్ల స్వార్థం వాళ్ళకుంది. మన వాళ్లు ఎంత గొప్పవి కనిపెట్టినా వాళ్లు ఇప్పటి కాలం వాళ్లక్రిందే జమకడతారు. ముందు మేము కనిపెట్టాలి, తరువాత వాళ్లు కనిపెట్టిన వాళ్లుగా ఉండాలని వాళ్ల భావన. అందువల్లే మన అతి ప్రాచీనుల్ని కూడా వీళ్ళు ఇటీవలి కాలం దగ్గరకు తేవాలని చూస్తుంటారు. వీళ్లకంటే ఇంకా దగ్గరకు తెస్తే మనం ఇంకా గొప్ప వాళ్లమవుతాము అని మన పండితులు ఇంకా చిలిపి పరిశోధనలు చేస్తుంటారు. కాలం వెలుగే వేమనను 16వ శతాబ్దం వాడు అంటే బ్రౌను 17వ శతాబ్దం వాడు అన్నాడు. మన అనంతకృష్ణశర్మగారు 18వ శతాబ్దం వాడు అనే అన్నారు. పోయిపోయి ఇది వేమన్నగారి అబ్బాయితో మేము మాట్లాడాము అనే వరకు కూడా రావచ్చు. దీన్ని ఇంతటితో వదిలేద్దాం... పుక్కిట కథలు, చరిత్రలు వృత్తాంతాలూ అన్నీ ఒకే విరాట్ చరిత్ర మానవునకు విడదీయరాని అంగాలు అనుకుంటేనే మన అన్వేషకాలు సార్థకమవుతాయి.

చార్వాకులూ పరం లేదన్నారు. వేమనా పరం లేదన్నాడు. కాని ఇద్దరి అర్థాలు వేరు. పరం లేక పోయినా వేమనకు పరతత్వం ఉంది. పరలోకాలు లేవని మాత్రమే. చార్వాకులు పరం లేదన్నది ఎందుకు! ఇహ సుఖాన్ని బాగా అనుభవించ దానికి. వేమన్న పరం లేదనన్నది ఎందుకు. ఇహ సుఖాన్ని పూర్తిగా విడిచి పరానికి పరంగా ఉన్నా సుఖాన్ని పొందడానికి. తన పని తాను చేసుకోవాలని గాంధీ అన్నాడు, లోభివాడూ అంటాడు. ఇద్దరి అర్థాలూ వేరు. ఒక మహా స్వప్నాన్ని వేమన మన కన్నుల ముందు పెట్టాడు. బ్రహ్మ చాపకూటి భోజనం పెట్టవచ్చుగాని వేమన ఉర్వి వాళ్ళకెల్లా ఒక కంచం పెడతానంటున్నాడు.

> ఉర్వి వారికెల్ల నొక్క కంచము బెట్టి
> పొత్తు గుడిపి కులము పొలియజేసి
> తలను జేయిపెట్టి తగనమ్మ జెప్పరా'

అప్పుడు ఇండియా అమెరికా చైనా జపాను అన్నీ దేశాల్లో పండే గోధుమ పిండితో ఒక పెద్ద రొట్టె చేసి అది ఏ

హిమాలయ పర్వతంలో మీదో పెట్టుక తిన వలసి వస్తుంది. అది ఎంగిళ్లు లేని కంచం. కులాలేమిట నలుపూ తెలుపూ అన్న భేదం కూడా లేకుండా అందరూ ఏకరక్త బాంధ వ్యాన్ని భోంచేసి మానవత్వంతో చేతులు కడు క్కునే అంత విశాలమైన విందు ఆహ్వానం.

కొందరు తెలిసినవాళ్ళూ తెలియని వాళ్లూ కూడా వేమనను భౌతికవాదిగా నాస్తి కునిగా చిత్రించ ప్రయత్నం చేస్తున్నారు. ఇది చాలా ఘోరం. ఒక కవి పద్యాలకు వ్యాఖ్యానం చేసేటప్పుడు అతని ఆదర్శం, సిద్ధాంతం, ఫిలాసఫీ పూర్తిగా తెలిసి ఉండాలి. ఆరుద్ర గారో ఎవరో ఈయన సిద్ధాంతం చార్వాకుల భౌతిక వాదంగా అర్థం చేసుకున్నారు. ఇది పొరపాటు 'తచ్చైతన్య విశిష్ట దేహ పవ ఆత్మ' అని లోకాయతులు చాటి చెప్పారు. దేహాన్ని మించిన ఆత్మ లేదని వాళ్లు అంటే అనవచ్చు గాని ఆరుద్రగారు

దేవుడనగ వేరె దేశమందున్నాడె

దేహితోడ కూడి దేహమందు

వాహనంబు నెక్కి వడి దోలుచున్నాడు

అన్నదానికి దేహాన్ని మించిన ఆత్మ లేదని వేమనగారు కూడా విశ్వసిస్తారు' అన్నారు. ఇది చాల తప్పు దేవుణ్ణి వేమన ఒప్పుకో లేదుగాని పరమాత్మను ఒప్పుకు న్నాడు దేవుడ మాట వాడితే అది పరమాత్మ గానే భావించాలి. దేవుడు వేరే లేడుగాని ఈ దేహితోనే ఉండి దేహిని నడుపుతున్నాడు. పరము తెలియని వాడు బాపడు కాదు, అనీ కామిగానివాడు మోక్షగామికాదు అని అసలు పరతత్వాన్ని చేరడానికే జీవితమంతా ధారవోసిన వేమనను పట్టుకుని ఆయనకు దేహం కంటే పరంగా లేదని చెపితే ఏమైనా అర్థం ఉందా! భస్మాంతం శరీరం ఇది నా కలల కథనం. శరీరాంతానికి ఇంకో అంతం ఉంది. ఇదే వేమన పరమార్థం. మనం నాస్తికులమైతే కావచ్చు, నాస్తికత్వ ప్రేరణను వేమననుండి పొందవచ్చుగాని వేమనను నాస్తికుణ్ణి చేయగూడదు.

(పూర్తయింది.)

మోదుకూరు (గుంటూరు జిల్లా) లోని 'వేమన జయంతి ఉత్సవ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కీ.శే. మొవ్వా వీరారెడ్డిగారు వేమన గురించిన విలువైన వ్యాసాలను పలువురు ప్రముఖులచే వ్రాయించి, వాటినొక గ్రంథంగా ప్రచురించాలని 20 ఏళ్ళ క్రితం సంకల్పించారు. ఆయన 1995లో కనుమరుగు కావడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. తర్వాత ఆయన మనుమడు, విజయవాడలోని ఆంధ్ర లొయోలా కళాశాలలో చరిత్ర శాఖ అధ్యాపకులుగా పనిచేస్తున్న డా॥ మొవ్వా శ్రీనివాసరెడ్డి ఆ వ్యాసాలను 2006లో అందజేశారు. వీటిలో కొన్నిటిని 'నడుస్తున్న చరిత్రలో ప్రకటిం చాము. వేమన గురించిన ఈ రచనను ఇప్పుడు ప్రచురింగలిగినందుకు ఆనందంగా ఉంది. వేమన జయంతి ఉత్సవ సంఘ కృషిని కొనసాగిస్తూ తాతగారి సంకల్పాన్ని ఆచరణలో పెడుతున్న మొవ్వా శ్రీనివాసరెడ్డి గారికి అభినందనలు.

– సంపాదకుడు

(37 వ పుట తరువాయి...)

పలు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భారత దేశంలో మహిళను 'అర్ధాంగి' అని గౌరవిస్తాం. అంటే పురుషుల బాధ్యతలు, వ్యవహారాలు అన్నింటిలో ఆమెకు సగభాగం ఉంది. అన్ని వ్యవహారాలలో పాల్గొనే స్వాతంత్ర్యం ఆమెకు ఉంది. వివాహం కూడా లేకుండా జ్ఞాన సముపార్జనలో గడిపే అవకాశం కూడా ఉండేది. అయితే కాలక్రమంలో పలు వికృతులు ప్రవేశించి పరిస్థితులు మారాయి. అందుకు పలు బాహ్య కారణాలు కూడా తోడై ఉండవచ్చు. మన రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించినా ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు.

రాజా రామమోహన్ రాయ్, అనిబిసెంట్, సరోజినీ నాయుడు, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం వంటి వారు మహిళా వికాసం కోసం విశేషంగా కృషి చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళలు క్రియాశీలకంగా పాల్గొనే విధంగా చేయడం కోసం మహాత్మా గాంధీ విశేషంగా ప్రయత్నం చేశారు. ఇటువంటి ప్రయత్నాలు స్వాతంత్ర్యం అనంతరం కూడా తగురీతిలో కొనసాగుతున్నా మొత్తం మీద ఆశించిన ప్రగతి సాధించలేక పోతున్నాము.


ప్రపంచ ఆర్థిక వేదిక 2005లో జరిగిపిన స్త్రీ–పురుష అంతరం అధ్యయనంలో 58 దేశాలలో భారత్ కు 53వ స్థానం లభించగా, రాజకీయ సాధికారకతలో మాత్రం 24వ స్థానం లభించింది. అయితే ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం రూపొందించే మానవ అభివృద్ధి సూచికలలో మాత్రం మహిళల విషయంలో భారత్ కు చాలా తక్కువ స్థానం లభిస్తున్నది. 1995లో 99వ స్థానంలో ఉండగా, 2007–08 నాటికి 113 స్థానానికి పడిపోయింది.

గృహంలో నిర్ణయాలు తీసుకోవడంలో పాల్గొనడం మహిళా అభివృద్ధికి కీలకమైన సంకేతంగా భావిస్తూ ఉంటాము. భారత దేశంలో కేవలం 37 శాతం మంది మహిళలు మాత్రమే ఆ విధంగా వ్యక్తిగతంగానో, కుటుంబపరంగానో పాల్గొంటున్నట్లు వెల్లడి అవుతున్నది. 43 శాతం మంది పాక్షికంగా పాల్గొంటున్నా, 21 శాతం మంది అసలు పాల్గొనడం లేదు.

ఒంటరిగా బయటకు వెళ్లే స్వేచ్ఛ ఎంతమంది మహిళలకు ఉన్నదనెడిది ప్రశ్న. కేవలం సగం మంది మాత్రమే ఒంటరిగా మార్కెట్ కో, ఆసుపత్రులకో వెళ్లగలుగు తున్నారు. గ్రామం/పట్టణం విడిచి మరో చోటకు ఒంటరిగా ప్రయాణం చేయగలుగుతున్నారు. ఈ విధంగా మహిళా సాధికారికతకు సంబంధించిన అనేక అంశాలను నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ప్రభుత్వాలు వారిని ఓటర్లుగా చూస్తూ కొన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుపుతున్నా వారి సాధికారికత విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. అందుకు అవసరమైన రాజకీయ సంసిద్ధతను ప్రదర్శించడం లేదు.

డా॥ అప్పిరెడ్డిహరినాథరెడ్డి
9963917187

తొలి తెలుగు వైద్యగ్రంథం-నవనాథ సిద్ధసారం



చరకసంహిత, సుశ్రుసంహిత, కాశ్యపసంహిత, హారీత సంహిత, రసరత్న సముచ్చయం, శతశ్లోకి, కక్షపుతంత్రం, రసరత్నా కరం ఇలా అనేక భారతీయ ఆయుర్వేద గ్రంథాలు సంస్కృతంలో వెలువడినాయి. తొలి తెలుగు గ్రంథంగా తెలుగువారి సిద్ధవైద్య సాంప్రదాయంలో 'నవనాథ సిద్ధసారము' అనే గ్రంథాన్ని రాయసంపేరయ కవి పదిహేనవ శతాబ్దంలో రాశారు. దక్కన్ ఆర్కియాలజికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు, ప్రసిద్ధ పరిశోధకుడు కుర్రా జితేంద్రబాబు 2012లో ఈ గ్రంథం అనేక ప్రతులను పరి శోధించి సంశోధిత ప్రతిని వెలువరించారు.

ఆయుర్వేద వైద్యంలో మూలికావైద్యం, సిద్ధవైద్యం అని రెండు భాగాలు. మూలికా వైద్యంలో కషాయ, తైల, ఘృత, లేహ్య, గుటిక, ఆసవ, అరిష్ట రూపాలలో ఔషధాల ప్రయోగం ఉంటుంది. సిద్ధ వైద్యంలో రసగంధకాది ఖనిజాలు, స్వర్ణరజితాది. లోహాలు, వజ్రముక్తాది రత్నాలు, వత్సనాభి మొదలగు విషయములను శుద్ధిచేసి వీటి భస్మాలను, సింధూరాలను, ఖజ్జలీ ఔషధాలను ఈ విధానంలో ప్రయోగిస్తారు. ఉన్నతవర్గాల వారు ఆయుర్వేదాన్ని బ్రాహ్మి సాంప్రదా యంలో అభివృద్ధిచేయగా, ఇతరులు శైవసాంప్రదాయంలో అభివృద్ధి చేశారు. ఈ శైవ సాంప్రదాయంలోనే సిద్ధవైద్య సాంప్రదాయం ప్రారంభమైంది. తెలుగువారి సిద్ధవైద్య సాంప్రదాయానికి క్రీ.శ.9వ శతాబ్దంలోని సిద్ధనాగార్జునుడు మూలకారకుడు. నాగార్జున కొండ ప్రాంతంలోని ఏలేశ్వరంలో రసాయన పరిశోధనలుచేసి, పాదరసం కనుగొన్నాడు. ఆయుర్వేద వైద్యంలో రసశాస్త్రాన్ని మిళితం చేశాడు కేవలం వృక్షసంబంధ మూలికలతో సాగే ఆయుర్వేదం రస, ఉపరసాలతో, గంధకం తదితర లోహాలతో ప్రయోగించి సిద్ధవైద్యం గా ఆవిష్కరించాడు. సిద్ధనాగార్జునుడు లోహశాస్త్రం, రసరత్నాకరము, కచ్ఛపుటంత్రము, ఆరోగ్యమంజరి, యోగసారము, రసేంద్ర మంగ శము, రతి శాస్త్రము, రసకచ్ఛపుటము, సిద్ధనాగార్జునీయము తదితర గ్రంథాలను రాశాడు. గోరకనాథుడు, మస్తేంద్రనాథుడు తదితరులతో పాటు, వాగ్భటుడురాసిన 'రసరత్న సముచ్ఛయం' గ్రంథంలో ఇరవై ఏడు మంది సిద్ధవైద్యుల వివరాలు కనిపిస్తాయి. ఈ నాథ సాంప్ర దాయం గురుపరంపరనే గౌరన 'నవనాథచరిత్ర' లో తెలిపాడు.

తెలుగునేల పై ప్రారంభమైన సిద్ధవైద్య సాంప్రదాయం నేప థ్యంగా నిత్యానాథుడు తన ముందుతరం వారి ఈశ్వరోక్తరసారవం, రసయోగం, రసదీపిక గ్రంథాలు, నాగార్జున, కాపాలిక, చర్పట, సిద్ధుల రసతంత్ర అంశాలతో పాటు ఇంకా అనేక మంది సిద్ధులు చెప్పిన అంశాల ఆధారంగా సంస్కృతంలో 'రసరత్నాకరం' గ్రంథం రాశాడు. రస, రసేంద్ర, రసాయన, వాద, మంత్రం అనే అయిదు ఖండాలుగా ఈ గ్రంథం ఉంది. ఇతని అనంతరం సిద్ధసాంప్రదా యంలో శ్రీనాథ వైద్యపండితుడు 'పరహితసంహిత' శ్రీకంఠ శివ పండితుడు 'ప్రయోగరత్నావళి' తదితర సంస్కృత గ్రందాలు రాశారు. సంస్కృతంలో భోజుడు రాసిన 'చారుచర్య' గ్రంథానికి తెలుగులో పద్యరూపకంగా 1350 కాలంలో అప్పనమంత్రి అనువాదం చేశాడు. ఇది తెలుగులో తొలి అనువాద వైద్యం గ్రంథంగా నిలుస్తుంది.

15వ శతాబ్దం ముందుదాకా వైద్య గ్రంథాలు సంస్కృతంలోనే వెలు వడినాయి. 15వ శతాబ్దం నుండి తెలుగులో వైద్యగ్రంథాలు స్వతంత్రంగా వెలువడటం ప్రారంభమైంది. తెలుగువారి సిద్ధవైద్య సాంప్రదాయ విధానాలను క్రోడీకరించి స్వతంత్ర గ్రంథంగా రాయసం పేరయ్య 'నవనాథ సిద్ధసారము'ను రాశాడు. హరిసతగోత్రులు భీమన గురవమ్మలకు, కొండవీడుకు పశ్చిమాన గల ఇర్లపాడు గ్రామంలో పేరయ జన్మించాడు. వీరి పూర్వికులు గొప్ప వైద్యులుగా ఉండేవారు. గజపతుల విజయనగర రాజుల సత్కారాలు పొందారు.

వ్యాధులు వాటి ఔషధాల గురించి వైద్యులు ప్రజలందరికి తెలిసే విధంగా వైద్యగ్రంథం రాయటం ధర్మమని పేరయ భావించాడు. ఇదే విషయాన్ని గ్రంథారంభంలో ...

కం॥ నానాముఖముల వ్యాధులు
మానవులకు జెందు గాని మంత్రౌషధముల్
గానరు సంస్కృతమగుటను
దానిన్ దెనుగున రచించు ధర్మార్థముగన్...అని పేర్కొన్నాడు.

సంస్కృత భూయిష్టంగా కేవలం పండితులకు మాత్రమే అర్థమయ్యేలా రాయటం ఆరోజులలో గౌరవంగా భావించేవారు నిత్యం ప్రజలకు అవసరమైన వైద్యసంబంధమైన అంశాలు ఉపయోగపడాలంటే వారి వ్యావహారంలోని తెలుగు భాషలో రాయటం అవసరమని దృఢమైన అభిప్రాయం పేరయకు ఉందని క్రిందిపద్యం ద్వారా తెలుస్తుంది.

గీ॥ సంస్కృతము నూటికొకడైన చదువలేడు
తెనుగు నేనరుండైనను తెలియగలడు
వైద్యగ్రంథంబు తెనిగించి వరుసతోడ
నాకు నిమ్మని పల్కెనే నప్పు డలరి...

అని సూటిగా తన అభిప్రాయాన్ని తెలిపాడు.

కం॥ జనలోకవశీకరమును
ఘనకీర్తియును సుకృతంబు కలుషాపహమున్
వినయమును గామ్యసిద్ధియు
గన నీకృతి యొకటి చాలు గాదేమిటికిన్...

అని ప్రజలకు ఉపయోగకరమైన ఒక్క కృతి రాసినా చాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

తెలుగుభాషలో గ్రంథాలు రాసేవారిని తక్కువ చూపు చేసేవారు కూడా ఉండవచ్చు. అలాంటి వారికి ...

గీ ॥ సుకవిజనముల కెల్లను సొరది మ్రొక్కి
కుకవిశునకంబు జిహ్వల కొఱ్ఱు మొత్తి
కొంత తెనుగున వైద్యంబు గూర్చువాడ
వరుస శ్రీరాముడిచ్చినవాక్యములను...

అని ఘాటుగా సమాధానం ఇస్తాడు.

తన పూర్వీకుల నుండి పరంపరగా వస్తున్న నవనాథ సిద్ధ క్రియలు గల వైద్యసారమనే ఈ గ్రంథంలో అష్టస్థానపరీక్షలు, ద్రవ్యశుద్ధి, రసాయోగ కషాయంబులు, తైల, లేహ్య ఘృత, చూర్ణంబులు, వ్యాధులు, వైద్యవిధానం తదితరాలను క్రమపద్ధతిగా తెలియజేస్తానని గ్రంథారంభంలో పేర్కొన్నాడు.

దేహపరీక్ష సందర్భంగా రాసిన ఒక పద్యంలో...

ఆ.వె॥ వాతమైన కృష్ణ వర్ణంబుతో నుండు
పైత్యరోగి యెఱ్ఱ బారియుండు
శ్లేష్మరోగి యుండు శ్వేతవర్ణంబున
ద్వంద్వరోగి కిన్ని దొరసి యుండు...

అని దేహవర్ణాలలో వచ్చే మార్పుల ఆధారంగా వివిధ రోగాలను గుర్తించడాన్ని తెలియజేస్తాడు.

బంగారు శుద్ధి విధానాన్ని తెలియజేస్తూ...

కం॥ బంగారు నె మంటను
సంగతిగా బొదిగి యార్చి సరసముతోడన్
అంగారముపై గాల్చిన
రంగుగ శుద్ధగును భద్రరామ నృపాలా!...

అని వివరిస్తాడు. పుండ్లకు అవసరమైన ఔషధాన్ని సూచిస్తూ...

అ.వె॥ రసము గంధకంబు రాగియు గుగ్గిలం
బమరు నల్లతుత్తు మామిదంబు
వండి పూయజను వరపుసిరికె మాని
కాంచనంబు ఛాయ గలిగి యుండు...

అని తెలియజేస్తాడు. నాగుపాము విషమునకు సంబంధించి ఔషధాన్ని గురించి..

అ.వె॥ తుత్తియాకు పచ్చిదొనర మెత్తగ నూరి
ఉసిరికాయపాటి నెసంగు గుళిగె
జొన్నకలిని త్రాగ పన్నగ విషశాంతి
యగును వెయ్యి వేల యయ్యలార ...

అ.వె॥ ఎఱ్ఱజొన్నకూడు నెఱయ మజ్జిగ గల్పి
త్రాగవలయు సర్పదష్టులెల్ల
భయము లేదు తెలియ బలికితి నీ క్రియ
చేసి కీర్తి గొనుడి సిద్ధమతము...

అని వివరించాడు. సర్వరోగ కషాయాన్ని గురించి వివరిస్తూ...

సీ॥ పంచకోలంబులు పాఠవేళ్లను తెల్ల
గలిజేరు వేళ్లును కరక నేల
వేము వెంపలివేళ్లు వీరమోలుగు చెక్క
నమలి నారాగా నలియ బొడిచి
అష్టావశేషంబు అలర క్వా (క్వో)థము దించి
పంచలవణములు పరగ గలిపి
నూరి ఉండలు చేసి నొనర క్వా(క్వో)థంబున
గొనిన శూలలు క్షయల్ గుల్మ (ములును)

(తరువాయి 47వ పుటలో...)

భాష లేకపోతే భావం లేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

సన్నిధానం నరసింహశర్మ
9292055531

ఆదర్శ జీవనంతో అందగించిన చిత్రనటుడు రంగనాథ్.



అందరికీ ధైర్యం చెప్పే సినీనటుడు రంగనాథ్ ఎందుకో పాపం తాను ధైర్యం కోల్పోయి 2015 డిశంబరు 19వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. వేలకొలది అభిమానులకు విభ్రాంతిని కలుగజేసి కలచి వేసిన సంఘటన అది. నా వంటి మిత్రులకు మరింత బాధాకర వార్త అయి హృదయాలను తొలిచేసింది. ఆయన మృతి చెంది మొన్నటి డిశంబరుకి అప్పుడే మూడేళ్ళై పోయింది.

రంగనాథ్ మదరాసులో 1949 జూలై 17న తిరుమల సుందరరాజ్, జానకి తండ్రి తల్లులకు పుట్టారు. శ్రీ వేంకటేశ్వర విద్యాలయం నుండి గ్రాడ్యుఏషన్ పట్టా చేపట్టారు. రాజమండ్రిలో రైల్వేశాఖలో టిక్కెట్టు కలెక్టరుగా ఉద్యోగించారు.

పొడగరి, అందగాడు, నిగర్వి, సాహిత్య ప్రియుడు, కవి. స్నేహితులకు కులాసా కబుర్లతో విందు చేసే వ్యక్తి – ఇన్ని ఆయనలో ఉన్నా సహజమైన ప్రేమాభిమానాలు ఉండి అందరినీ అభిమానించే నూటికి నూరు పాళ్ళ మనిషిగా ఆయన ఉన్నతుడు. అరవై ఆరేళ్ళకే నూరేళ్ళు నిండి పోవడం జరిగింది. భార్య తిరుమల చైతన్య ; ఇద్దరు కుమార్తెలు ఇంకా కుమారుడు. రంగనాథ్ నాటకాల పోటీల్లో పాల్గొనేవాడు, నటనారంగంలో ఉన్నత స్థానానికి శ్రమించి వెళ్ళాడు.

గౌతమీ గ్రంథాలయానికి తరచు వచ్చేవారు కాదు ఎప్పుడైనా వచ్చేవారు, మా ఇంటికిమాత్రం తరచు రావడం వుండేది. రాజమండ్రిలో మూడణాలన్నర టాకీసుగా పేరొందిన హనుమాన్ టాకీసు తరువాత జయశ్రీ టాకీసుగా మార్పు చెందింది. ఆ టాకీసు కార్యాలయంలో ఎ.వి.రమణారావుగారిలో కళాంశాలు మాట్లాడేవారు. తరువాత ఆ టాకీసులో టిక్కెట్లు అమ్మే ధవళేశ్వరం నివాసి బాబూరావు, కె.కె. సంజీవరావు నేను, రంగనాథ్ గారు కలసి టాకీసు ఎదురుగా గల ఖాళీ స్థలంలో కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకునే వాళ్లం. టాకీసు నుండి పాటలు వినపడేవి. వినేవాళ్ళం. చిన్నచిన్న కవితలు రాసేవారు, రంగనాథ్.

'జీవితాలు సుధామధుర పూరితాలు
జీవితాలు వ్యధాకథల అఖాతాలు' అని నేను రాసిన కవి వాక్యాలు ఆయన చెప్పినప్పుడు కళాశాల రోజులు గుర్తుకు వచ్చేది. కళాశాల విద్యార్థిగా నేను కొన్ని ప్రేమ కవితలు రాశానన్నది రంగనాథ్ వంటి తక్కువ మందికి తెలుసు. మొదటి నుండీ ఆయన సౌందర్యారాధకుడు, మరి ప్రేమ కవితల్ని ఆస్వాదించకుండా ఎలా వుంటారు?

రాజమండ్రిలో టి.సి.గా ఆయన వుండగా సావిత్రి మూగ మనసులు సినిమా తమిళంలో ప్రాప్తం పేర తీశారు. రంగనాథ్‌కు సినిమా నటనలో అవకాశ ప్రాప్తంకి అప్రాప్తమే నేపథ్యం వహించింది.

మదరాసు నుండి శివాజీగణేశన్, వంబియార్, ఎస్.వి. రంగారావు వంటి నటులు గోదావరీ తీర తమిళం మూగ మనసులు దృశ్యీకరణకు వస్తే రాజమండ్రి స్టేషనులో దిగవలసిందే కదా వారికి పూర్ణా పిక్చర్సువారు స్వాగతించి తోడుకు పోవాలి. వారిలో రంగనాథ్ ప్రియమిత్రులు కె.కె. సంజీవరావు వగైరా వున్నారు. వారితో రంగనాథ్ వుండేవారు.

సావిత్రి కార్యదర్శి నాగలింగంగారికి రంగనాథ్ చలన చిత్ర నటనాసక్తి తెలిపితే పొడుగు, రూపం అన్నీ బాగానే వున్నాయి. అయితే గళ స్వర పరీక్ష అవసరం అన్నారు. వెంటనే రైళ్ళ బళ్ళ రాకపోక ప్రకటనలు రైల్వే మైకులో చదివించారు. ఆ విధంగా రంగనాథ్ గొంతు విన్న నాగలింగం గొంతుకూడా తగినదే మదరాసుకు రండి అన్నారు రంగనాథ్‌గారితో. సావిత్రి వింత సంసారంలో శోభన్‌బాబు నటించ వలసి వుంది. కాని ఆ చిత్రంలో మహిళా ప్రాధాన్యమే వుండి హీరోగా తన పాత్రకు ప్రాధాన్యముండదని శోభన్‌బాబు అంగీకరించలేదు. దానిలో రంగనాథ్‌కు చిన్న పాత్రకు అవకాశం వచ్చింది.

రాజమండ్రిలో అప్సరా టాకీసులో ఆ సినిమా రంగనాథ్ కె.కె. సంజీవరావు బాబూరావువంటి మిత్రులతో చూశారు. రంగనాథ్ అదిగో సావిత్రి అని చెబుతుండగానే ఆ పాత్ర నటన అయిపోయింది. తరువాత మదరాసులో ఎన్నో చిత్రాలలో ఆయన నటించి పేరు పొందారు.

ఇంచుమించు ఆయన మొదటి సినిమా చందన గా చెప్పుకోవచ్చు. ఆ సినిమాను రాజమండ్రిలో లక్ష్మీ టాకీసులో చూస్తున్నప్పుడు మన రంగనాథేనా ఇంత పెద్ద నటుడయ్యాడని చెప్పలేనంత ఆనందానికి లోనయ్యాను.

మదరాసు నుండి చలన చిత్ర పరిశ్రమ హైదరాబాదు విచ్చేసింది. రంగనాథ్ ఆ సందర్భంలో తామూ మిగిలిన వారిలాగే హైదరాబాదు వచ్చారు. చివరలో ఆయన హైదరాబాదు అశోక్

నగర్‌లో ఆంధ్రాకేఫ్ సమీపంలో నివాసముండేవారు.

మదరాసులో ఆరుద్రగారు ఏర్పాటుచేసిన సి.పి.బ్రౌను వసంతోత్సవాలకు సభలకు ఆయన హాజరయ్యేవారు. 'జయజయ నటరాజా! సత్కళా హృదయతేజా!' అనే శివస్తుతి పాట రంగనాథే వ్రాయించారు. ఎవరైనా కథలు పత్రికల్లో పడితే చెప్పుకుంటారు. ఆయన తన ఫలానా కథ ఫలానా పత్రికనుండి తిరిగి వచ్చిందని సాదాసీదాగా చెప్పుకునేవారు. రెండు స్వీయ కవితా సంపుటాలు వెలువరించారు. ఆ సంపుటాల్లో కవిత్వం కంటే స్వీకృత రచనా వస్తువులు బాగుండేవి. ప్రగతిశీలక భావాలుండేవి. మూఢాచారాలను విమర్శించడం వుండేది. ఆరుద్ర లేఖలు అవే సన్నిధానం నరసింహశర్మకు రాసినవి అవే నా పుస్తక ఆవిష్కరణ సభలో స్నేహితుడిగా రంగనాథ్ నాపై మాట్లాడారు. ఆ సభలో ఆయన తానెప్పుడో కె.ఆర్. విజయ సౌందర్యంపై రాసిన కవితను చదువుతానన్నారు. తిరుమలరావుగారు, సతీష్ చందర్ వంటి సీరియస్ వ్యక్తులున్న ఆ సభలో ఆ కవితను చదివింపజేశాం. అందరూ కరతాళ ధ్వనులు చేశారు.

ఆయన భార్య మెట్ల మీద నుండి పడిపోయి మంచం పట్టి చాలానాళ్లు బాధపడ్డారు.ఆ సందర్భంలో భార్య ప్రేమికునిగా రంగనాథ్ సేవల్ని పత్రికలు సైతం మెచ్చుకున్నాయి. భార్యను ఒక తల్లిగా, ఒక తండ్రిగా, ఒక భర్తగా అనేక రకాల సేవల్ని అందించారు. నిజానికి భార్యను దేవతగా చూసకున్న ఘనత ఆయనది.

జీవన సత్యాలను చిన్న చిన్న వాక్యాలలో గంభీరంగా, చమత్కారంగా చెప్పడం ఆయనకు అలవాటు.

ఓసారి అన్నారు -

సన్నిధానంగారూ! దరిద్రులంటే ఎక్కడో వున్నామనుకుంటాం. అన్ని వస్తువుల్ని బేరాలాడి కొనడం మనకు అలవాటయింది. ఎక్కువ ఖరీదైన వస్తువుల్ని వాటినీ బేరాలాడి కొనడంలో తప్పులేదు.

కానీ - ఎంతో తిరిగి, కాళ్ళరిగి వేరుశనక్కాయలో ఈతపళ్ళో అమ్మే అతి సామాన్యుల దగ్గర కూడా మనం బేరసారాలాడతాం. ఎంతో కొంత సంపాదించుకుంటున్నాం కదా మనం దాన ధర్మాలేవీ పెద్దగా చేయక్కరలేదు. వీరి దగ్గర కొద్దిపాటి వెసులుబాటుతో ఉంటే చాలు. వీరి దగ్గర కూడా వారు చెప్పిన ఖరీదుకు పది పైసలో ఇరవై పైసలో తగ్గిస్తావా అని అడుగుతాం. నిజానికి ఆ సమయంలో మనకెంత వున్నా ఇట్టే దరిద్రులమయి పోతున్నామనిపిస్తుంది అన్నారు. ఇటువంటివి చెప్పి మనల్ని ఆలోచింపజేసే అసలు సిసలు మనిషి లక్షణం ఆయనలో నూటికి నూరు శాతమూ వుండేది. ఎప్పుడూ నవ్వుతూ పలకరించేవారు.

ఆయన నటించిన పాత సినిమాలు చూసుకొనడమే వేలకొలది మందికి తీపి గురుతులు.

చూస్తు చూస్తుండగా ఒక ప్రియ మిత్రుడు, ప్రజాహృదయాల్లో స్థానం పొందిన మిత్రుడు మాయమై పోయాడు-

తన కారణరణరంగ క్షేత్రంలో అంటే - వెలితి వెలితే మరి! సాయంకాలం అయ్యటప్పటికి షటిల్ ఆడడానికి వెళ్ళే ఆయన ఇప్పుడు ఎక్కడ సెటిల్ అయ్యాడో కదా!

(45వ పుట తరువాయి...)

గీ॥ వాతశ్లేష్మంబు పైత్యంబు వాంతి మూల
వ్యాధి గ్రహణులు సన్నియు పాండు శూల
రోగములు శోభలాదిగా వేగ మాను
కోమలశ్యామరుచిగాత్ర రామభూప!... అని విశదీకరించాడు.

ఈ విధంగా నవనాథ సిద్ధ సారగ్రంథంలో దైనందిన జీవితంలో ప్రజలు ఎదుర్కొనే అనేక రకాల వ్యాధులు, వాటి ఔషధాలు, ఉపయోగించే విధానం మొదలైన విషయాలన్నింటిని సులభ పద్ధతిలో పామరులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషలో రచించడం గొప్ప విషయం.

1984లో వేటూరి సుందరశాస్త్రి మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము నుండి సేకరించి పరిష్కరించిన ప్రతి ఆధారంగా ఆచంట లక్ష్మీపతి 1926లో మొదటగా 'ధన్వంతరి' పత్రికలో ఈ నవనాథ సిద్ధ సారమును ప్రకటించారు. మరికొన్ని ప్రతులు కూడా మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములో ఉన్నాయి. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థలోని మరో ప్రతి ఆధారంగా కుర్రా జితేంద్రబాబు ఈ పుస్తకాన్ని జూన్ 2012న ప్రచురించారు. విజయవాడలోని పమ్మి సత్యనారాయణ శాస్త్రి సిద్ధ వైద్యసారం అనే ప్రతిని, డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి తాడిపత్రి తాలూకా, కడవకల్లు గ్రామంలోని ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడు అన్నదానం నరసింహాచార్యుల వారసుల నుండి సేకరించిన మరో ప్రతిని జితేంద్ర బాబుకు అందజేశారు. క్రొత్త సంశోధిత ప్రతిని వెలువరించడానికి ఈ ప్రతులు కూడా ఉపయోగపడ్డాయి. ఈ రెండు ప్రతులలో, మూల ప్రతిలో లేని అదనపు విషయాలు లభించాయి. నవనాథ సిద్ధసారమని, నవనాథ శుద్ధప్రదీపకము, వైద్యసారము అని పలు పేర్లతో వ్యవహారంలో ఉండే ఈ తొలి తెలుగు వైద్యగ్రంథం ప్రజలకు సిద్ధవైద్యాన్ని చేరువచేసింది. తరువాతి కాలంలో మరెన్నో తెలుగు వైద్యగ్రంథాలు వెలువడడానికి కారణభూతమైంది.

తెలుగులో వెలువడిన మరెన్నో శాస్త్ర గ్రంథాలను వెలికితీసి భావితరాలకు అందించే ప్రయత్నం మరింత జరగాల్సి ఉంది.

నవనాథ సిద్ధ సారము - రాయసం పేరయ

సంపాదక పరిష్కర్త : కుర్రా జితేంద్రబాబు - 2012

ప్రచురణ : దక్కన్ ఆర్కియాలజికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.

నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 2012 డిసెంబర్ 10, 11 తేదీలలో ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పంలో నిర్వహించిన 'తెలుగుపండుగ' సదస్సులో సమర్పించినపత్రం.

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లి భాష గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

చరిత్ర పరిశోధనయే జీవితకార్యంగా భావించిన
డా॥ కొనకళ్ళ కృష్ణమూర్తి

జి. వెంకటేశ్వరరావు
9491457496



రాయలసీమలో పుట్టిన కొనకళ్ళ కృష్ణమూర్తి కర్నూలు, అనంతపురం, విశాఖపట్నంలలో విద్యాభ్యాసం చేశారు. 'రాయల సీమలోని చిన్న రాజవంశాలు' అనే అంశం మీద పరిశోధన చేసి 1953లో మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించగా –వీరికి మాస్టర్ ఆఫ్ లిటరేచర్ డిగ్రీ వచ్చింది. 1970లో నాగపూర్ విశ్వవిద్యాలయానికి, 'లైఫ్ అండర్ ఇక్ష్వాకూస్ యాస్ డెడికేటెడ్ ఇన్ ది నాగార్జున కొండ స్కల్ప్చర్' అనే అంశాన్ని సమర్పించి, పి.హెచ్.డి. పట్టాను పొందినారు. యస్.బి.దేవ్ అనే ఆచార్యుని పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. గాంధార శిల్పం – ఒక సాంస్కృతిక అధ్యయనం అనే అంశం మీద 1983లో పరిశోధన చేసి డి.లిట్ పట్టాను పొందినారు.

కొనకళ్ళగారు 1954లో పురావస్తు శాఖలో Pottery Assistant గా చేరి గుంటూరు జిల్లాలో నాగార్జున కొండలో పురావస్తు త్రవ్వకాల్లో పాల్గొన్నారు. తరువాత నాగపూర్‌లో పురావస్తు త్రవ్వకాల్లో పాల్గొన్నారు. తరువాత డిప్యూటి సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టుగా పదోన్నతిని పొంది హైదరాబాద్ సర్కిల్‌లో పనిచేశారు. 1984లో మద్రాసులోని టెంపుల్ సర్వే ప్రాజెక్ట్‌లో చేరి 1988లో పదవీ విరమణ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలలో పురావస్తు త్రవ్వకాలలో పాల్గొన్నారు. నంబూరులోని బౌద్ధ అవశేష ప్రాంతములు, సీతానగరంలో విజయకీలాద్రి కొండలు, పెద్ద కుదమగుండ్ల, గుంటూరు జిల్లా – గుత్తికొండలోని ఇక్ష్వాకుల ప్రదేశాలు, మానికేశ్వరంలోని రాతిలోని మెగాలితిక్ బరియల్స్ ప్రాంతాలు, కృష్ణాజిల్లా అన్నగిరి కొండలవద్దగల చారిత్రక ప్రాంతాలను; కర్నూలు జిల్లా కేతవరంలోని ఎర్రమలలోని రాక్‌షెల్టర్స్ మరియు పెయింటిగ్స్ ప్రాంతం, బొమ్మూరులో ప్రాచీన చారిత్రక ప్రాంతాలను, శ్రీకాకుళం వద్ద కారెం ప్రాంతంలో ఉన్న నియోలతిక్ కల్చర్ ఉన్న ప్రాంతాన్ని, ఎర్ర ఇసుక రాతితో ఉన్న వేణుగోపాల, బుద్ధ, పరశురామ, భైరవ, పార్వతి మొదలగు విగ్రహములు ఉన్న ప్రాంతాన్ని, ఆదిలాబాద్‌లో 16వ శతాబ్దంనాటి విగ్రహాలున్న ప్రాంతాన్ని కనుగొన్నారు.

వీరు అనేక పురావస్తు త్రవ్వకాల్లో పాల్గొన్నారు..శాలిహుండం, కోటూరు, పాయంపల్లె, పేని, సుర్కోటడా, కాళీబంగన్ ప్రాంతాలలోని త్రవ్వకాలలో పాల్గొన్నారు. పురావస్తు శాస్త్రవేత్త డా. రావిప్రోలు సుబ్రమణ్యం అమరావతిలో త్రవ్వకాలు జరిపినపుడు (1988 – 89) బౌద్ధ మతానికి సంబంధించిన అవశేషాలు బయల్పడినవి. ఈ త్రవ్వకాలలో కృష్ణమూర్తి పాల్గొన్నారు. శ్రీకాకుళం సమీపంలో ఉన్న కళింగపట్నంలో త్రవ్వకాలు జరిపినపుడు ఇటుకరాతితో నిర్మింపబడిన పెద్ద స్థూపం బయల్పడినది.

కొనకళ్ళవారు పురావస్తు త్రవ్వకాలు జరిపినపుడు బయల్పడిన కళాఖండాలను జాగ్రత్తగా భద్రపరిచినారు. వీరభద్రస్వామి దేవాలయం , లేపాక్షి, చంద్రగిరిలోని ఆంజనేయ స్వామి దేవాలయం మరియు మహల్, కుడువళ్ళిలోని సంగమేశ్వరదేవాలయం, తాటిపత్రిలోని చింతల రామస్వామి దేవాలయం వాటిలో ముఖ్యమైనవి.

కృష్ణమూర్తి 1978లో శ్రీలంకకు వెళ్ళి అచట దక్షిణభారతదేశంలోని బౌద్ధ క్షేత్రములను గురించి ఉపన్యసించారు. గ్రేట్ బ్రిటన్‌లోని రాయల్ ఏషియాటిక్ సొసైటీకి ఫెలోగాను, ఐర్లాండ్ రాయల్ ఏషియాటిక్ సొసైటీ సభ్యునిగాను, రాయల్ సొసైటీ ఆఫ్ ఏషియన్ అఫైర్స్ సంస్థ సభ్యునిగాను ఉండినారు.

కొనకళ్ళవారు అనేక గ్రంథాలను రచించారు. నాగార్జున కొండ– ఎ కల్చరల్ స్టడీ, హెయిర్ స్టయిల్స్ ఇన్ ఏనిసెంట్ ఇండియన్ ఆర్ట్, సోషల్ అండ్ కల్చరల్ లైఫ్ ఇన్ యాన్సియంట్ ఇండియా, మిర్రర్ ఆఫ్ యాన్సియంట్ ఇండియన్ కల్చర్, మెటీరియల్ కల్చర్స్ సాంచి, నొలందా స్కల్ప్చర్స్ అండ్ ఆర్కిటెక్చర్, బుద్ధిజం ఇన్ టిబెట్, బుద్ధిజం ఇన్ జపాన్, బుద్ధిజం ఇన్ సౌత్ ఈస్ట్ ఆసియా, డిక్షనరీ ఆఫ్ ఆర్కియోలాజీ, డిక్షనరీ ఆఫ్ మెడీవోల్ ఆర్కియాలజీ మొదలగు గ్రంథాలను రచించారు. వీరు రచించిన 200 వ్యాసాలు ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడినవి. ఇంతటి ప్రముఖుడు, నిత్యచరిత్ర పరిశోధకుడైన కృష్ణమూర్తి 1996 నవంబరు 5వ తేదీ మరణించారు.

చారిత్రక త్రవ్వకాలే నిత్యకృత్యంగా బతుకును సాగించిన పురాతత్వశాస్త్రజ్ఞుడు కృష్ణమూర్తి. భారతదేశంలో పలు ప్రాంతాలలో పురావస్తు త్రవ్వకాలను భారతపురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి పురావస్తు శాస్త్రవేత్తగా రాణించారు. రచయితగా, వాస్తు విగ్రహ శిల్పాలు, మ్యూజియాలజీ, మట్టి పాత్రలకు సంబంధించిన శిల్పము – మొదలగు అనేక విషయాలలో పాండిత్యం సంపాదించిన కృష్ణమూర్తి యావత్ భారతదేశంలో ప్రఖ్యాత పురాతత్త్వవేత్తగా ఖ్యాతినార్జించడం తెలుగువారికి గర్వకారణం. వీరి కుమారుడు పద్మనాభ హొయశాల శిల్పం ఒక సాంస్కృతిక అధ్యయనం మీద మైసూర్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి పిహెచ్‌డి తెలంగాణా పురావస్తు శాఖలో పనిచేస్తున్నారు.

తెలుగులో పేరు పలక (బోర్డు) లేని అంగళ్లలో కొనుగోలు చేయవద్దు. అవి ఫ్లెక్సీలయినా, ఎంతపెద్ద వ్యాపార సంస్థలయినా తెలుగులో ఉండాలి.

పుస్తక సమీక్ష

అంతర్వాహిని (నాకథ)...



అంతర్వాహిని (నాకథ)
రచన : బి.హనుమారెడ్డి
పుటలు: 180
వెల: అమూల్యం
ప్రతులకు: బి.హనుమారెడ్డి, న్యాయవాదిరాజాపానగల్‌రోడ్ - ఒంగోలు - 523 002
సెల్ : 94402 88080

"మానవజన్మ అద్భుతం - దాని ప్రాయం బుద్బుదం,/ వెన్నెలగీతం మనసు తెరపైకి వచ్చింది, ఈ / అంతర్వాహిని ప్రయాణం సాగించింది" - (రచయిత 'వెన్నెలగీతం' నుండి)

మహానుభావుల జీవిత చరిత్రలు, ఆత్మ కథలు తరువాతి తరాల వారికి తరగని వెలుగవుతాయి. ఎందరికో మార్గదర్శకాలు అవుతాయి. శ్రీ బి.హనుమారెడ్డి 'అంతర్వాహిని' పేరున ఆత్మకథను వ్రాసి ఆ జీవన తరంగాలను, అంతరంగాలను ఎంతో మనోజ్ఞంగా మన ముందుకు తీసుకు వచ్చారు. 78 సంిిల వయసు అందులో 54 సంిిలు న్యాయవాద వృత్తి జీవితం, 20 సంిిలు సాహిత్య (ప్రవృత్తి) జీవితంలోని అనుభవసారం-'మధుర జ్ఞాపకాలు, విధ్వంస జ్ఞాపకాల అగ్గినీ, బుగ్గినీ విచ్చుకున్న సంకల్పాలు, పేర్చుకున్న సమాలోచనలు' మనతో పంచుకున్నారు. ఈ ఆత్మ కథలో విశేషం - తన సమగ్ర జీవితాన్ని సంక్షిప్తంగా చెప్పటం, తొమ్మిది చిన్నచిన్న అధ్యాయాలతో 182 పేజీలలో జీవిత వృత్తాంతం అందులోనూ వివిధ సందర్భాలలో తీసిన వర్ణ చిత్రాలు అనేకం, న్యాయవాద వృత్తినీ, సాహిత్య ప్రవృత్తినీ సమతూకంలో నడిపిన విశిష్టమైన వ్యక్తిత్వం హనుమారెడ్డి గారిది.


ప్రకాశం జిల్లా వెంకటాపురం గ్రామంలో మందహాసమెరుగని మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించి, గుంటూరు ఎ.సి.కాలేజిలో ఇంటర్, హిందూ కాలేజిలో బి.ఏ., వాల్తేరు ఆంధ్రా యూనివర్సిటిలో న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందారు. కొన్నాళ్లు గుంటూరులో న్యాయవాదిత్వం నెరపి, చివరకు ఒంగోలులో స్థిరపడ్డారు. క్రిమినల్ లాయరుగా పేరు తెచ్చుకున్నారు. వృత్తిని దైవ కార్యంగా, సంతృప్తే సంపదగా, వ్యక్తిగా నిబద్ధత వారి విధానం. నిజమైన న్యాయవాదికి సమయపాలన, శాంత స్వభావం, లోకజ్ఞానం ఉండాలని నమ్మి, వాటిని పాటించారు. డబ్బు సంపాదించుకున్నా వృత్తిలో గౌరవాన్ని సంపాదించుకున్నారు. 'నా సామర్థ్యాలను డబ్బు సంపాదనకు కాక, ఇతరుల కన్నీరు తుడవటానికి అంకితం చేసినందుకు సంతుష్టి చెందాను' అన్న జస్టిస్ వి.ఆర్.కృష్ణ అయ్యర్ వాక్యం తనకూ వర్తింపజేసుకున్నారు.

ఈ ఆత్మకథలో ఎక్కువ భాగం - సుమారు 85 పేజీలు తన సాహిత్య జీవితం, సామాజిక జీవితాలకు కేటాయించారు రచయిత. 'పల్లెకు దండం పెడతా'', 'మా ఊరు మొలకెత్తింది', 'వీక్షణం', 'వెన్నెల గీతం', 'పావని' వారికి పేరు తెచ్చిన దీర్ఘ కవితా గ్రంథాలు. 'వెన్నెల పువ్వు', 'గుజ్జన గూండ్లు', కవితా సంపుటాలుగా వెలువడ్డాయి. 'మహిళ', 'విద్యార్థి - భారత రాజ్యాంగము', 'రిజర్వేషన్లు' పరిశోధన గ్రంథాలు. ఆంధ్రదేశాన్ని 100 సంిికు పైగా పాలించిన రెడ్డి రాజుల కథతో పాటు కీర్తిశేషులైన 100 మంది రెడ్డి ప్రముఖుల జీవితాలతో కూర్చిన 'రెడ్డి వైభవం' చారిత్రక గ్రంథం. ఇక 'వర్గకవి శ్రీశ్రీ' కూడా పరిశోధనాగ్రంథమే. ఈ గ్రంథం కొంత వివాదాలకు తావిచ్చినా శ్రీశ్రీని తిట్టలేదు, ప్రశంసించలేదు. కేవలం విశ్లేషించి శ్రీశ్రీని మహాకవి అనటం కన్న వర్గకవి అనటమే సమంజసంగా భావించి ఒక కొత్త సమాలోచన జరిపారు. ఈ విధంగా తాను వ్రాసిన 12 గ్రంథాల వివరాలను అందించారు. కవిత్వం తనకు కాలక్షేపం కాదు, తన ఒక్కడికే కాదు - పాఠకులందరికీ అవగతం కావాలి అంటారు రచయిత. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా 20 సంిిగా ఎన్నో కార్యక్రమాలు, సన్మానాలు కవి. రచయితల సమ్మేళనాలు, 40కి పైగా గ్రంథ ప్రచురణ, 2016 లో సంఘం స్వర్ణోత్సవాలు - వాటి వివరాలు పొందు పరిచారు.

20 సంిిలుగా తెలుగుకోసం శ్రమిస్తున్నా ఒక్క బాలుడుగాని బాలికగాని యువకుడుగాని, వ్యక్తిగాని తెలుగుపై మక్కువ చూపించటంలేదని, కేవలం 50ిిసంిిలు పైబడిన వారే ఆసక్తి చూపుతున్నారని, ఇందుకు మన విద్యావిధానం కారణమని రచయిత అంటారు. చాలకాలంగా మాతృభాషను రక్షించుకోవటంకోసం వేలమంది రచయితలలోకి, లక్షలమంది ప్రజల్లోకి భాషోద్యమాన్ని ప్రయాణింపచేశాడు. ముఖ్యంగా న్యాయస్థానాలలో తెలుగు వినియోగం కోసం ఉద్యమ సమాలోచన చేస్తున్నారు. 20 సంిిగా న్యాయస్థానాలలో వాదోపవాదాలు, దస్త్ర సమర్పణలు తెలుగులోనే చేశారు.

ఈ పుస్తకంలో 'పరిచయాలు-కొన్ని', 'నా అలవాట్లు కొన్ని', 'అవలోకనము' శీర్షికతో మిగత అధ్యాయాలు ఉన్నాయి. వీటిలో రచయిత తనకు గల పరిచయాలు - ప్రముఖులతోనే కాకుండా సామాన్యులతో ఉన్న పరిచయాలు కూడ అక్షరబద్ధం చేసారు. రచయిత సామాజిక సంబంధాలు ఎంత విశిష్టమైనవో ఒక్క ఉదాహరణ చెప్పవచ్చు. తన ఇంటినీ ఆఫీసుని నిర్మాణం చేసిన బేలుదారీ మేస్త్రీ గుర్రం సుబ్బన్న, వెంకట సుబ్బయ్య కార్పెంటరు, శ్రీమన్నారాయణ ఎలక్ట్రీషియన్; ఫొటోగ్రాఫర్ వెంకటేశం, రిక్షా కోటయ్య, మంగలి కొండయ్య యిలా అందరినీ గుర్తుంచుకోవటమే కాకుండా, కొందరినీ ఇతరులతోపాటు తన ఆత్మకథలో పేర్కొన్న విశిష్ట వ్యక్తిత్వం రచయితలో మనంచూస్తాం. ఈవిధంగా తనకథలో సూక్ష్మంగా తన కుటుంబ సభ్యులకథ, ఊరికథ, తనప్రాంత సమాజ కథ,న్యాయవ్యవస్థ కథ, సాహితీ సమాలోచనలు - అంతర్భాగాలుగా ఆవిష్కరించారు. సత్యం చెప్పుకుంటేనే ఆత్మకథకు విలువ ఉంటుందని చెపుతూ ఒక సందర్భంలో 'అమ్మనాన్నలకు సేవలు చేసిన అదృష్టవంతుడను కాను'- అని నిజాయితీగా చెప్తారు. న్యాయవాదులలో కవులు తక్కువ. సాహిత్య కార్యక్రమాల నిర్వాహకులు తక్కువే. మొత్తం మీద న్యాయ దక్షత, కావ్యదక్షత మరియు కార్యదక్షత కలిగిన హనుమారెడ్డి ఆత్మ కథ చాల స్ఫూర్తిమంతం, ఆదర్శవంతం అవుతుందనటంలో సందేహం అవసరం లేదు.

ఎం.వి.శాస్త్రి
9441342999




వాస్తు శాస్త్ర విజ్ఞాన సర్వస్వము
రచన : కోటిపల్లి సుబ్బారావు, 9491524786
పుటలు: 414, వెల: రు.500/-
ప్రతులకు :తెలుగు బుక్ హౌస్, 3-3-862
ఆర్యసమాజ్ ఎదురు వీధి, కాచిగూడ క్రాస్‌రోడ్డు
హైదరాబాద్ - 27
ఫోన్ : 9247446497

స్వప్న ఫల శాస్త్రము : కలలు- వాటి ఫలితాలు
రచయిత:కోటిపల్లి సుబ్బారావు
పుటలు:92, వెల: రు.95/-
ప్రతులకు : కోటిపల్లి సుబ్బారావు, 9491524786
తెలుగు బుక్ హౌస్, 3-3-862
ఆర్యసమాజ్ ఎదురు వీధి, కాచిగూడ క్రాస్‌రోడ్డు
హైదరాబాద్ - 27, ఫోన్ : 9247446497




సర్వజ్ఞ వచనాలు
కన్నడనుండి తెలుగుసేత:గుత్తి(జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి
పుటలు:154, వెల: రు.200/-
ప్రతులకు: పంగులూరి హనుమంతరావు
16-11-511/.జి. /7, శాలివాహన నగర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-36,
ఫోన్-9908648474





పోతనామాత్య కింకరుడు
తెలుగు సేత : గుత్తి(జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి
పుటలు: 124, వెల: రు.60/-
ప్రతులకు :గుత్తి చంద్రశేఖరరెడ్డి,
15, మొదటిదశ, జయప్రకాశ్ నగర్, మియాపూర్
హైదరాబాద్ - 50
సెల్ - 91779 45559




నెత్తుటి పాలపుంత:అలిశెట్టి ప్రభాకర్‌పై వ్యాసాలు
సంపాదకులు:జయధీర్ తిరుమలరావు,బి.నర్సన్
పుటలు: 124, వెల :100/-
ప్రతులకు :అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు, మరియు
సాహితి సర్కిల్, 402, ఘరొండా అపార్ట్‌మెంట్స్,
ఉస్మానియా మెయిన్ గేట్ దగ్గర, 1వ లైను,
డి.డి.కాలని, హైదరాబాద్ - 7
సెల్ : 040-27664525

వీరుల పోరు గద్దె 'మేడారం' : సమ్మక్క సారాలమ్మలపై కోయడోలీల కథ
సంపాదకులు : జయధీర్ తిరుమల రావు
పుటలు:136, వెల: రు.80/-
సాహితి సర్కిల్, 402, ఘరొండా అపార్ట్‌మెంట్స్,
ఉస్మానియా మెయిన్ గేట్ దగ్గర, 1వ లైను,
డి.డి.కాలని, హైదరాబాద్ - 7
సెల్ : 99518 42242



మానవ హక్కులు
రచన : పెండ్యాల సత్యనారాయణ
పుటలు:256, వెల: రు.300/-
ప్రతులకు: సుప్రీం లా హౌస్; మ్యూజియం రోడ్, గోపాలరెడ్డి రోడ్డు క్రాస్, బిగ్‌బజార్ దగ్గర, గవర్నరుపేట, విజయవాడ - 2.
సెల్ : 92464 72080





కొండపల్లి చరిత్ర
సంపాదకులు : ఈమని శివనాగిరెడ్డి - స్థపతి
పుటలు:18, వెల: రు.20/
ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత&సంస్కృతి సమితి
2వ అంతస్తు, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత,
నృత్యకళాశాల, దుర్గాపురం, విజయవాడ
సెల్ : 9618848470





ఆంధ్ర మహావిష్ణు దేవాలయ చరిత్ర :
రచన:ఈమని శివనాగిరెడ్డి - స్థపతి
పుటలు: 64, వెల: రు.50/-
ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత&సంస్కృతి సమితి
2వ అంతస్తు, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత,
నృత్యకళాశాల, దుర్గాపురం, విజయవాడ
సెల్ : 9618848470

జయంతి రామయ్య పంతులుగారి శాసన పద్యమంజరి:
ప్రధానసంపాదకులు:డా॥దీర్ఘాసివిజయభాస్కర్
సంపాదకులు : డా॥ఈమని శివనాగిరెడ్డి, తదితరులు
పుటలు:196, వెల:150/-
ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత&సంస్కృతి సమితి
2వ అంతస్తు, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత,
నృత్యకళాశాల,దుర్గాపురం,విజయవాడ సెల్:9618848470



చేను చెక్కిన శిల్పాలు : కవితలు
రచయిత : సోమేపల్లి వెంకట సుబ్బయ్య
పుటలు:34, వెల: రు.60/-
ప్రతులకు: క్రెసెంట్ పబ్లికేషన్స్,
29-25-43ఎ, వేమూరివారి వీధి,
సూర్యారావుపేట, విజయవాడ - 2





ఆవాజ్ - కవితల సంపుటి
రచయిత : బండి చంద్రశేఖర్
పుటలు: 124, వెల: రు.100/-
ప్రతులకు :బండి చంద్రశేఖర్, 7-2-904/1,
మంకమ్మతోట, కరీంనగర్ - 505001
ఫోన్ : 9440087931

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

2019 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని రెండు తెలుగు రాష్ట్రాలలో 'భాషా హక్కుల దినోత్సవం'గా జరుపుకొందాం

తెలుగు రాష్ట్రాల్లో తెలుగులో పాలనను ప్రభుత్వాల నుండీ, కోర్టులనుండీ పొందాలని కోరుకోవడం ప్రజల హక్కు. అది పాలకుల బాధ్యత. బాధ్యతను విస్మరించే ప్రభుత్వాలను నడిపే పార్టీలను, పట్టించుకోని ప్రజా ప్రతినిధులను నిగ్గదీయడం, పోరాటం చేయటం ప్రజల హక్కు. ఆ హక్కుల సాధనకు పోరాటం చెయ్యని ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను మన్నించ కూడదు. – ఉత్తుత్తి వాగ్దానాలను చేసి, జీవోలను ఇచ్చి కూడా అమలు పరచని పాలక వర్గాలను నిలదీయాలి. విమర్శించాలి. ప్రశ్నించాలి. ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చెయ్యాలి. ఎన్నికల వాగ్దాన పత్రాల్లో (మానిఫెస్టోలు) భాషావిధానం ప్రకటించమని అడగాలి. అలా ప్రకటించక పోయినా, అమలుకు సిద్ధంకాకపోయినా పోరాటం చెయ్యాలి.

అందుకే –రానున్న 21-2-2019 గురువారం నాడు రెండు రాష్ట్రాల్లోని ప్రజలంతా 'భాషా హక్కుల దినోత్సవం' గా జరుపుకొందాం. ఆ రోజున ఎవరికి తోచిన పద్ధతుల్లో వారుగా నిరసన ప్రకటనలు, డిమాండ్ల ప్రకటనలు చేద్దాం. ప్రభుత్వాలను, పార్టీలను నిలదీద్దాం.

<u>నిక్కచ్చులు (డిమాండ్లు)</u>

1. రెండు తెలుగు రాష్ట్రాల్లో సచివాలయం నుండి పంచాయితీ వరకు – పరిపాలన అంతా తెలుగులో జరగాలి. ఇందుకు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బాధ్యత వహించాలి.

2. పాఠశాలల్లో బోధన అంతా మాతృభాషల్లో జరగాలి. ప్రాథమిక స్థాయి వరకు దీనిని తప్పనిసరి చెయ్యాలి. పై తరగతుల్లో బోధనామాధ్యమాన్ని ఎంచుకొనే స్వేచ్ఛ ఇవ్వవచ్చు.

3. కేవలం ఒక సబ్జెక్టుగా మాతృభాషను బోధిస్తామనడం, మాతృభాషల్ని ఉపయోగం లేకుండా చేసి వాటి నెత్తిన మేకు కొట్టి ఎదగకుండా చేయడమే. ఆధునిక భాషగా వినియోగంలోకి తేకపోతే అవి నశిస్తాయి. వాడని భాషలు వాడిపోతాయి. భాషలను నశింపజేసే విధానాలను మనం ఒప్పుకోం.

4. రానున్న ఎన్నికలకు పార్టీలు తమ ఎన్నికల ప్రణాళిక (వాగ్దానాల పత్రం)ల్లో పాలనలో బోధనలో తమ భాషా విధానాన్ని ప్రకటించాల్సిందే. అలా ప్రకటించని పార్టీలకు మనం ఓటు వెయ్యవద్దు.

విన్నపం : తెలుగు భాషోద్యమ సమాఖ్య పిలుపును ఇష్టపడే అన్ని సంఘాలు, వ్యక్తులు, సంస్థలు – ఈ డిమాండ్లతో కార్యక్రమాలను నిర్వహించాలని, విన్నవిస్తున్నాం. కోరినవారికి తగు సహకారం అందించడానికి సమాఖ్య సిద్ధంగా ఉంది. సంప్రదించండి

– డా॥ సామల రమేష్‌బాబు, అధ్యక్షులు, తెలుగుభాషోద్యమ సమాఖ్య, 98480 16136

హైదరాబాదులో సభ – ఆహ్వానం

'సమైక్యభారతి' నిర్వహణలో – అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఫిబ్రవరి 21 సాయంత్రం 5.30 గం.లకు – హైదరాబాదులో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా॥ నందమూరి తారక రామారావు కళాకేంద్రంలో జరుగుతుంది. ప్రముఖులు పాల్గొంటారు. వివరాలకు : పి.కన్నయ్య (9893764057) సంప్రదించవచ్చు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
February 2019 Vol :4, Issue 12

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20



If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244